అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 11-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 44 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

అమాత్యులు..
ఉన్నట్టా.. లేనట్టా!

• ఎస్సీ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షల్లేవ్ • బడ్జెట్ ప్రతిపాదనలు శూన్యం

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమానికే మాతొలి ప్రాధాన్యం అని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆ విధంగానే ఏడాదిన్నర పాటు సంక్షేమ శాఖను ఆయనే స్వయంగా పర్యవేక్షించారు. కానీ ఏనాడూ సంక్షేమం, పథకాల అమలు తీరుపై సమీక్షలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఆ తర్వాత ఎస్సీ సంక్షేమం బాధ్యతలను విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి అప్పగించారు. ఆయన కూడా సంక్షేమంపై ఏ ఒక్క రోజు కూడా సమీక్షలు నిర్వహించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సీఎం కేసీఆర్ సంక్షేమ శాఖను చూస్తున్నప్పడు పని ఒత్తిడిలో పట్టించుకోలేదనీ, కానీ మంత్రి కూడా పట్టించుకోవడం లేదంటే ఏమనాలని దళిత సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎస్సీ సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు, లబ్దిదారులకు రుణాలు, మూడెకరాల భూ పంపిణీ లాంటి కీలకమైన పథకాల అమలు తీరుపై సమీక్షలు నిర్వహించలేదన్న విమర్శలు వస్తున్నాయి.



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జనం ఎంతగానో సంతోషించారు. తమ ఆశలు నెరవేరుతాయని భావించారు. సంక్షేమ పథకాలు సజావుగా కొనసాగుతాయని ఆశించారు. కానీ సంక్షేమ పథకాల అమలు తీరు యథారాజా తథాప్రజా అన్నట్టుగా మారింది. ఇటీవలి కాలంలో దళితులపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించలేదంటే సంక్షేమం పట్ల మంత్రికి శ్రద్ధ లేదన్న విషయం స్పష్టమవుతున్నదని దళిత సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష శూన్యం

బడ్జెట్ సమావేశాలు దగ్గరపడుతున్నా ఆయన నేటికి బడ్జెట్ ప్రతిపాదనలపై స్వయంగా సమీక్ష నిర్వహించలేదన్న విమర్శలు వస్తున్నాయి. 2017-18 వార్షిక బడ్జెట్‌లో సంక్షేమానికి కేటాయించిన నిధులు.. చేసిన ఖర్చుల వివరాల గురించి మంత్రి సమీక్షలు నిర్వహించకపోవడం వల్ల అధికారుల్లో జావాబుదారీతనం లోపించిందని పలువురు సంక్షేమ శాఖ అధికారులే చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్స రంలో సంక్షేమ శాఖకు కేటాయించిన రూ.4650 కోట్లలో కనీసం అర్ధ శాతం నిధు లు కూడా ఖర్చు కాలేదు. దళిత ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయిం చిన రూ. 14వేల కోట్లలో ఇప్పటికీ కనీసం రూ.6వేల కోట్లు కూడా ఖర్చు కాలేదంటే సంక్షేమ శాఖ పని తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

సబ్‌ప్లాన్‌పై సమావేశాలేవి?

దళిత సంఘాలు పోరాడి సాధించుకున్న సబ్‌ప్లాన్‌పై సమీక్షలు కూడా నిర్వహించలేదు. కొన్ని శాఖలు సబ్‌ప్లాన్‌కు నిధులు విడుదల చేయకున్నా మంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. విడుదల చేసిన నిధులను కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేని పరిస్థితి ఉంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి మంత్రి, ప్రతి ఆరు నెలలకు ఒక సారి ముఖ్యమంత్రి సబ్‌ప్లాన్ నిధుల వ్యయంపై సమీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ అటు మంత్రి, ఇటు సీఎం సమీక్షలు నిర్వహించకపోవడం వల్ల సబ్‌ప్లాన్ ఆశయం నీరుగారిపోతున్నదని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ గురించి పట్టింపే లేదు

మరో నెల రోజుల్లో 2018-19 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నా నేటికి బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి సమీక్ష నిర్వహించలేదు. కనీసం 9లో

ఎర్రజెండాను ఖతం చేస్తామన్నవారే..
కనుమరుగయ్యారు..

ప్రజా పోరాటాలే మా పంథా



- ఎర్ర జెండాకు పూర్వ వైభవం తెద్దాం
- ఉద్యమాలకు పెరుగుతున్న అవకాశాలు
- ఐక్యతను దెబ్బతీసేందుకు మత ఘర్షణలు : సీపీఐ(ఎం) 25 ఏపీ రాష్ట్ర మహాసభల ప్రారంభోపన్యాసంలో ఏచూరి

వివరాలు 10లో

మీ ఆకాంక్షల్ని గౌరవిస్తాం

పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో కలిసి మీడియా భేటీలో ప్రధాని మోడీ

రమల్లా: భారత విదేశాంగ విధానంలో పాలస్తీనాకు ఉన్నత స్థానం ఉంటుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. శాంతియుత పద్ధతుల్లోనే పాలస్తీనాకు త్వరలోనే పూర్తి స్వేచ్ఛ లభిస్తుందని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్-పాలస్తీనా సంబంధాలు పరీక్షకు నిలిచాయని, పాలస్తీనా ప్రజల ఆకాంక్షలను భారత్ గౌరవిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్‌కు ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ పాలస్తీనాతో పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పాలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్‌తో కలిసి ప్రధాని మోడీ సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇరు దేశాలకు పరస్పరం వెళ్లనున్న విద్యార్థుల సంఖ్యను 50 నుంచి 100కు



పెంచుతున్నట్టు ప్రధాని మోడీ ప్రకటించారు. మొదటిసారి పాలస్తీనా వెళ్లిన ప్రధాని మోడీకి ఆ దేశాధినేతల నుంచి ఘనస్వాగతం లభించింది. గొప్ప అతిథికి స్వాగతమిస్తున్నందుకు గర్వపడు తున్నా, పాలస్తీనాలో మొదటిసారి మీరు జరుపుతున్న పర్యటన భారత ప్రజలకు మా పట్ల 9లో

ఆధార్ లేదని వైద్యానికి నిరాకరణ...

- ఎమర్జెన్సీ వార్డు ముందే మహిళ ప్రసవం
- గుర్గావ్ ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నిర్వాకం

వివరాలు 2లో

దుమ్మా కొడుతున్న ఉద్యోగులపై కొరడా..

- 13 వేల మంది సర్వీసు రద్దు చేయనున్న రైల్వే..

వివరాలు 2లో

పెరిగిన వరి సాగు

పుంజుకోని రబీ.. గతేడాది కంటే తక్కువే..

- ఆహారధాన్యాల సాగులోనూ అంతే



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రబీ సీజన్‌లో ఒక వరి సాగు తప్పా ఇతర అన్ని పంటల విస్తీర్ణం తగ్గింది. ఈ సీజన్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 3.25 లక్షల హెక్టార్లు అయితే ప్రస్తుతం సాగైంది 6 లక్షల హెక్టార్లు. రబీ సీజన్ సాగు విస్తీర్ణం 12.77 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు సాగైంది 10.83 లక్షల హెక్టార్లు మాత్రమే. గత ఏడాది ఇదే సమయానికి 11.51 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గతేడాది మిర్చికి, కందులకు ధర రాకపోవడంతో ఈ ఏడాది ఆ పంటల జోలికి వెళ్లలేదని తెలు స్తోంది. గత సంవత్స రం కందులు క్వింటాలుకు పెరిగిన వరి సాగు 9లో

మతి స్థిమితంలేని యువతిపై..

ఆ మృగానికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత



నవతెలంగాణ-భద్రాచలం

మతి స్థిమితం లేని యువతిపై లైంగికదాడి జరిగిన ఘటన శనివారం భద్రాచలం పట్టణంలో వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మనుబోతుల చెరువు ప్రాంతానికి చెందిన యువతిపై నాలుగు నెలలుగా అదే ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ వీసంపల్లి రాంబాబు లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బాధితురాలిని బెదిరించాడు. యువతి గర్భం దాల్చడంతో విషయం బయటకు పొక్కింది. కాలనీ వాసులు రాంబాబుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కరుణాకర్ తెలిపారు.



బీజేపీ కార్యకర్తల విధ్వంసం

- ఒడిషా సీఎం ప్రయివేటు కార్యదర్శి పాండియన్ నివాసంపై దాడి
- ద్విచక్ర వాహనాలు, పూలకుండీలు ధ్వంసం
- నలుగురు అరెస్టు
- దాడిని సమర్థించిన బీజేపీ

వివరాలు 2లో

సమాన వేతనమివ్వాలి

డైరెక్టరేట్‌ను ముట్టడించిన కేజీబీవీ, యూఆర్ఎస్ టీచర్లు



హైదరాబాద్‌లో..

వివరాలు 9లో

కేయూలో లొల్లి..

పీహెచ్‌డీ అవకతవకలపై విద్యార్థి సంఘాల ధర్నా

- బిల్డింగ్ ఎక్కి సామూహిక ఆత్మహత్యాయత్నం
- విద్యార్థులను అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు 9లో



జమ్మూ అసెంబ్లీలో పాక్ అనుకూల నినాదాలు

- నేషనల్ కాన్ఫరెన్స్ సీనియర్ ఎమ్మెల్యే తీరు వివాదాస్పదం

వివరాలు 2లో



అలవాటు లేని పని చేయడం మావల్ల కాదయ్యా..!!

తెరపైకి మహాకూటమి

కాంగ్రెస్ ఎత్తుల వెనుక..!

- కోదండరామ్‌తో అధిష్టానం చర్చలు
- బయటి నుంచి మందకృష్ణ మద్దతు?

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణరాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో కొత్త ఫ్రంట్ దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌పార్టీ, టీడీపీ, టీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా వామపక్షాలు, ఇతర సామాజిక శక్తుల ఆధ్వర్యంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీ కూడా కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలతో కలిసి ఫ్రంట్ ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. 'మహాకూటమి', 'సామాజిక తెలంగాణ సాధన ఫ్రంట్', ప్రజా ఫ్రంట్ వంటి పేర్లను కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తున్నట్టు తెలిసింది. టీఆర్ఎస్‌పార్టీ ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలన్న ఒకే ఒక్క 9లో



(ఫైల్)

జమ్మూలో ముష్కరదాడి

- ఆర్మీ క్యాంపులోకి చొరబడ్డ ఉగ్రవాదులు
- కాల్పుల్లో ఇద్దరు సైనికాధికారులు మృతి
- బాలిక సహా ఆరుగురికి గాయాలు
- ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన బలగాలు

వివరాలు 2లో



లోక్ అదాలత్‌లో ఒక్కరోజే
28 వేలకేసులు పరిష్కారం

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిపిన లోక్ అదాలత్‌లో ఒక్కరోజే ఏకంగా 28 వేల కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో శనివారం లోక్‌అదాలత్‌లను నిర్వహించారు. వాటిలో 28 వేల కేసుల పరిష్కారం ద్వారా 58.4 కోట్ల రూపాయల మేరకు కక్షిదారులకు 9లో



లోయా కేసులో స్వతంత్ర దర్యాప్తును వ్యతిరేకించిన మహారాష్ట్ర

న్యూఢిల్లీ : సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన వ్యాజ్యాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. ఈవ్యాజ్యాన్ని 'ప్రేరేపించ బడిందని', 'ఎల్లో జర్నలిజమని' ఆరోపించింది. సోహ్రాబుద్దిన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న లోయా తన సహోద్యోగి కుమార్తె పెళ్ళికి నాగపూర్ వెళ్లిన సమయంలో అక్కడ గుండెపోటుతో మరణించారు. నలుగురు న్యాయాధికారులు వాంగ్మూలాలు నమోదు చేసిన తర్వాత ఈ కేసు విచారణ ముగించాల్సి ఉందని, ఈ న్యాయమూర్తులను నమ్మాలని లేకుంటే ఈకేసులో వారు అబద్ధాలు చెబుతున్నారని భావించినట్లవుతుందని మహారాష్ట్ర ప్రభుత్వం తరుపున హాజరైన సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గి ..ప్రధాన న్యాయమూర్తి దీపాక్ మిశ్రాతో కూడిన ధర్మాసనానికి తెలిపారు.

న్యాయమూర్తికి న్యాయం చేయడానికి 19 ఏండ్లు!

చండీగఢ్: ఏండ్లు గడుస్తున్నా కోర్టుల్లో కేసులు తేలకపోవడం మనం చూస్తూ ఉంటాం. అయితే సాక్షాత్తూ ఒక న్యాయమూర్తికే ఇలాంటి పరిస్థితి ఎదురైన ఘటన సంచలనం సృష్టించింది. తమ కోర్టులోనే గతంలో న్యాయమూర్తిగా వ్యవహరించిన జడ్జికి న్యాయం అందించేందుకు పంజాబ్, హర్యానా హైకోర్టుకు 19 ఏండ్లు పట్టింది. జస్టిస్ ఎఎల్ బహ్రికి ఇంటి అద్దె అలవెన్సులను ఇచ్చేందుకు పంజాబ్ ప్రభుత్వం గతంలో నిరాకరించింది. రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షుడిగా బహ్రిని నియమించిన తర్వాత ఆయనకు ముందు పనిచేసిన వారితో సమానంగా ఇంటి అద్దెను చెల్లించేందుకు ప్రభుత్వం నిరాకరించింది. దీనిపై ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు 19 ఏండ్ల తరువాత దీనికి సంబంధించి ప్రభుత్వ వాదనను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. మాజీ న్యాయమూర్తి పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుచితంగా ప్రవర్తించిందని వెల్లడించింది. ప్రభుత్వ ఉద్యోగికి, హైకోర్టు సిట్టింగ్ లేదా మాజీ న్యాయమూర్తికి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవడం లేదని న్యాయమూర్తులు ఎబి చౌదరి, అనిల్ క్షేత్రపాల్ కూడా ప్రభుత్వాధికారుల తీరును తప్పు పట్టారు.

డుమ్మా కొడుతున్న ఉద్యోగులపై కొరడా..

- 13 వేల మంది సర్వీసు రద్దు చేయనున్న రైల్వే..



న్యూఢిల్లీ: చెప్పాపెట్టకుండా విధులకు గైర్హాజ రవుతున్న ఉద్యోగులపై కొరడా ఝులిపించేందుకు భారత రైల్వే శాఖ సిద్ధమైంది. అనధికారికంగా దీర్ఘకా లిక సెలవుల్లో ఉన్న దాదాపు 13 వేల మంది రైల్వే ఉద్యోగుల సర్వీసును రద్దు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు, సూపర్‌వైజర్లకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగుల హాజరు, వారి పనితీరు ఎలా ఉందన్న దానిపై రైల్వే స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. అంతేకాక.. క్రమశిక్షణ, అంకితభావంతో పని చేస్తున్న ఉద్యోగులను ఈ డ్రైవ్ ద్వారా గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహకాలు అందించాలని కూడా భావించింది. అయితే.. రైల్వేలో దాదాపు 13 వేల మంది దీర్ఘకాలికంగా విధులకు హాజరుకావడం లేదని, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సెలవులో ఉన్నారని డ్రైవ్‌లో తేలింది. దీంతో సదరు ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యల కింద.. సర్వీసును రద్దు చేయాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకున్నది.

అసెంబ్లీలో పాక్ అనుకూల నినాదాలు..

- నేషనల్ కాన్ఫరెన్స్ సీనియర్ ఎమ్మెల్యే తీరు వివాదాస్పదం

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే మహ్మద్ అక్బర్ లోన్ పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేయడం వివాదాస్పదమయ్యింది. సుంజ్వాన్‌లోని ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రవాదులు చేసిన దాడిని ప్రస్తావిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో పాక్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరికి సవాలుగా అక్బర్ లోన్ 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ జైకొట్టారు. బీజేపీ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలని ఎన్‌సీ ఎమ్మెల్యేలు జావేద్ రానా, అలీ మహ్మద్ సాగర్, అక్బర్ లోన్ స్పీకర్ చాంబర్‌లోకి దూసుకెళ్లారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడటంతో స్పీకర్ కవిందర్ గుప్తా అసెంబ్లీని వాయిదా వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన అక్బర్ తాను చేసిన పాక్ అనుకూల వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. 'బీజేపీ ఎమ్మెల్యేలు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా చేసిన నినాదాలు చేశారు. వారు ముస్లింలను ద్వేషించడంతోనే నేను పాక్‌కు అనుకూలంగా నినాదాలు చేశాను" అని పేర్కొన్నారు. అక్బర్ చేసిన ఈ వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

ఆధార్ లేదని వైద్యానికి నిరాకరణ...

- ఎమర్జెన్సీ వార్డు ముందే మహిళ ప్రసవం
- గుర్గావ్‌లో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నిర్వాకం

గుర్గావ్: పురిటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిన ఒక మహిళపట్ల ఆస్పత్రి సిబ్బంది అమానవీయంగా ప్రవర్తించారు. ఆధార్ కార్డు లేదని ఆమెకు వైద్యం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆమె ఎమర్జెన్సీ వార్డు ముందే బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన ఢిల్లీకి సమీపంలోని గుర్గావ్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి భర్త అరుణ్ కేవాత్ తెలిపిన వివరాల ప్రకారం... అరుణ్ కేవాత్ భార్య.. మున్నీ కేవాత్(25)కు శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పురిటినొప్పులు రావడంతో ఆమెను గుర్గావ్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రసూతి వార్డుకు తీసుకెళ్లగా, అక్కడున్న మహిళా వైద్యురాలు, నర్సు.. మున్నీ ఆధార్ కార్డు తీసుకురావాలని లేకుంటే చేర్చుకోమన్నారు. ఆధార్ నెంబర్ చెప్తానని, తర్వాత కార్డు తీసుకొస్తానని తన భార్యను చేర్చుకోవాలని చెప్పినా ఆస్పత్రి సిబ్బంది వినిపించుకోలేదు. దీంతో తనతో వచ్చిన బంధువులని ఆమెతో ఉండమని చెప్పి.. ఆధార్ కార్డు తీసుకురావడానికి వెళ్లాడు. బంధువులు ఆమెను క్యాజువాలిటీ వార్డుకు తీసుకెళ్తే, సిబ్బంది అక్కడి నుంచి బయటకు పంపించారు. అప్పటికే పురిటి నొప్పులతో బాధపడుతున్న మున్నీ.. ఎమర్జెన్సీ వార్డు ముందే బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటనంతా చుట్టూ పక్కలున్న వారు చిత్రీకరిస్తున్నా ఆస్పత్రి సిబ్బంది మాత్రం సహాయం చేయలేదని బాధితురాలి బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న గుర్గావ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ బీకే రజోరా సంబంధిత సిబ్బందిని సస్పెండ్ చేశారు.

'మదురై' ఆలయంలో ఫోన్లు, ప్లాస్టిక్ నిషేధం

- మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు

చెన్నై: తమిళనాడులోని మదురై మీనాక్షి ఆలయంలో మొబైల్ ఫోన్లు, ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అయితే..ఆలయంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి ఫోన్ల నిషేధంపై మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది. ఈ ఆలయంలో ఇటీవల భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే.

దీనిపై ఓ న్యాయవాది.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆలయాల వద్ద భద్రతా ప్రమాణాలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసేలా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని తన పిటిషన్‌లో కోరారు. దీనిపై న్యాయమూర్తులు ఎన్ కిరుబాకరన్, ఆర్ థరానీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆలయ నిర్వహణ, భద్రతా ప్రమాణాలను చూసుకునేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. అంతేకాక, రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో హై సెక్యూరిటీ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపింది. ఫైర్ సేఫ్టీ పరికరాలపై ఆలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీ కార్యకర్తల విధ్వంసం



ఒడిషా సీఎం ప్రయివేటు కార్యదర్శి పాండియన్ నివాసంపై దాడి

- ద్విచక్ర వాహనాలు, పూలకుండీలు ధ్వంసం
- నలుగురు అరెస్టు
- దాడిని సమర్థించిన బీజేపీ


భువనేశ్వర్ : ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రయివేటు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి వి.కార్తికేయన్ పాండియన్ అధికారిక నివాసాన్ని బీజేపీ కార్యకర్తలు శనివారం ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిని పోలీసులు అరెస్టు చేసినప్పటికీ, తమ కార్యకర్తలు చేసిన విధ్వంసాన్ని బీజేపీ రాష్ట్ర నేతలు సమర్థించడం గమనార్హం. ఒక ప్రభుత్వాధికారి నివాసంపై రాజకీయ పార్టీకి చెందిన కార్యకర్తలు దాడి చేయడం ఇదే తొలిసారి. దీంతో ముఖ్యమంత్రితో సన్నిహితంగా ఉండి పనిచేసే వారిపై దాడి చేయాలన్న బీజేపీ వ్యూహం వెల్లడైంది. భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం)కు చెందిన దాదాపు 30 మంది కార్యకర్తలు పార్టీ జెండాలను పట్టుకుని పాండియన్ అధికారిక నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, బీజేపీ కార్యకర్తలు సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి పాండియన్ అధికార నివాసంలోకి దూసుకెళ్లారు. అక్కడున్న పలు ద్విచక్ర వాహనాలను, పూలకుండీలను ధ్వంసం చేశారు. బీజేపీ కార్యకర్తలను అడ్డుకునేందుకు సెక్యూరిటీ గార్డులు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు.

బీజేపీ కార్యకర్తలు తనపై చెయ్యి చేసుకున్నారని, పాండియన్ నివాస ఆవరణలో ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారని ఒక సెక్యూరిటీ గార్డు మీడియాకు తెలిపాడు. ఈ సంఘటన జరిగే సమయంలో పాండియన్ అక్కడ లేరు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. ఘటనపై సమాచారమందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిని అరెస్టు చేశామని, దీనిపై మరింత దర్యాప్తు కొనసాగుతున్నదని ఏసీపీ మానస్ గార్నయక్ తెలిపారు. ఈ ఘటన పోలీసుల నిఘా వైఫల్యాన్ని వెల్లడిస్తోంది. బీజేపీ కార్యకర్తల ఆందోళనకు సంబంధించిన చిన్న క్లూ కూడా పోలీసుల వద్ద లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కొంతమంది బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేశామని, దీనితో ప్రమేయమున్న మరికొందరిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని భువనేశ్వర్-కటక్ పోలీసు కమిషనర్ తెలిపారు.

ముష్కర దాడి

ఆర్మీ క్యాంపులోకి చొరబడ్డ ఉగ్రవాదులు

- ఇద్దరు సైనికాధికారులు మృతి
- బాలిక సహా ఆరుగురికి గాయాలు
- ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన బలగాలు



శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. ఆర్మీ క్యాంపులోకి చొరబడ్డ ముష్కరులు విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూ విధ్వంసం సృష్టించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు మహిళలు, బాలిక సహా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కరుడు గట్టిన టెర్రరిస్టులు అఫ్జల్ గురు, మక్బూల్ భట్ వర్ధంతుల నేపథ్యంలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘావర్గాలు హెచ్చరించిన మరుసటి రోజే ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. జమ్మూ పట్టణ శివారులో ఉన్న సుంజువాన్ ఆర్మీ క్యాంపులోకి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు నలుగురు ఉగ్రవాదులు ప్రవేశించారు. క్యాంపులోని ఫ్యామిలీ క్వార్టర్స్‌లోకి చొరబడి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరపడంతో ఉగ్రవాదులు క్వార్టర్స్‌లోనే తలదాచుకున్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడిన ఇద్దరు మహిళలు, బాలిక, ముగ్గురు జవాన్లను సత్వారీలోని మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన బాలిక ఆర్మీ అధికారి మదన్‌లాల్ చౌదరీ కూతురు అని తెలిసింది. ఇదే ఘటనలో ఇద్దరు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు మంగన్‌లాల్, మహమ్మద్ అష్రఫ్‌లు ప్రాణాలు కోల్పోయారు.

ముగ్గురు ఉగ్రవాదులు హతం

ఉగ్రవాదుల చొరబాటు నేపథ్యంలో క్యాంపు సమీపంలో హైఅలర్ట్ ప్రకటించిన పోలీసు ఉన్నతాధికారులు.. అక్కడి స్కూళ్లనన్నింటినీ మూసివేశారు. శనివారం రాత్రి ముగ్గురు ఉగ్రవాదులను జవాన్లు మట్టుబెట్టారు. అతడి వద్ద నుంచి ఏకే47 తుపాకీతో పాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

క్యాంపులో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. మిలిటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జమ్మూకాశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ పరామర్శించారు. క్యాంపులోకి చొరబడిన ఉగ్రవాదులు జైషేకు చెందిన వారేనని సైనిక ఉన్నతాధికారులు నిర్ధారణకొచ్చారు. భారత పార్లమెంటుపై దాడి కేసులో అఫ్జల్ గురును 2013 ఫిబ్రవరి 9న తీహార్ జైలులో ఉరి తీశారు. జమ్మూకాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్(జేకేఎల్ఎఫ్) సహ వ్యవస్థాపకుడు మక్బూల్ భట్‌ను 1984 ఫిబ్రవరి 11న ఉరి తీశారు.

దేశభక్తి వట్టిమాటలే...

వేర్పాటు వాదంపై బీజేపీ భిన్న స్వరం

- కాశ్మీర్‌లో అలా..త్రిపురలో ఇలా..
- రక్తచరిత్ర కలిగిన ఐపీఎఫ్‌టీ కమలం దోస్తీ
- ప్రధాని జోక్యంతో పొత్తు ఖరారు

త్రిపుర ముఖచిత్రం

నవతెలంగాణ - జనరల్ డెస్క్

ఓ వైపు కాశ్మీర్‌లో వేర్పాటువాద ఉద్యమాలను అణగదొక్కుతామంటున్న ఎన్డీఏ సర్కారు.. మరోవైపు అలాంటి రక్తచరిత్ర కలిగిన పార్టీతో జతకట్టడానికి బీజేపీ ఏమాత్రం వెనకడుగువేయలేదు. సాధారణంగా ప్రాంతీయంగా ఉన్న పార్టీలతో మచ్చిక చేసుకోవటానికి ఆ పార్టీ అధ్యక్షుడు సీన్లో దిగుతాడు. కానీ త్రిపురలో మాత్రం అందుకు భిన్నంగా ప్రధాని మోడీ రంగప్రవేశం చేశారు. సుమారు రెండున్నర దశాబ్దలపాటు అధికారంలో కొనసాగుతున్న లెఫ్ట్ పార్టీని ఢీకొనాలంటే.. ఒంటరిగా దిగితే.. పుట్టగతులుండవని బీజేపీ అధిష్టానానికి అర్థమైంది. ఎలాగైనా త్రిపుర కోట దక్కించుకోవాలన్న వ్యూహానికి పదును పెట్టి చివరకు వేర్పాటువాద సంస్థతో సైతం పొత్తుకు దిగజారింది. త్రిపురలోని మాణిక్ సర్కార్ ప్రభుత్వం జనాదరణతో వేస్తున్న అడుగులకు అక్కడి జనం నీరాజనం పడుతున్నారు. దేశానికి ఆదర్శపాలన అందిస్తూ ముందుకుసాగుతున్నారు. ఇది బీజేపీకి మింగుడుపడటంలేదు. అందుకే ప్రధాన మంత్రి స్థాయిలో లాబీ నడిపారు. స్థానిక గిరిజన తెగకు చెందిన వేర్పాటువాద సంస్థ ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్‌ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుకుదుర్చుకుంది. ఈ నెల 18న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేసేందుకు కనీస ఉమ్మడి ప్రణాళికను ఖరారు చేశారు. తాము 'జాతీయవాద', 'దేశభక్తి' శక్తులుగా పదేపదే కితాబులిచ్చుకుంటున్న బీజేపీ... చిన్నపాటి సరిహద్దు రాష్ట్రంలో వేర్పాటువాద బృందానికి మిత్రపక్షంగా మారింది. దీన్ని బట్టి చూస్తే.. బీజేపీకి ఎన్నికల్లో గెలుపే ప్రాధాన్యమని, దేశభక్తి గురించి చెప్పేదంతా అబద్ధమేనని రాజకీయ పరిశీలకులు సైతం విమర్శిస్తున్నారు. ఐపీఎఫ్‌టీ చరిత్ర గురించి దేశ ప్రజలకు పూర్తిగా తెలియకపోయినప్పటికీ... త్రిపుర ప్రజలకు మాత్రం దాని రక్తచరిత్ర సుపరిచితమే. బీజేపీ ఎన్నికల కోసం పొత్తు పెట్టుకున్న వేర్పాటువాద సంస్థ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే....

త్రిపుర ఉపజాతి జబు సమితి (టీయూజేఎస్) అని పిలవబడే గిరిజన సంస్థ నుంచి వేరుపడ్డాక 1990 చివరిలో హరినాథ్ దేవ్‌బర్మ, నరేంద్ర చంద్ర దేవ్‌బర్మ ఐపీఎఫ్‌టీని స్థాపించారు. 1980లో హరినాథ్ దేవ్‌బర్మ టీయూజేఎస్‌లో ఉన్నప్పుడు బెంగాలీలను త్రిపుర నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. 1990లో గిరిజన అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (టీఏడీసీ) ఎన్నికల సందర్భంగా జరిగిన హింస అంతా ఇంతాకాదు. ప్రశాంతంగా ఉండే ఆదివాసులు భయపడేలా దాడులు చేసి మరీ రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. 2000లో టీఏడీసీకి జరిగిన ఎన్నికల్లో గిరిజనులను భయపెట్టడం ద్వారా ఐపీఎఫ్‌టీ విజయం సాధించేందుకు సాయుధ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఎన్‌ఎల్ఎఫ్‌టీ) సహాయపడింది. ఐపీఎఫ్‌టీ మరో నేత నరేంద్ర చంద్ర దేవ్‌బర్మ ఆలిండియా రేడియో అగర్తల స్టేషన్ డైరెక్టర్‌గా పనిచేసేవారు. తీవ్రవాదులతో అతనికి బలమైన సంబంధాలున్నాయనీ, బంగ్లాదేశ్ తరచుగా వెళ్లేవాడని విస్తృత ప్రచారం జరిగింది. 1998 నుంచి 2007 వరకు త్రిపురలో పలు తీవ్రవాద సంస్థలు రక్తపాతాన్ని సృష్టించాయి. గిరిజన హక్కుల కోసం పోరాడుతున్నామని ఆ సంస్థలు ఒకపక్కన చెబుతూనే.. మరో పక్క దాడులకు తెగబడ్డాయి. ఈ హింసాత్మక దాడుల్లో 2,200 మంది హత్యకు గురయ్యారు. అందులో అత్యధిక మంది గిరిజనం కావడం గమనార్హం. లెఫ్ట్ ఫ్రంట్ చాకచక్య నాయకత్వం నీడలో చైతన్యవంతులైన గిరిజనం తీవ్రవాద సంస్థల హింసాత్మక చర్యలకు ముగింపు పలికారు. 2002లో, టీయూజేఎస్, ఐపీఎఫ్‌టీ రెండూ విలీనమై ఇండిజినస్ నేషనల్ పార్టీ ఆఫ్ త్రిపుర (ఐఎన్‌పీటీ)గా కొత్త అవతారం ఎత్తింది. 2003 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఒక కూటమిని ఏర్పాటుచేసింది. 60 సభ్యుల అసెంబ్లీలో 6 స్థానాలను గెలుచుకుంది. 2009 లోక్‌సభ ఎన్నికలకుముందు ఎన్.సి. దేవ్‌బర్మ ఐఎన్‌పీటీ నుంచి బయటకువచ్చారు. ఐపీఎఫ్‌టీని పునరుద్ధరించారు. టీఏడీసీ, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం కొనసాగింది. కాగా, అన్నిటిలోనూ తీవ్ర పరాభవం ఎదురైంది. దీంతో ఐఎన్‌పీటీ నుంచి ఒక్కొక్కరుగా బయటకువచ్చి సొంత కుంపటులను ప్రారంభించారు. అందులోంచి చీలినవే... నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ త్రిపుర, త్రిపుర పీపుల్స్ ఫ్రంట్, త్రిపురాలాండ్ స్టేట్ పార్టీ, త్రిపుర డొఫాని సిక్లా స్రింగ్నై తదితర సంస్థలు.



ఐపీఎఫ్‌టీ హింసాత్మకచర్యలు (ఫైల్)

చివరకు ఐపీఎఫ్‌టీలోనూ గతేడాది చీలిక వచ్చింది. బీజేపీకి లబ్ధిచేకూర్చేందుకు ఆ పార్టీ నుంచి పెద్దమొత్తంలో మూటలు అందాయని ఐపీఎఫ్‌టీని పునరుద్ధరించిన ఎన్‌సి దేవ్‌బర్మపై ఆరోపణలు వచ్చాయి. అనేక చీలికలు, విలీనాలు, అంతర్గత కుమ్ములాటలతో ఐపీఎఫ్‌టీ బలహీనపడినప్పటికీ.. ఈ క్రింది సూత్రాలతో దాని విధానాలను నిర్వచించుకుంది.

1. త్రిపుర నుంచి గిరిజన ప్రాంతాన్ని వేరుచేసి త్రిపుర లాండ్ పేరుతో ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలి.
2. త్రిపురలో ఉన్న బెంగాలీలను ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారిని తరిమికొట్టాలి.
3. లెఫ్ట్‌ఫ్రంట్‌కు కౌంటర్‌గా బీజేపీ, కాంగ్రెస్ సహా ఏ పార్టీతో అయినా పొత్తుకు సిద్ధం.
4. గిరిజనులను దోపిడీ చేసే త్రిపుర రాజ వంశానికి బలమైన మద్దతు.

అధికార దాహం, స్వార్థ ప్రయోజనాల కోసం, జాతి వివాద జ్వాలలు రేపడం సహా, దేశ సరిహద్దుల నుంచి పనిచేసే చట్టవిరుద్ధమైన ఇతర సంస్థలతో పొత్తుపెట్టుకున్న చరిత్ర ఐపీఎఫ్‌టీకి ఉంది. 2013లో అగర్తలలో ప్రత్యేక త్రిపుర ల్యాండ్ డిమాండ్‌తోపాటు, త్రిపురలో ఉన్న బెంగాలీలకు వ్యతిరేక నినాదాలు చేస్తూ హింసాత్మక ర్యాలీని నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2017 నుంచి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నది. వామపక్ష ఆధిపత్యం గల రాష్ట్రంలో పై చేయి కోసం ఆరాటపడుతున్న జాతీయ పార్టీల ప్రోద్బలంతోనే ఈ చర్యలకు పాల్పడి ఉండొచ్చన్న ఆరోపణలు కూడా వచ్చాయి. 2017 జూలైలో రాష్ట్రంతో మిగిలిన ప్రాంతాలకు ఏకైక అనుసంధానం ఉన్న జాతీయ రహదారిని రెండు వారాలపాటు దిగ్బంధనం చేసింది. తద్వారా త్రిపురకు నిత్యావసర వస్తువుల సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగించింది. '2009 నుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం మేం పోరాడుతున్నాం. రాష్ట్రంలోని లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం, కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం మా డిమాండ్లకు ప్రాధాన్యం ఇవ్వలేదు. 2017లో జాతీయ రహదారి దిగ్బంధనం సాగుతుండగా.. మా ప్రతినిధి బృందం ఢిల్లీ వెళ్ళి కేంద్ర ప్రభుత్వ నేతలతో భేటీ అయ్యింది. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పీఎంఓతో చర్చలు జరిపింది. ప్రత్యేక రాష్ట్రం త్వరలో నిజం కాబోతుందని మాకు హామీ లభించడంతో జాతీయ రహదారి దిగ్బంధనాన్ని విరమించుకుంటున్నాం' అని ఐపీఎఫ్‌టీ నేత ఎన్‌సీ దేవ్‌బర్మ ప్రకటించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలోనే ఆ హామీ ఇచ్చినట్టు అప్పట్లో విమర్శలు కూడా వచ్చాయి. కాషాయపార్టీ అవకాశవాదం, వంచనను బీజేపీ-ఐపీఎఫ్‌టీ పొత్తు మరొకసారి బహిర్గతం చేసింది.

త్రిపుర ఎన్నికల్లో 22 మంది నేర అభ్యర్థులు

- క్రిమినల్ క్యాండెట్లలో బీజేపీ టాప్



అగర్తల : త్రిపుర విధానసభ ఎన్నికల్లో 297 మంది అభ్యర్థులు బరిలో ఉండగా,వారిలో 22 మంది నేరచరితులు ఉన్నారు. ఎలక్షన్ వాచ్ రిపోర్టు ప్రకారం 17మంది అభ్యర్థులపై హత్య,మత ఘర్షణలు, లైంగికదాడుల్లో ప్రమేయం ఉన్నది.ఈ క్రిమినల్ క్యాండెట్లలో 9 మంది బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్,ఇద్దరు ఐపీఎఫ్‌టీ,తృణమూల్ కాంగ్రెస్ తరపున ఒకరు బరిలో ఉన్నారని ఆ సంస్థ ప్రతినిధి బిస్వేంద్ర భట్టాచార్య తెలిపారు.నేర రికార్డులను తమ అఫిడవిట్లలో ప్రస్తావించిన వాటిని ఆధారంగా ఈ వివరాలు సేకరించామని చెప్పారు. బరిలో ఉన్న అభ్యర్థుల్లో పదిమంది సంపన్నులు కాగా,బీజేపీకిచెందిన ఏడుగురు,కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు ఉన్నారని తెలిపారు.

ఔరంగజేబు ఉగ్రవాది

బీజేపీ ఎంపీ మహేశ్‌గిరి



న్యూఢిల్లీ: మొఘల్ పాలకుడు ఔరంగజేబును ఉగ్రవాది అంటూ బీజేపీ ఎంపీ మహేశ్‌గిరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఔరంగజేబు సోదరుడు దారాషుకోను మాత్రం గొప్ప పండితుడని కీర్తించారు. మొఘల్ సోదరులైన ఔరంగజేబు, దారా షుకోపై ఢిల్లీలో నిర్వహించిన సదస్సు, ఎగ్జిబిషన్ సందర్భంగా మహేశ్‌గిరి ఈ వ్యాఖ్యలు చేశారు. తూర్పు ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన మహేశ్‌గిరి గతంలోనూ ఔరంగజేబు విషయంలో వివాదానికి కారణమయ్యారు. ఢిల్లీలోని ఔరంగజేబు రోడ్డుకు పేరు మార్చి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరు పెట్టాలంటూ కేంద్రానికి లేఖ రాసిన మహేశ్‌గిరి అనుకున్నది సాధించారు. దాంతో, అప్పుడు ముస్లిం సంఘాల నుంచి నిరసన వ్యక్తమైంది. పేరు మార్పుపై నిర్ణయం తీసుకున్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు ముస్లిం సంఘాలు తమ అభ్యంతరాలను తెలియజేశాయి. నగరాలు, వీధుల పేర్లు మారుస్తూ చరిత్రను వక్రీకరించొద్దని ఆ సంఘాలు విమర్శించాయి. ఆ సందర్భంగా తనను కొందరు బెదిరించారంటూ మహేశ్‌గిరి ఆరోపించారు.

దారాషుకో ఇస్లాం విలువల కోసం నిలబడ్డారని, ఆయన సోదరుడు ఔరంగజేబు మాత్రం ప్రజలను అణచివేసిన క్రూరుడని మహేశ్‌గిరి అన్నారు.

ప్రపంచం ఔరంగజేబుకన్నా దారాషుకోకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని మహేశ్‌గిరి అన్నారు. మొఘల్ సామ్రాజ్య విస్తరణ కోసం ఔరంగజేబు యుద్ధాలతో హింసకు పాల్పడగా, దారాషుకో మాత్రం భిన్నమైన విశ్వాసాలున్న ప్రజలతో చర్చించడం ద్వారా శాంతి, సహజీవనాన్ని ప్రోత్సహించారని మహేశ్‌గిరి అన్నారు. 17వ శతాబ్దానికి చెందిన ఈ ఇద్దరు సోదరులు మొఘల్ చక్రవర్తి షాజహాన్ కుమారులు. ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ సోదరులిద్దరిపై నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదివారం ముగియనున్నాయి.

బాలిక హత్య కేసులో పోలీసు అధికారి అరెస్ట్

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఎనిమిదేండ్ల బాలికను కిడ్నాప్ చేసి హత్య చేసిన కేసులో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో ప్రత్యేక పోలీసు అధికారి (ఎస్పీఓ) అరెస్టయ్యాడు. ఈ విషయాన్ని జమ్మూకాశ్మీర్ క్రైం బ్రాంచ్ పోలీసులు శనివారం తెలిపారు. హత్యకు గురైన బాలిక మృతదేహాన్ని గతనెల 17న రస్సానా అడవి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ ఘటన పై రాష్ట్ర అసెంబ్లీలో దుమారం లేచింది. నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దాంతో కేసును విచారించే బాధ్యతను రాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులకు ముఫ్తీ ప్రభుత్వం గతనెల 23న అప్పగించింది. ఈ కేసులో ఎస్పీఓ దీపక్ ఖజురియా ప్రమేయం ఉందని తేలడంతో ఆయనను అరెస్ట్ చేశామని క్రైం బ్రాంచ్ అదనపు డీజీ అలోక్ పూరీ వెల్లడించారు. లైంగికదాడి ఆరోపణల పై ఫోరెన్సిక్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సహకారం తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఎస్పీఓ అరెస్ట్‌తో ఈ కేసులో అరెస్ట్‌ల సంఖ్య రెండుకు చేరింది. అంతకు ముందు ఈ ఘటనలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న 15ఏండ్ల బాలుడిని క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గతనెల 20 న ప్రభుత్వం ఎహెచ్‌ఓ అధికారిని సస్పెండ్ చేసింది. అలాగే ఈ కేసులో న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

కాళేశ్వరం, మిషన్ భగీరథ దేశానికే మోడల్

15వ ఆర్థిక సంఘం బృందం ప్రశంస

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టులు దేశంలోనే ఒక మోడల్‌గా నిలుస్తాయని 15వ ఆర్థిక సంఘం ప్రశంసించింది. సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా నేతృత్వంలోని బృందం శనివారం కాళేశ్వరం, మిషన్ భగీరథ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక హెలికాప్టర్‌లో ఈ బృందం పర్యటించింది. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకోసం నిధులు వెచ్చిస్తున్న తీరు బాగుందని అరవింద్ మెహతా వ్యాఖ్యానించారు. రైతులకు సాగునీరు, ప్రజలందరికీ సురక్షిత తాగునీరందించే ప్రభుత్వ సంకల్పం గొప్పదని ఆయన అన్నారు. కాళేశ్వరం పనులను పరిశీలించిన బృందం సభ్యులు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి బృందం సభ్యులు ఆరా తీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట సమీపంలో నిర్మాణంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు 11వ ప్యాకేజీలోని రంగనాయక్‌సాగర్ పాటూ అన్నారం బ్యారేజీ పనులను అరవింద్ మెహతా బృందం పరిశీలించింది. అతి తక్కువ వ్యవధిలో అద్భుతంగా పనులు జరగటం సంతోషంగా ఉందని బృంద సభ్యులు వ్యాఖ్యానించారు. టన్నెల్ పనులు పురోగతి పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రంగనాయక్‌సాగర్ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, కాళేశ్వరం ప్రాజెక్టు మ్యాప్‌లను వారు పరిశీలించారు. వీటి వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ రామకృష్ణారావు వారికి వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల, రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి మంత్రి హరీశ్‌రావు కృషి తో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నట్టు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ జోషి చెప్పారు. ఈ ప్రాజెక్టులను షెడ్యూలు ప్రకారంపూర్తి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని వివరించారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా వ్యవసాయం అభివృద్ధి జరుగుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అరవింద్ మెహతా అభిప్రాయపడ్డారు. కేంద్ర ఆర్థిక సంఘం ముఖ్య ఉద్దేశం కూడా సమగ్ర గ్రామీణాభివృద్ధి అని ఆయన అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ రంగంలో జాతీయ అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నట్టు 15 వ ఆర్థిక సంఘం సభ్యులు వ్యాఖ్యానించారు. ప్రకృతి నిర్మాణాలు, ప్రణాళిక, పనులవేగం, పనులు జరుగుతున్న తీరు తమను ఆకట్టుకున్నాయని అన్నారు. రేయింబవళ్లు మూడు షిఫ్టుల్లో భారీగా జరుగుతున్న పనుల వేగాన్ని బట్టి వచ్చే వానాకాలం నాటికల్లా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి మైలు రాయి దాటుతుందనే విషయంలో తనకు సందేహం లేదని అరవింద్ మెహతా అభిప్రాయపడ్డారు.. జాతీయ అభివృద్ధిలో కాళేశ్వరం ఒక భాగమవుతుందని అన్నారు. (రాష్ట్రాలలో నిధుల వినియోగంపై తనిఖీలో భాగంగా 15 వ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి తెలంగాణలో పర్యటిస్తున్నట్టు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారం బ్యారేజీ దగ్గర మీడియాకు తెలిపారు.



ఆర్థిక సంఘం చైర్మెన్ అరవింద్ మెహతాకు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి వివరిస్తున్న ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి

19న పీఈసెట్ కమిటీ సమావేశం

26న పీజీఈసెట్ భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్)–2018 కమిటీ సమావేశం ఈనెల 19న హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలిలో జరగనుంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్)–2018 కమిటీ భేటీ ఈనెల 26న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే ఐసెట్ కమిటీ సమావేశం ముగిసిన విషయం తెలిసిందే. ఇక ఎంసెట్, ఎడ్‌సెట్, ఈసెట్, లాసెట్ కమిటీల సమావేశాల తేదీలపై అధికారులు సమాలోచన చేస్తున్నారు. తేదీలపై స్పష్టత రాగానే సమావేశాలు జరగనున్నాయి.

పారదర్శకంగా గ్రూప్-1 నియామకాలు

'నవతెలంగాణ కథనం'పై టీఎస్‌పీఎస్సీ వివరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో గ్రూప్–1 నియామకాల ప్రక్రియ పారదర్శకంగానే జరిగిందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. 'గ్రూప్–1లో గందరగోళం' పేరుతో ఈనెల 9న నవతెలంగాణ సమగ్ర తెలుగు దినపత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ శనివారం వివరణ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే గ్రూప్–1 నియామకాలు జరిగాయని తెలిపారు. అనిల్‌కుమార్ అనే అభ్యర్థికి గ్రూప్–1 నియామకాల ప్రక్రియ పట్ల సరైన అవగాహన లేక తప్పులు జరిగాయని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనిల్‌కుమార్ కంటే తక్కువ మార్కులొచ్చిన అభ్యర్థిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశారన్న ఆరోపణలో నిజం లేదన్నారు. గ్రూప్–1 నోటిఫికేషన్‌లో అన్ని పోస్టులూ రాష్ట్రస్థాయి క్యాడర్‌కు చెందినవని తెలిపారు. కేవలం అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ (ఏఏవో) పోస్టు మాత్రమే జోనల్ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఏఏవో పోస్టుకు స్థానిక, స్థానికేతర పోస్టులను బట్టి జోనల్ మెరిట్ ఆధారంగా నియామకాల ప్రక్రియ జరిగిందని తెలిపారు. 406.93 మార్కులు పొందిన అనిల్‌కుమార్ 5వ జోన్‌కు చెందిన వ్యక్తి అని, 399.32 మార్కులొచ్చిన నాగిరెడ్డి 6వ జోన్‌కు చెందిన వ్యక్తి అని పేర్కొన్నారు. 6వ జోన్‌లో పోస్టు అయినందున నాగిరెడ్డి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని వివరణ ఇచ్చారు.

కోర్టును ఆశ్రయిస్తా : అనిల్‌కుమార్

గ్రూప్–1 నియామకాల్లో జరిగిన అవకతవకలపై కోర్టును ఆశ్రయిస్తానని అభ్యర్థి ఎం అనిల్‌కుమార్ నవతెలంగాణతో చెప్పారు. టీఎస్‌పీఎస్సీ నిబంధనలు ఉల్లంఘించి గ్రూప్–1 నియామకాలు చేపట్టిందని అన్నారు. గ్రూప్–1 నోటిఫికేషన్‌లో మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులను కలిపి పోస్టులు ఎంపిక చేయాలని పొందుపరిచారని చెప్పారు. జోనల్ పోస్టులకు స్థానిక, స్థానికేతర చూసి ఇంటర్వ్యూకు అభ్యర్థులను ఎంపిక చేయాలన్న నిబంధన ఎక్కడా పేర్కొనలేదని అన్నారు. న్యాయనిపుణులతో సంప్రదిస్తున్నానని, స్పష్టత వచ్చాక కోర్టుకు వెళ్తానని స్పష్టం చేశారు.

పెంచిన జీతాల జీవో ఇవ్వండి

ఉప ముఖ్యమంత్రి కడియంకు టీఆక్టా వినతి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు పెంచిన జీతాల ఉత్తర్వులు సత్వరమే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (టీఆక్టా) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని శనివారం హైదరాబాద్‌లో టీఆక్టా అధ్యక్షుడు ఎం రామేశ్వరరావు నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఉద్యోగ భద్రత కల్పిస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, 2017, నవంబర్ నుంచి ప్రభుత్వం కొత్త వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని రామేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలలవుతున్నా పెంచిన వేతనాల జీవో రాకపోవడం, వేతనాలు అందకపోవడంతో కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రాగానే ఈ దస్త్రంపై సంతకం చేయాలని కోరతానని కడియం శ్రీహరి హామీ ఇచ్చారని తెలిపారు. కడియం శ్రీహరిని కలిసిన వారిలో ఓయూసీటీఏ అధ్యక్షుడు ఎం తిరుపతి, ఎస్‌ఎఫ్‌టీఏ అధ్యక్షుడు చిట్యాల రాజు, నాయకులు జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెలరోజుల్లో పరిహారం అందజేస్తాం..

కలెక్టర్ హామీతో వడ్లకొండ రైతుల దీక్ష విరమణ • నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ–జనగామప్రతినిధి

నెలరోజుల్లో పరిహారం అందజేస్తామని వడ్లకొండ భూ నిర్వాసితులకు జనగామ ఇన్‌చార్జి కలెక్టర్ అనితా రామచంద్రన్ హామీ ఇచ్చారు. 'గుంజుకున్నారు' అనే శీర్షికతో నవతెలంగాణ పత్రికలో శనివారం వడ్లకొండ భూ నిర్వాసితుల పరిహారంపై ప్రత్యేకకథనం ప్రచురితమైంది. కథనానికి ప్రభుత్వంతోపాటు అధికారులు స్పందించారు. శనివారం మధ్యాహ్నం జనగామ కలెక్టరేట్‌లో కలెక్టర్ అనితా రామచంద్రన్‌తో చర్చలు జరిగాయి. రెండేండ్లుగా తమ భూములు లాక్కొని నష్టపరిహారం ఇవ్వకుండా అధికారులు సాకులు చెబుతున్నారని కలెక్టర్‌తో ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా తమ భూములకు డబ్బులిప్పించాలని మహిళలు, బాధితులు కలెక్టర్‌ను దీనంగా కోరారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ నెలరోజుల్లో వారికి డబ్బులు ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా నిర్వాసితులు నరేందర్, భాగ్య, వెంకటమ్మ మాట్లాడుతూ కలెక్టర్ హామీ మేరకు తమ ఆందోళనను విరమిస్తున్నామని, గడువులోపు డబ్బులు ఇప్పిస్తారని ఆశిస్తున్నామని అన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపట్టి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పి లక్ష్మణ్, సుజాత, మధు, రాజేందర్ పాల్గొన్నారు.

డిగ్రీ అధ్యాపకుల డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం డైరీ–2018ని ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. డిగ్రీ విద్యలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఆయన సూచించారు.

వచ్చే విద్యాసంవత్సరంలో ఆన్‌లైన్ పీజీ ప్రవేశ పరీక్షల కోసం డిగ్రీ విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు.

డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రవేశాల ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఆర్ లింబాద్రి, సంఘం అధ్యక్షుడు ఎ సంజీవయ్య, ప్రధాన కార్యదర్శి కె సురేందర్‌రెడ్డి, నాయకులు కెభాస్కర్, సీహెచ్ వెంకటరెడ్డి, ఎంఎ మల్లిక్, సోమయ్య, కృష్ణమూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోఫర్ పార్టీతో ఆనాడు పొత్తు ఎలా పెట్టుకున్నారు?

కేటీఆర్‌ను ప్రశ్నించిన రావుల



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ను లోఫర్ పార్టీ అన్న మంత్రి కేటీఆర్, 2004లో పొత్తు ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, విభజన హామీలు ఏ మేరకు సాధించారని నిలదీశారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మండిపడ్డారు. దేశంలో అన్ని అనర్థాలకు మూల కారణం కాంగ్రెస్ అని ఆరోపించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్‌ఎస్‌కు భావసారూప్యత ఉండే పోటీ చేశారా ? మరోవైపు జానారెడ్డి బృందం టీఆర్‌ఎస్ పార్టీని బ్రోకర్ పార్టీ అని అన్నారు. ఈ రెండు పార్టీలు రాజకీయాలను ఎటువైపు తీసుకెళ్తున్నాయి ? జనం సమస్యలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. టీడీపీకి చెందిన 13 మంది ఎమ్మెల్యేలను టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తీసుకున్నాయని విమర్శించారు. మా పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు తీసుకుని మేము బలపడ్డామని టీఆర్‌ఎస్ అనుకుంటే అది భ్రమే అవుతుందన్నారు. అది బలుపు కాదు, వాపేనని సీఎం కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్, ఆ పార్టీ తెలుసుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. నాలుగేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీలో ఏవేవి అమలు అయ్యాయో, వాటిలో ఈ పాత్ర ఏమిటో టీఆర్‌ఎస్ పార్టీ ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రాణహిత–చేవెళ్ల జాతీయ ప్రాజెక్టు, బయ్యారం స్టీల్ ప్లాంటు, హార్టీకల్చర్, ట్రైబల్ యూనివర్సిటీలు ఏ దశలో ఉన్నాయో చెప్పాలని అడిగారు. మైనింగ్ విశ్వవిద్యాలయం, ఎయిమ్స్, ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫాక్టరీ ఏర్పాటుపై స్పందించాలని కేసీఆర్, కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు.

తల్లిని గాఢంగా ప్రేమించే వారు జీవితాంతం విజేత మనస్తత్వంతో ఉంటారు. ఆ మనస్తత్వమే అనేకసార్లు వారి విజయానికి కారణమవుతుంది. - ఫ్రాయిడ్

సంపాదకీయం

అడుగులు

అడుగుల్లాంటివే ప్రగతిశీలి ఆలోచనలు. అవరోధాలెదురయితే అవి అక్కడే ఆగిపోవు. పురోగమనమే వాటి నిరంతరశీలం. ప్రలోభాలను కాళ్ల మునివేళ్లతో పక్కకు తోసి, ముందుకు సాగే నిశ్చల చిత్తవృత్తి ఆ అడుగులది. అందుకని ధైర్యమన్నది కంటికి కనపడని ఆయుధం. అటువంటి అయుధం మనలో ఉంటే ఎటువంటి శత్రువునయినా ఓడించవచ్చు.. ప్రకృతిలో వెలుగునీడలు ఎంత సహజమో జీవితం కూడా అంతే. ప్రతి మనిషి జీవనయానంలో వెలుగునీడలుంటాయి. కలిమిలేముల్లా కష్టనష్టాలుంటాయి. సుఖదు:ఖాలూ ఉంటాయి. చీకటిలాంటి ముండ్లు తరువాతే వెన్నెల్లాంటి గులాబీ వికసిస్తుంది. భగభగమని మండే వేసవిలోనే తెల్లని చల్లని బొండుమల్లెలు వికసిస్తాయి. సాగరాన్ని చేరుకోవాలంటే ఎన్ని మెలికలు తిరగాలి యేరు? నిర్దిష్ట గమ్యం చేరుకోవాలంటే ఎన్నెన్ని అవరోధాలుంటాయో కదా... తల్లి ప్రసవ వేదన కూడా అటువంటిదే. పురిటినొప్పులే ఆమెకు మరో జన్మలాంటిది. అయినా మాతృమూర్తి భరిస్తుంది. ఆ తరువాత పొత్తిళ్లలో పసిబిడ్డను చూశాక అవన్నీ మటుమాయం. అమ్మ కళ్లల్లో కాంతి కోటి చందమామల పెట్టు. అమ్మ ప్రేమ ముందు బాధలూ కన్నీళ్లూ అన్నీ దిగదిడుపే. జీవితం కూడా అంతే. కష్టం వచ్చినప్పుడు ధైర్యం కోల్పోయి ఏడ్వడం, సంతోషం కలిగినప్పుడు ఆనందం పట్టలేక కేరింతలు కొట్టడం సామాన్య మానవుల లక్షణం. వెలుగునీడల్లాంటి కష్టసుఖాలు రెండింటినీ సమంగా స్వీకరించ కలిగినవారు స్థితప్రజ్ఞులు. "ప్రగతి భావుకులు కోరుకునేది జగతికి సముత్తేజం కలిగించే పరివర్తనా ప్రవృత్తినే.." సినారె చెబుతారు.

గొప్పతనం సాధించడానికి అనుసరించే అడుగులు కూడా గొప్పగానే ఉండటం అవసరం. పట్టుదల కల్గినవారు, ఉత్సాహవంతులూ ఏ వయసునయినా తమ లోపాన్ని సరిదిద్దుకొని ఉన్నతి సాధించ గలుగుతారు. అందుకని ప్రతి మనిషికీ ధైర్యముండాలి. సాహసం, నమ్రత, సంయమనం, సంకల్పం, సాధన, నమ్మకం ఉంటే జయం నిశ్చయం.



మనం చూస్తుంటాం.. ఉరకలేసే ఏటి కెరటాలకు గులకరాళ్లు అడ్డుపడతాయి.. అంతమాత్రాన ఆ కెరటాలు తమ ఉరవడి ఆపుకోవు... అనంత స్రవంతిలా ఆ నీటి ప్రవాహం అలా సాగిపోతూనే ఉంటుంది. మనుషులం... మనం కూడా అంతే.. తటాకం అలలెత్తి ఆ గట్టును ఈ గట్టును తాకుతూ ఉంటే చైతన్యమే... చైతన్యం.. మన అడుగులు కూడా అంతే... ముండ్లదారి చూసి అక్కడే ఆగిపోవడం విజ్ఞుల పని కాదు. ఆ ఎత్తుపల్లాలకు తగిన విధంగా అడుగులు ఉండాలి. ఆ ముండ్లు ఏరుకుంటూ పోవాలి. కాళ్లకు అంటిన బురదను కడిగి.. తిరిగి అడుగులు సాగించాలి. అలా కాకుండా, రాళ్లూరప్పల్నీ, కచరా దారుల్నీ చూసి, గతుక్కుమని ఆగిపోతే, మన గమ్యం మసకబారుతుంది. ప్రకృతిని పరిశీలించండి. ప్రతి తెరువూ తీగా కూడా బాధకు అతీతం కావు. మలయమారుతానికి పులకించడం వాటికీ తెలుసు. వానజల్లుకు అవెంతో ఉల్లాసంగా పులకిస్తాయి. వేడిగాలులకు వాడిపోవటం చెట్టూ చేమకు కూడా సహజ పరిణామం. చెట్టుకిందికి చేరిన మనిషికి నీడనిచ్చి సేద తీర్చడం లేదా..! ఓ నా నెచ్చెలీ...! ఉన్నత శిఖరాలు నేలమీది నుంచే కదా ప్రారంభమయ్యేదీ...!!

గొప్పతనం సాధించడానికి అనుసరించే అడుగులు కూడా గొప్పగానే ఉండటం అవసరం. పట్టుదల కల్గినవారు, ఉత్సాహవంతులూ ఏ వయసునయినా తమ లోపాన్ని సరిదిద్దుకొని ఉన్నతి సాధించ గలుగుతారు. అందుకని ప్రతి మనిషికీ ధైర్యముండాలి. సాహసం, నమ్రత, సంయమనం, సంకల్పం, సాధన, నమ్మకం ఉంటే జయం నిశ్చయం. ఎందుకంటే కాలం మహా నిర్లిప్తమైంది. ఎంతో విలువైంది కూడా. సముద్రాల్ని ఎడారులుగా, ఎడారుల్ని సముద్రాలుగా మారుస్తుంది. తోటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు, నడవలేని స్థితిలో ఉన్నప్పుడు 'నీకు నేనున్నాననీ.. వెన్ను నిమిరి..భరోసానిచ్చే..' మనిషుండాలి. నిండైన సహకారం ఉండాలి. మనం మనుషులం. రాయీ రప్పలం కాదు. మనకు హృదయముంది.. ఎదలోపలి గాయాలకు ఓదార్పునివ్వాలి. తట్టి లేపాలి. కొందరు జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేరు. కుమిలిపోతారు . కుంగిపోతారు. లోకం కోసం పాటుపడేవారు కొందరే ఉంటారు.

మనకు మార్పు కావాలి. నిజమైన మార్పు, వ్యవస్థాపరమైన మార్పు కావాలి. ఈ వ్యవస్థను భరించకుండా ఉన్నాం. రైతులు దీనిని భరించలేక పోతున్నారు. మహిళలు ఈ భారాల్ని మోయలేకపోతున్నారు. దారీతెన్నూ తోచక యువత అగమ్యంగా ఉంది. సమాజపోకడను ఓపలేకున్నది. చివరికి ఈ భూమీ, మన భూమాతా మోపలేని స్థితిలో ఉంది. అందుకే మన జీవితాల్లో మార్పు రావాలి. మన నిత్య జీవిత వాస్తవికతలో మార్పు రావాలి. మొత్తం ప్రపంచంలో మార్పు రావాలని కోరుకుంటున్నాం మనం. "సమస్యలొస్తే గందరగోళ పడకు.. నువ్వు విజయం సాధించవలసిన పరీక్షలుగా భావించి వాటిని అధిగమించు..." అని కారల్‌మార్క్స్ చెబుతారు.

'మనం' అనే భావం మనకు సహజ స్వభావం కావాలి. మన సమాజంతో బంధం... మన బిడ్డల అనుబంధాల మాలిక బలపడాలంటే, ప్రగతిశీలి అడుగుల్లోని ప్రభోద అభ్యాసం కావాలి. "నేస్తమా...! అంతా అయిపోయిందనుకున్న క్షణాల్లోనే నమ్మకం మన దరిచేరి తల నిమిరి వెన్ను తడుతుంది. మరిచిపోకు...! కారుమబ్బుల నుండే ఓ పెద్ద వర్షం వస్తుందన్న నిజాన్నీ..!!" అని రూమీ అంటాడు. అవును.. నిజం.. నువ్వొకరికి సహాయం చేయీ...! నీకు సాయం చేసే చేయి నీకోసం అంది వస్తుంది. అప్పుడు అడుగులు వడివడిగా... అందుకనీ అడుగులకు గమనం ముఖ్యం..!!

అడుక్కునే అవకాశం కాదు... అమలు చేసే అధికారం



ఎస్. వీరయ్య

బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ ఆవిర్భావం కొన్ని ప్రశ్నలను ముందుకు తెచ్చింది. అందులో, అంబేద్కరిస్టులతో కమ్యూనిస్టులు కలిసి పనిచేయటమేమిటన్న ప్రశ్న ఒకటి. ఈ కలయిక సృష్టిస్తున్న ప్రకంపనల ఫలితమే ఈ ప్రశ్న. కొంతకాలం దూరంగా ఉన్నప్పటికీ, నిజానికి అంబేద్కరిస్టులూ, ఫూలే అనుయాయులూ, కమ్యూనిస్టుల మధ్య అనుబంధం సహజ బంధమే. కమ్యూనిస్టు సిద్ధాంతం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం లాగానే ఉన్నట్టుండి ఆకాశం నుండి ఊడిపడ్డది కాదు. న్యూటన్ లాంటి గొప్ప శాస్త్రవేత్త కూడా తాను విజ్ఞానమనే సముద్రతీరంలో గులకరాళ్లను ఏరుతున్న పసివాడిననే అన్నాడు. అప్పటికే కృషి చేసిన అనేకమంది శాస్త్రజ్ఞుల భుజస్కంధాల మీదనే తాను ఉన్నానన్నాడు. తాను ఆవిష్కరించిన సిద్ధాంతం,

పల్లెల్లోనే ప్రదర్శన. పల్లెల్లోనే ప్రతిఘటన. బడాబాబుల సవాళ్లకు బస్తీల్లోనే జవాబు చెప్పాలి. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ కార్యాచరణకు ఇదే మార్గనిర్దేశం కావాలి. బహుజనులు పోరుబాటలో నడిచినప్పుడే అధికారం వైపు అడుగులు పడతాయి. కలలు కంటే దక్కేది క్షణికానందం. కదిలితే.. కదం తొక్కితే వచ్చేది అధికారం. ఎవరి చేతుల్లోనో అధికారం పెట్టి అడుక్కోవటం కాదు. లాఠీ చేతికిచ్చి వంగటం కాదు. అధికారం కోసం కదలాలి. అడుక్కునే అవకాశం కాదు.. నిర్ణయాలు చేసే అధికారం కావాలి. అమలు జరిపే అధికారం కావాలి.

కేవలం తన గొప్పతనం మాత్రమే కాదనీ, తరతరాల శాస్త్ర పరిశోధనల కొనసాగింపేనని సవినయంగా చెప్పాడు. కారల్ మార్క్స్ చెప్పింది కూడా అదే! అదనపు విలువ సిద్ధాంతం గానీ, సమాజ మార్పు అనివార్యత గురించి గానీ చరిత్ర గమనంలో సాగిన అనేక ఉద్యమాల, తాత్త్విక పరిశోధనల కొనసాగింపే తప్ప అప్పటికప్పుడు తన బుర్రలోంచి పుట్టిన సిద్ధాంతం కాదని స్పష్టంగానే చెప్పాడు. సామాజిక పరిణామ క్రమంలో మానవజాతి చరిత్రలో సాగిన అనేక పోరాటాలూ, సంస్కరణల కొనసాగింపే కమ్యూనిస్టు ఉద్యమం. గత చారిత్రక వారసత్వం లేకుండా ఎక్కడినుండో ఊడిపడ్డది కాదు. మానవజాతి చరిత్రలో సాగిన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, తాత్త్విక సంఘర్షణల వారసత్వమే కమ్యూనిస్టు ఉద్యమం. చారిత్రక అనుభవాల సారంగా అభివృద్ధి చెందిన ఆధునిక శాస్త్రీయ సిద్ధాంతమే మార్క్సిజం. అందుకే మార్క్స్, బుద్ధుడు, అంబేద్కర్, ఫూలే, సావిత్రిబాయిఫూలే, పెరియార్, కొమురం భీం, సమ్మక్క, సారలమ్మ, భాగ్యరెడ్డివర్మ, అల్లూరి సీతారామరాజు, గురజాడ, గుర్రం జాషువా, వేమన, పోతన వంటి వారందరి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఉద్యమకారులే కమ్యూనిస్టులు. అందుకే... కమ్యూనిస్టులకు తాము మాత్రమే ఒంటరిగా సమాజాన్ని మార్చే కృషిలో జయప్రదం అవుతారన్న భ్రమలు లేవు. సమాజంలో అన్ని రకాల దోపిడీ, అణచివేత, వివక్షలను రూపుమాపేదే కమ్యూనిస్టు సిద్ధాంతం. అందుకే.. ఈ అన్ని పార్శ్వాల సమూహాలూ, శక్తులూ కమ్యూనిస్టుల మిత్రులే! సహజ మిత్రులే! తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యలన్నింటినీ ఎజెండా మీదకు తెచ్చింది కదా! అభ్యుదయ వాదులందరినీ ఐక్యం చేసిన పోరాటం అది. సాంస్కృతిక పునరుజ్జీవనం పుంజుకున్న కాలమిది. కుల మత భావాలను తెంపి కష్టజీవులను కలిపినడిపిన పోరాటమది. కులాంతర వివాహాలకూ ప్రోత్సాహాన్నిచ్చిన ప్రజా ఉద్యమం. ఆ పోరాట వారసులైన కమ్యూనిస్టులు తెలంగాణ గడ్డమీద సామాజిక సమస్యల మీద పోరాటం కూడా తమ బాధ్యతగా భావించటం సహజమే కదా!


ఆధిపత్యం - అస్తిత్వం

ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగానే సాగుతున్న ఉత్పత్తి మీద అధిపతులే పారిశ్రామిక వేత్తలు. వారికి లాభమే సర్వం. ప్రజలలో జీర్ణించుకుని ఉన్న మనువాద, ఛాందస భావజాలం, మూఢవిశ్వాసాలు మనుగడలో ఉంటేనే శ్రామికులను విభజించి, శ్రమ ఫలితాన్ని కాజేయటం సులభం. లాభం పేరుతో సంపద పోగేసుకోవటం సులభం. బీజేపీ, కాంగ్రెసు, టీడీపీ లేదా టీఆర్ఎస్ వంటి పార్టీలన్నీ ఈ పారిశ్రామికవేత్తల, గ్రామీణ ధనికుల రాజకీయ ప్రతినిధులే కదా! అందుకే.. వీరిలో ఎవరు అధికారంలోకి వచ్చినా ప్రజలలో ఉన్న అన్ని రకాల విభజనలను వాడుకోవటంలో సిద్ధహస్తులు. అందుకే కులం గుర్తింపు కోసం... అస్తిత్వం కోసం సాగే ఉద్యమాలను వీరు ప్రోత్సహిస్తారు. సానుభూతి చూపిస్తారు. కులం ఉన్నంత కాలం కులవివక్ష ఉంటుందని వారికి తెలుసు. కులవివక్ష కుల వ్యవస్థ లక్షణమని కూడా వారికి బాగా తెలుసు. అందుకే అణగారిన కులాల గుర్తింపు పేరుతో, వాటి అస్తిత్వం పేరుతో వ్యక్తమయ్యే పోరాటాన్ని ఆసరా చేసుకొని ఉసిగొల్పుతారు. కులాల గుర్తింపు, అస్తిత్వం పేరుతో కులవ్యవస్థ బలపడుతుందనీ వారికి తెలుసు. అందుకే అమాయక బడుగు జనాన్ని నమ్మిస్తూ, కులవ్యవస్థ పునాదులను కాపాడే ఎత్తుగడలు పాలకులు అమలు చేస్తున్నారు. అందుకే... కుల నిర్మూలనవాదం స్థానంలో కులం గుర్తింపువాదం.. అస్తిత్వవాదం తెచ్చే ప్రయత్నాలను ప్రోత్సహిస్తున్నారు. ఏ పేరుపెట్టినా.. కుల వ్యవస్థ కొనసాగాలనే పాలకులు కోరుకుంటున్నారు. కులవ్యవస్థ ఉన్నంత కాలం వివక్ష ఉంటుంది. ఇది ధ్వంసమైనప్పుడే బడుగు జనం తలెత్తుకుని తిరుగగలరు. అందుకే అణగారిన జనం కోరుకోవాల్సింది కులవ్యవస్థను నిర్మూలించాలనే.

సమాజంలో అగ్రకుల సంఘాలే ముందు పుట్టాయి. అధికార బలం, అర్థబలం అందుకు తోడ్పడ్డాయి. తమ పేరు చివర కులాన్ని సూచించే విధంగా రెడ్డి, చౌదరి, శాస్త్రి, శర్మ, రాజు వంటి పదాలు పెట్టుకున్నది కూడా వారే. ఇతర కులాలలో కుల చైతన్యం వీరి తర్వాతనే మొదలైంది. ఎస్సీలు, బీసీలు ఇలా కులాన్ని సూచించే పదాలు పేరు చివరన పెట్టుకోవటం చాలా ఆలస్యంగా మొదలైంది. కానీ, 'అస్తిత్వవాదం' అన్న మాట అప్పుడు లేదు. ఇప్పుడెక్కువగా ప్రచారంలోకి వచ్చింది. అగ్రకులాలది అస్తిత్వవాదం కాదా? దళితులు, బలహీనవర్గాలదే అస్తిత్వవాదమా అన్న ప్రశ్న ముందుకొచ్చింది. నిజమే... అందరినీ ఒకేగాటన కట్టకూడదు. అందరిదీ అస్తిత్వవాదమో లేక గుర్తింపు కోసం ఆరాటమో కాదు. అగ్రకుల పెత్తందారులది ఆధిపత్యవాదం. వారు గుర్తింపు కోసం తపించవల్సిన స్థితిలో లేరు. అస్తిత్వం కోసం తలమునకలయ్యే స్థితిలో లేరు. ఇక్కడ ఒకరిది ఆధిపత్య వాదమైతే మరొకరిది అస్తిత్వవాదం. ఒకరిది పెత్తనం కోసం ప్రదర్శించే అహం అయితే.. మరొకరిది గుర్తింపు కోసం పడే ఆరాటం. అస్తిత్వం చాటుకునేందుకు తపించేదీ, గుర్తింపు కోసం తాపత్రయ పడేదీ బడుగు జనమే. ఇక్కడే బతుకు పోరాటంలో ఓడుతున్నది బడుగుజనం. ఇదే

సమకాలీనం

ఆధిపత్యవాదులకు కావాల్సింది. అందుకే జాలి కురిపిస్తూ, ప్రేమ నటిస్తూ... అస్తిత్వం చాటుకునే ప్రయత్నాలను ప్రోత్సహిస్తారు. కుల వివక్ష గురించి మాట్లాడరు. దాటవేస్తారు. దేవాలయ ప్రవేశం కావాలంటే... గూడెంలో గుడి కట్టిస్తామంటారు. ఖర్చుకూడా తామే పెట్టుకుంటామంటారు. అందరితో పాటు వీరికి ఆలయ ప్రవేశాన్ని మాత్రం అంగీకరించరు. సమాన అవకాశాల



గురించి మాత్రం అప్పుడప్పుడు మాట్లాడుతారు. ఓట్ల పండుగ సమయంలో ఎక్కువగా మాట్లాడతారు. సమానావకాశాలివ్వకుండానే ఆశలు పెట్టి భ్రమల్లో ముంచుతారు. సమానావకాశాలిస్తే కులవ్యవస్థ నుంచి తాము ఆశించిన ఫలితం నెరవేరదు. కులవివక్ష, అసమానతలు కొనసాగితేనే వారికి ప్రయోజనం. అందుకే కుల వ్యవస్థ గురించి దాటవేస్తారు. ఇటీవల పెరిగిన కులదురహంకార హత్యల గురించి బీజేపీ, కాంగ్రెసు, టీఆర్ఎస్, టీడీపీ నేతలెవ్వరూ నోరుమెదపనిది కూడా ఇందుకే. కానీ ఎంతో కొంత... బిచ్చమేసినట్టుగా విదిలిస్తూ.. కొందరిని చేరదీసి సహాయపడుతూ సమానావకాశాల గురించి మాట్లాడుతారు. కులాల సమానత్వం పేరుతో కులాలను కొనసాగించాలనీ, కుల వ్యవస్థను కాపాడాలనీ వీరి ప్రయత్నం. అందుకే వీరి మాటలు గానీ, నినాదాలు గానీ ఎప్పుడూ తేనెపూసిన కత్తుల వంటివే.

గ్రామాల్లో పోరాటమే...

నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను అధిగమించి శ్రామికుల ఐక్యత సాధ్యమా? ఆర్థిక దోపిడీకీ, సామాజిక అణచివేతకూ వ్యతిరేకంగా పోరాటం సాధ్యపడుతుందా? అన్న ప్రశ్నలు కూడా ముఖ్యమైనవే. ఔను.. నిజమే.. విభజించేది కులమైతే, కలిపేది వివక్ష. వివక్షకు గురవుతున్న బాధితులందరినీ కలిపేదీ అదే! విభజించేది ఆధిపత్యమైతే... కలిపేది దోపిడీయే. దోపిడీకి గురయ్యే శ్రామికులను ఐక్యం చేసేది కూడా దోపిడీయే కదా! విభజించే ఆర్థిక, సామాజికాంశాలే శ్రామికులు కలిసి నడవాల్సిన అనివార్యతను కల్పిస్తాయి. అందుకే భూమికోసం, వేతనాల కోసం, సంక్షేమం కోసం అట్టడుగు జనాన్ని కదిలించాలి. కుల దురహంకార దాడులకు వ్యతిరేకంగా, అంటరానితనం, రెండు గ్లాసుల విధానం, పట్టణాల్లో కిరాయికి ఇండ్లు దొరకని పరిస్థితికీ వ్యతిరేకంగా జనాన్ని కూడగట్టాలి. క్షేత్రస్థాయిలో... గ్రామాల్లో, బస్తీలలో ఆర్థిక సామాజిక సమస్యలను గుర్తించి ప్రజలను కదిలించాలి. జనరల్ ఉపన్యాసాల వల్ల ప్రయోజనం పరిమితమే. నిర్దిష్ట సమస్యల మీద నిర్దిష్ట కార్యాచరణ కావాలి. ప్రజలను కదిలించే క్రమంలోనే, ఉద్యమబాట పట్టే క్రమంలోనే కమ్యూనిస్టులూ, సామాజిక శక్తుల ఐక్యత బలపడుతుంది. ఈ భావజాలం ప్రజలను ఆవహిస్తుంది.

కులాల సమానత్వం సాధ్యమా?

కమ్యూనిస్టులూ, సామాజికశక్తుల కలయిక మూన్నాళ్ళ ముచ్చటేనన్న ధీమాతో కూడా కొందరున్నారు. కులాలు బలపడి, దోసిట్లో ఉసిరికాయల్లాగా, ఐక్యం కావటం వీరివల్ల కాదని వారి అంచనా. కుల పెద్దలను చేరదీసి పబ్బం గడుపుకోవచ్చని వారి నమ్మకం. అందుకే కులాల అభివృద్ధి గురించి మాట్లాడుతారు. కులాలకు వరాలు ప్రకటిస్తారు. కులాలంటే జనం పడిచస్తారని వారి నమ్మకం. ఈ అమాయకత్వాన్నే సొమ్ము చేసుకోవచ్చన్నది వారి అంచనా. అమాయకత్వం కొంతకాలం ఉండవచ్చు. కొన్ని తరాలు కూడా ఉండి ఉండవచ్చు. కానీ శాశ్వతంగా అమాయకత్వంలో ఉంచజాలరన్న గుణపాఠం చెప్పవల్సిన సమయమిది. కష్టజీవికి కులం అవసరం లేదు. ఇప్పుడు కులం వల్ల లాభపడేది పారిశ్రామిక వేత్తలూ, కాంట్రాక్టర్లూ, భూస్వాములూ, గ్రామీణ ధనికులే సుమా! కులాల సమానత్వం ఉంటుందంటే నమ్మేటంత అమాయకులు కాదు జనం. వారి జీవితానుభవాలు నేర్పిన పాఠాలున్నాయి వారికి. మనుస్మృతి గురించీ, మనుధర్మ శాస్త్రం గురించీ సైద్ధాంతిక పరిజ్ఞానం ఉండకపోవచ్చు. కానీ వర్ణ వ్యవస్థ అణచివేత, వివక్షల అనుభవాలన్నీ వెంటాడుతూనే ఉన్నాయి. కుల దురహంకారం జడలు విప్పుతున్న కాలమిది. అందుకే.. కుల వ్యవస్థ ఉండగా సమానత్వం గురించి కలలు కనేంత అమాయకులు మాత్రం కాదు జనం. కులం అంటేనే నిచ్చెనమెట్ల కులవ్యవస్థ. కులాల సమానత్వం ఒక కల. వివక్ష మీద తిరగబడటం ద్వారానే వీరికి సమాధానం చెప్పాలి. సమానవకాశాల కోసం పోరాటం తోనే జవాబు చెప్పాలి. ఉసిరికాయల సిద్ధాంతాన్ని ఉట్టికెక్కించాలి. అందుకు అట్టడుగు జనాన్నే నమ్ముకోవాలి. ఎన్ని గ్రామాల్లో... ఎన్ని బస్తీలలో జనం కదిలారన్నదే ఇకనుంచి లెక్క కావాలి. పల్లెల్లోనే ప్రదర్శన. పల్లెల్లోనే ప్రతి ఘటన. బడాబాబుల సవాళ్ళకు బస్తీల్లోనే జవాబు చెప్పాలి. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ కార్యాచరణకు ఇదే మార్గనిర్దేశం కావాలి. బహుజనులు పోరుబాటలో నడిచినప్పుడే అధికారం వైపు అడుగులు పడతాయి. కలలు కంటే దక్కేది క్షణికానందం. కదిలితే.. కదం తొక్కితే వచ్చేది అధికారం. ఎవరి చేతుల్లోనో అధికారం పెట్టి అడుక్కోవటం కాదు. లాఠీ చేతికిచ్చి వంగటం కాదు. అధికారం కోసం కదలాలి. అడుక్కునే అవకాశం కాదు.. నిర్ణయాలు చేసే అధికారం కావాలి. అమలు జరిపే అధికారం కావాలి. బహుజనులకు రాజ్యాధికారంతోనే అది సాధ్యం. ■

పథకాలు సరే.. పైసలేవీ..?



ఎన్. నారాయణ

నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగో బడ్జెట్‌లో కూడా నాణ్యమైన విద్యకు నిధులు కేటాయించలేదు. షరా మామూలుగానే కొన్ని పథకాలు ప్రకటించి, వాటికి కూడా అదనపు బడ్జెట్ యివ్వకుండానే దాటవేసింది. తమ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత యిస్తుందని, ప్రధాన సమస్యగా పరిణమించిన అభ్యాసన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తుందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. కానీ అందుకు అవసరమైన అదనపు ఏర్పాట్లు చేయలేక పోయారు.

పిల్లలను బడిలో చేర్చగలిగాం. కానీ వారికి నాణ్యమైన విద్య యివ్వలేక పోతున్నాం. ఇటీవల దేశవ్యాప్తంగా 20లక్షలమంది విద్యార్థులపై నిర్వహించిన జాతీయ సాధన సర్వేలో వచ్చిన ఫలితాలు కూడా చాలా అసంతృప్తికరంగా వున్నాయి. నాణ్యమైన విద్యా ప్రమాణాల కోసం జిల్లా స్థాయిలోనే వ్యూహాలు రూపొందించాలని, పూర్వ ప్రాథమిక స్థాయి నుండి పన్నెండో తరగతి వరకు ఏక మొత్తంగా పాఠశాల విద్య వుండాలని ప్రకటించారు. కానీ అందుకనువుగా విద్యాహక్కు చట్టాన్ని విస్తరించాల్సిన బాధ్యతను విస్మరించారు. నాణ్యమైన విద్యాబోధనకు నాణ్యమైన ఉపాధ్యాయులు కావాలనీ, అందుకోసం ఇంటిగ్రేటెడ్ బీఈడీ పథకాన్ని ప్రారంభించాలని అన్నారు. మెరుగైన విద్యాభ్యాసనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ బ్లాక్ బోర్డ్‌లను డిజిటల్ బోర్డ్‌లుగా మార్చాలని చెప్పారు. ఏజెన్సీ ఏరియాల్లో గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్య అందించటానికి నవోదయ విద్యాలయాల తరహాలో ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. కానీ ఈ మూడు పథకాలకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులు చేయలేదు.

విద్యాపద్దుకు అదనంగా పెరిగే నిధులు కూడా అంతగా లేకపోవటం వలన విద్యారంగ వికాసం, కొత్త పథకాల ప్రయోగం పెద్ద సవాల్‌గానే కనిపిస్తోంది. పాతవి కొత్తవి అన్ని రకాల పథకాలు, పద్దులకు కలిపి ఈసారి బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.85,010 కోట్లు కేటాయించారు. గతేడాది (రూ.79,686 కోట్లు) కంటే అదనంగా రూ.5342 కోట్లు మాత్రమే పెరిగేది. ఈ కొద్ది మొత్తం సాధారణంగా పెరిగే ఖర్చులకే సరిపోదు, ఇంకా అదనపు అవసరాలను అందుకునే అవకాశమే వుండదు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)కి రూ.2629 కోట్లు, సార్వత్రిక సెకండరీ విద్యాలక్ష్యాన్ని సాధించాల్సిన రాష్ట్రీయ మాధ్యమిక్ శిక్షాఅభియాన్ (ఆర్ఎంఎస్ఏ)కి రూ.192 కోట్లు మాత్రమే అదనంగా కేటాయించింది. నిధుల కొరత వలన విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఇ) అమలు కావటం లేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేసిన విమర్శను గానీ, అభ్యాసన స్థాయిల అభివృద్ధికి అదనపు ఏర్పాట్లు చేయాలనే అసెర్, న్యాస్ నివేదికలను గానీ కేంద్రప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదనే విషయాన్ని బడ్జెట్ ప్రతిపాదనలు తెలియజేస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేయలేక పోయిన కొఠారి కమిషన్ సిఫార్సు మేరకు స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో ఆరుశాతం విద్యకి వెచ్చించే బృహత్తర కర్తవ్యాన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. నాలుగేండ్లు గడిచినా ఆ హామీని నెరవేర్చలేక పోయింది. జీడీపీలో నాలుగు శాతం లోపే విద్యకి ఖర్చు చేస్తున్నట్టు ప్రపంచబ్యాంక్ నివేదికల్లో తెలుస్తోంది. మీదు మిక్కిలి ప్రతిఏటా కేంద్ర బడ్జెట్‌లలో విద్యారంగం వాటా తగ్గి పోతూ వచ్చింది.

సంవత్సరం	మొత్తం బడ్జెట్ (కోట్లలో)	విద్యకి కేటాయించింది (కోట్లలో)	విద్యారంగం వాటా
2014-15	రూ.17,94,891.96	రూ.1,10,351.10	6.15 %
2015-16	రూ.17,77,477.04	రూ.96,649.76	5.44 %
2016-17	రూ.19,78,060.45	రూ. 92,666.65	4.68 %
2017-18	రూ.21,46,734.78	రూ.79,685.95	3.71 %
2018-19	రూ.24,42,213.30	రూ.85,010.29	3.48 %

'ముఖముంది - అద్దముంది అన్నట్టు' నరేంద్రమేడీ ప్రభుత్వం విద్యలో విఫలమైనట్టు బడ్జెట్ కేటాయింపులు తెలియజేస్తున్నాయి.

సెల్ 9490300577

ప్రజావాణి

యువతా, వారి అభ్యున్నతీ విస్మరించిన ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన యువత ఆశలు కోరికలను ప్రభుత్వం గౌరవించడం లేదు. నాడు 2009 నుండి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో యువత పాత్ర ఎనలేనిది. నాటి నినాదం నీళ్లు, నిధులు, నియామకాలు. యువత ఎంతో ఆకర్షితులై ఉద్యమంలో తమదైనా పాత్ర పోషించారు. నియామకాల విషయంలో ప్రభుత్వ ధోరణి అస్పష్టం. లక్ష ఉద్యోగాల భర్తీ పేరుతో ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ ఇప్పటి వరకు 25 వేలు కూడా భర్తీ కాలేదు. కేవలం ఉపాధ్యాయ అర్హత పరీక్షపై రకరకల ప్రకటనలతో గందరగోళం ఏర్పడింది. ప్రభుత్వ తీరు సగం కడుపు నింపుకునే ఉద్యోగులకు పూర్తిగా వడ్డిస్తుంది, కానీ అసలు తినడానికి లేని నిరుద్యోగులను ఇదిగో నోటిఫికేషన్ అదిగో అని అసత్య ప్రకటనలతో సందిగ్ధంలో పడవేస్తుంది.

-అంబీరు శ్రీకాంత్,
హైదరాబాద్.

మాగ్గూడ ఆదార్



తెలిదేవర భానుమూర్తి

నడిరాత్రి. మొగులు మీద సుక్కలు మెరుస్తున్నయి. కుక్కలు బౌబౌ మంటున్నయి. చిమ్మట్లు పాటలు బాడుతున్నయి. సడక్ మీద లాటితోని మోర్ గొట్టుకుంట గూర్క గస్తి దిర్గుతున్నడు. దొంగలు దొంగతనం జేసెతందుకు మోక కోసం ఎదురు జూస్తున్నరు. ఆడొక మోటర్, ఈడొక లారి బోతున్నది. అందరు బండుకున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు నిద్రరాక అటిటు బోర్లుతున్నరు. ఇంకొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు. సైకిల్ దొక్కుకుంట గాయిన బొందలగడ్డ దిక్కు బోబట్టిండు. గాయిన దినం పూట బంటడు. నాత్రి పూట డ్యూటి జేస్తడు.

బొందలగడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. గానికి పొద్దుమీకి వొండుకోబుద్ది గాలేదు. గాడు హోటల్కు బోయిండు. బిర్యాని దిన్నడు. [illegible] దిన్నంక సిగిలేట్ ముట్టిచ్చుకుండు. [illegible] ఇంటికొచ్చిండు. [illegible] జూస్తుంటె గాని కన్ను మలిగింది. గాడు సోయిలేకుంట నిద్రబోయిండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. గంటి సప్పుడు ఇని ఎప్పటి తీర్గ బేతాలుడు ఇవుతలకు రాలేదు. గీడు పండుకున్నట్లు గొడ్తున్నదనుకోని విక్రమార్కుడు నాలుగైదు పార్లు గంటి బజాయించిండు. గప్పుడు బేతాలుడు నిద్రలేసిండు. సల్లటి నీల్లతోని మొకం గడుక్కోని ఇవుతలకు వొచ్చిండు. సైకిలెన్క గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు

"నన్ను సైకిల్ మీద గూసుండబెట్టుకోని ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త ఇను.

గా దినం అయితారం. పరేడ్ మైదాన్ల గాడ్దులు మీటింగ్ బెట్టినయి. గా మీటింగ్‌కు మన రాష్ట్రం గాడ్దులే గాకుంట వేరె రాష్ట్రాల గాడ్దులు గూడ వొచ్చినయి. వొచ్చిన గాడ్దులల్ల పిల్ల గాడ్దులు, వైసు గాడ్దులు, ముసలి గాడ్దులే గాకుంట కంచర్‌గాడ్దులు [illegible] గాడ్డెకు ఒక మగ వైసు గాడ్దె లైటుగొట్టబట్టింది. ఒక పిల్ల గాడ్దె పాలు ఇయ్యుమని తల్లి గాడ్దెను అడ్గబట్టింది. అందరి ముంగట పాలిస్తె బాగుండదని తల్లి గాడ్దె అనబట్టింది. ఒక గాడ్దె మైకు ముంగట్కి వొచ్చింది.

"గిప్పుడు ఆంధ్రప్రదేస్ కెల్లి వొచ్చిన గాడ్దె ఒక పాట బాడ్తది" అన్నది.

ఆంధ్రప్రదేస్ కెల్లి వొచ్చిన గాడ్దె మైకు



ముంగట్కి వొచ్చింది.

"గాడ్డి వీర లేవరా దీచ్చబూని సాగరా
గాడ్డి జాతి స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా"

అని పాట బాడింది.

"గిప్పుడు మన [illegible] కంచర్ గాడ్దె మాట్లాడ్తది"

కంచర్ గాడ్దె మైకు ముంగట్కి వొచ్చింది.

"ప్యారే బాహియో ఔర్ బహెనో ఆదార్ కారట్ జెయ్యబట్కె ఈడ మన మందరం గిట్ల మీటింగ్ బెట్టినం, ఆవులకు ఆదార్ కారట్‌లు ఇస్తరంట. ఆవులకు ఆదార్ కారట్లు ఇయ్యంగ మనకు ఎందుకు ఆదార్ కారట్లు ఇయ్యరు? మనం ఆవులకన్న తక్వనా? ఆవుల కన్న మనమే ఎక్వ పనిజేస్తం. గందుకే గాడిద చాకిరీ అంటరు గని ఆవు చాకిరీ అని ఎవ్వరు అనరు. వసుదేవుడసుంటోడు గాడ్ది కాల్లు బట్టుకున్నడు. గని ఆవు కాల్లు బట్టుకున్నడా? ఆవు పాలతోని రోగాలు తక్వ అయితయా? మన గాడ్ది పాలతోని రోగాలు తక్వ అయితయి. మనం మూటలను, బస్తలను మోస్కబోతం. ఆవులు ఏమన్న బస్తలు మోస్తయా? ఆదార్ నవంబర్ మనకు ఇయ్యాలె గని ఆవులకు ఇస్తరా? గిది అన్యాలం గాదా?

ఆవులకు ఆదార్ నంబర్ ఇచ్చెతందుకు బడ్జెట్ల యాబైకోట్ల రూపాలు కర్సుజేసింద్రు. ఒక్క ఆవుకు ఆదార్ నంబర్ ఇయ్యాలంటె ఎన్మిది రూపాల కాడి నుంచి పదిరూపాల దాంక కర్సు అయితది. పస్టు నాల్గు కోట్ల ఆవులకు ఆదార్ నంబర్లు ఇస్తరంట. ఆదార్ నవంబర్లు ఇస్తె మనకు లేకుంటె గొర్లకు ఇయ్యాలె? ఆవులకు ఆదార్ నంబర్లు ఎందుకు?" అన్కుంట కంచర్ గాడ్దె స్పీచ్ గొట్టింది.

"గిప్పుడు మన సెక్రెట్రి గాడ్డి మాట్లాడ్తది"

ఒక వైసు గాడ్దె మైకు ముంగట్కి వొచ్చింది.

"అక్కలు, చెల్లెండ్లు, అన్నలు తమ్ముండ్లకు దండాలు. గాడ్దెలతోని ఫాయిద ఉన్నది. గని [illegible] లేదు. ఆవు మాసంను [illegible] అనేటాయినను గోరచ్చకులు సంపిండ్రు. ఆవులను సంపుతున్నరని యాదాద్రి, బువనగిరి జిల్లల దలితులను గోరచ్చకులు కొట్టింద్రు. ఆవుల పేరు మీద ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి గోరచ్చకులు మందిని కొడుతున్నరు. సంపుతున్నరు. మన గాడ్దెల పేరు మీద ఎవరినన్న కొట్టింద్రా? సంపింద్రా? ఏమన్న అంటె గియన్ని కాంగ్రెస్ జెయ్యబట్కె అయితున్నయని ప్రతాని మోదీ అంటడు. పరీచ్చలను పండ్గ లెక్క సూడాలని గాయిన జెప్పిండు. ఎలచ్చన్లు గూడ మాకు పండ్గ అసుంటియే అని గాయిన అన్నడు. ఆవులకు ఆదార్‌నంబర్ల తోని ఎలచ్చన్ల పరీచ్చలను పాస్ అవుదామని గాయిన సూస్తున్నడు. ఎలచ్చన్ల పరీచ్చల కోసం ప్రతాని నకల్ చిట్టిలను గూడ తయ్యారు జేస్తున్నడు. కాంగ్రెస్ పద్యాలను నకల్ గొడ్తున్నడు. ఆరోగ్యశ్రీ పద్యంను నకల్ గొట్టి ఆరోగ్య పద్యం అంటున్నడు. ఏమన్న అంటె గీ పద్యం మాదే. గిసువంటి పద్యం దునియల లేదని జెప్తున్నడు. ఆవులకు ఆదార్ నంబర్లు ఇస్తె మనకు గూడ ఆదార్ నంబర్లు ఇయ్యాలె. గాడ్దుల ఐక్యత వర్దిల్లాలె. గాడ్దుల సంగం జిందాబాద్" అన్కుంట గాడ్దుల సెక్రెట్రి గాడ్డి మాట్లాడింది.

"ఆవులకు ఆదార్ నంబర్ ఇస్తె ఏమొస్తది. గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ సైకిల్ పంపుచర్ అయితది" అని బేతాలుడు అన్నడు.

"ఆదార్ నంబర్ ఇస్తె ఆవులు ఇర్వై శాతం ఎక్వ పాలు ఇస్తయట" అని విక్రమార్కుడు జెప్పంగనే సైకిల్ దిగి బేతాలుడు బొందలగడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్: 9959150491

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com



రాశిఖన్నా... ఐదేండ్లు...15 సినిమాలు. గ్లామర్ గాళ్ మాత్రమే కాదు.. మంచి పర్ఫార్మర్ 'ఊహలు గుసగుసలాడే'తో టాలీవుడ్‌లోకి ఎంటరై... ఇటీవలి 'తొలిప్రేమ'తో మళ్లీ ఫీల్‌గుడ్ మూవీ చేసింది. మంచి నటిగానే కాదు... గాయనిగా మంచి పేరు తెచ్చుకుంది. తన సినిమాలకే కాదు... ఇతర హీరోయిన్లకు గళాన్నిచ్చింది. మంచి చదువరి... కవిత్వం రాస్తుంది. సాహసాలను ఇష్టపడుతుంది. ప్రయాణాలు, ప్రకృతి అంటే ప్రాణం. ఇన్ని సృజనాత్మక గుణాల 'రాశి' గురించి కొన్ని ముచ్చట్లు..

పుస్తకాలంటే బాగా ఇష్టం...

నాన్న బిజినెస్ మేన్. అమ్మ రిటైర్డ్ ప్రిన్సిపల్. అన్నయ్య. చిన్న కుటుంబం. నాకు మాతాతగారంటే చాలా ఇష్టం. ఆయన దగ్గరే ఎక్కువ పెరిగాను. ఆయనే నాకు స్ఫూర్తి. చిన్నతనంలో ఎప్పుడూ ప్లేగ్రౌండ్‌లోనే ఉండేదాన్ని. అలా అని స్టడీస్‌లో వెనుకబడేదాన్నని అనుకోకండి. క్లెవర్ స్టూడెంట్‌ని. ఢిల్లీల్లో లేడీ శ్రీరామ్ ఉమెన్స్ కాలేజీలో ఇంగ్లీష్ హానర్స్ చదివాను. అకాడమిక్ ఇయర్ టాపర్‌గా మూడు ట్రోఫీలు కూడా అందుకున్నాను. అయితే నటి అవ్వాలన్న ఆలోచన ఎప్పుడూ లేదు. అవుతానని కూడా ఊహించలేదు. డిగ్రీ పూర్తి చేశాక... ఐఏఎస్ ఆఫీసర్ అవ్వాలనుకున్నా. ఆ తరువాత కాపీరైటర్‌గా సెటిలవుదామని, గాయని అవుదామనుకున్నా. కానీ 'మోడలింగ్ ఎందుకు ట్రై చేయకూడదు?' అంటూ ఫ్రెండ్స్ సలహా ఇచ్చారు. ఇంట్లో అడిగితే నాన్న వద్దన్నారు. నేవీలో పనిచేసే అన్నయ్య నాకు సపోర్ట్‌గా నిలిచాడు. అదృష్టాన్ని పరీక్షించుకొమ్మని ఆర్నెళ్లు టైమ్ ఇచ్చాడు. దాంతో యాడ్స్ చేయడం మొదలుపెట్టాను. ఆ సమయంలోనే 'మద్రాస్ కేఫ్'లో అవకాశం వచ్చింది.

గాయనిగా...

అవసరాల శ్రీనివాస్‌గారు 'ఊహలు గుసగుసలాడే' కథ వినిపించగానే బాగా నచ్చింది. వెంటనే ఓకే చెప్పాను. అలా సినిమా ప్రయాణం మొదలైంది. చిన్నప్పటినుంచి సంగీతం ఇష్టం. పాటలు పాడేదాన్ని. చుట్టూ ఎంతమంది ఉన్నా పట్టించుకోకుండా కూనిరాగాలు తీస్తూ ఉండేదాన్ని. సినిమాల్లోకి వచ్చాక ఆ విషయాన్ని 'జోరు' దర్శకుడు నాగేంద్రకుమార్ గారు గమనించి.. ఆ సినిమాలో పాడమన్నారు. జోక్ చేస్తున్నారేమో అనుకున్నా. కానీ నా చేత ఓ పాట పాడించారు. గాయనిగా నా పేరును చూసుకోవడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. జోరు – జోరు, జవాన్ సినిమా కోసం 'బంగారు..', బాలకృష్ణుడు సినిమా కోసం 'తరిరిరా తరి తరిరిరా అంది తొందరా' పాటలు పాడాను.

తమిళం నేర్చుకుంటున్నా...

ప్రస్తుతానికి నా దృష్టి దక్షిణాది సినిమాల మీదే ఉంది. అయితే ఏ లాంగ్వేజ్ అయినా సమస్య లేదు. స్క్రిప్ట్ నచ్చితే చేస్తాను. ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీ బాగుంది. 'ఊహలు గుసగుసలాడే' సినిమా నుండి ఈరోజు వరకు 15 సినిమాలు చేశాను. ఈ సినిమాలు చేసినప్పుడు నా ప్రయాణం ఎన్నో విషయాల్ని నేర్పింది. ఈ అయిదేండ్లలో నా తెలుగు చాలా ఇంప్రూవ్ అయ్యింది. ఇప్పుడు తమిళం కూడా నేర్చుకుంటు న్నాను. తెలుగుకు దగ్గరగా ఉంటుంది తమిళం. అందుకే అంత కష్టం అవ్వడం లేదు. అలా అని అంత ఈజీ కూడా కాదు. పనిని ఎంజాయ్ చేస్తూ చేస్తాను. ఈరోజు నా పనేంటి అనే ఆలోచిస్తాను తప్ప... ఇండస్ట్రీలో నెంబర్స్ గురించి అంత పట్టించుకోను.

పుస్తకాల పురుగుని...

ఏ కాస్త ఖాళీ సమయం దొరికినా పుస్తకాలు చదువుతాను. అందరినీ 'ఊరికే టీవీ చూస్తావు' అని పేరెంట్స్ తిడుతుంటారు. కానీ నన్ను మాత్రం 'ఎప్పుడూ ఆ పుస్తకాలేనా?' అంటారు. ఇక టైమ్ దొరికితే క్రికెట్ ఆడతాను. బ్యాడ్మింటన్ ఇష్టం. ఇంట్లో అందరితో కలిసి క్రికెట్ చూస్తాను. స్కై డైవింగ్ చాలా ఇష్టం. 14వేల అడుగుల ఎత్తునుంచి డైవింగ్ చేశాను. అడ్వెంచరస్ థింగ్స్ చాలా ఇష్టం. కవిత్వం కూడా రాస్తాను. ఫ్రెండ్స్‌తో పార్టీలకు వెళ్తా. కొన్నిసార్లు ఫ్రెండ్స్‌ను ఇంటికి పిలిచి... రోటీ చేసి తినిపిస్తా. సినిమా, పేరు ఇవన్నీ పక్కన పెడితే.. నా ఫ్రెండ్స్, ఫ్యామిలీకి ప్రాధాన్యం ఇస్తా. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా వారితో టచ్‌లో ఉంటా. వాళ్లకు నా అవసరం ఉన్నప్పుడు అందుబాటులో ఉండేట్టు చూసుకుంటా. పర్సనల్ లైఫ్‌కి, ప్రొఫెషనల్ లైఫ్‌కి మధ్య సన్నని గీత ఉండాలని కోరుకుంటా.

సంతోషమే రహస్యం...

నా బ్యాగ్‌లో ఎప్పుడూ ఉండేవి పర్ఫ్యూమ్, లిప్‌బామ్, మాయిశ్చరైజర్. స్కిన్‌మీద ఏం ఉండదు. లోపల సంతోషంగా ఉంటే ముఖంలో అదే సంతోషం కనబడుతుంది. అదే అందంగా ఉంటుంది. సినిమాల్లో కాస్ట్యూమ్స్ విషయంలో చాలా కేర్ తీసుకుంటాను. బయట అయితే సింపుల్ క్లోత్స్.. వన్ యాక్సెసరీనే వేసుకుంటా. లైట్‌కలర్.. లైట్‌పింక్, లైట్ ఆరెంజ్... ఇలా లైట్ కలర్స్ ఇష్టం. కాలేజ్‌లో టీషర్ట్స్, షార్ట్స్ వేసుకునేదాన్ని. అబ్బాయిలా డ్రెస్సింగ్ వుండేది. మోడలింగ్‌లోకి వచ్చాక మారిపోయింది. ఆరోగ్య రహస్యం అంటే



పొద్దున్నే గోరువెచ్చని నీళ్లు తాగుతా. తరువాత ఆల్మండ్స్ తింటా. బ్రేక్‌ఫాస్ట్‌లో ఎప్పుడూ ఒకటే ఉండదు. ఉదయం పోహా, ఉప్మా ఇలా ఏదో ఒకటి తీసుకుంటాను. తరువాత మజ్జిగ తాగుతాను. మధ్యాహ్నం ప్రోటీన్స్ ఉండే ఫుడ్ తీసుకుంటా. సాయంత్రం పండ్లు



తింటాను. రాత్రి కచ్చితంగా చపాతీకే నా ప్రాధాన్యం. అయితే ఆహారం తీసుకోవడంతోపాటు కచ్చితంగా వ్యాయామం ఉండాలి. నా ఫిట్‌నెస్‌కి కారణం జిమ్. కచ్చితంగా జిమ్ చేస్తాను.

కామెడీ నచ్చుతుంది...

కంఫర్ట్‌జోన్‌లో ఉండి చేసిన పని సక్సెస్‌ని అందివ్వదు. కంఫర్ట్ జోన్‌లో ఉండాలి అని నేను ఎప్పుడూ అనుకోను. ఛాలెంజింగ్ పాత్రలు చేయడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. నా పాత్ర ఆసక్తికరంగా ఉండాలి. నేను చేసిన గత సినిమాల కంటే భిన్నంగాఉండాలి. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయాలనుకుంటున్నా. అయితే ఎప్పుడూ కోరుకున్నవే రావు. నా ప్రయాణంలో సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ను ఒకేరకంగా తీసుకుంటాను. ఫెయిల్యూర్ లేకపోతే సక్సెస్‌లో మజా ఉండదు. ఫెయిల్యూర్స్ నుంచి నేర్చుకోవచ్చు. సినిమాల్లో నన్ను ఇంత బలంగా నడిపిస్తున్నది అంటే... వాటి మీద ఉన్న ప్రేమ. సినిమాను ప్రేమిస్తా.. నా చుట్టూ ఉన్న క్రియేటవిటీ నా వర్క్, సినిమాల పట్ల ఉన్న ప్యాషన్ నన్ను డ్రైవ్ చేస్తుంది. కామెడీ సినిమాలు ఎక్కువగా నచ్చుతాయి.

నాకోసం నేను...

. నేను బయటి వాళ్లకు సినిమాల్లోకి వచ్చాక ఓ అయిదారేళ్ళ నుంచి తెలుసు. నాకు నేను 27 ఏళ్ల నుంచి తెలుసు. అందుకే సామాజిక మాధ్యమాల్లో నాగురించి, నా పర్సనాలిటీ గురించి ఎవరైనా కామెంట్స్ చేస్తే నేను అస్సలు పట్టించుకోను. ఎవరో ఏదో అంటున్నారనో లేక సినిమాలో అవకాశాల కోసమో నేను సన్నబడలేదు. నా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నా కోసం నేను సన్నబడ్డాను. అయితే.. నేను సన్నబడడం 'తొలిప్రేమ' సినిమాలో డిఫరెంట్ వివిధ వయసుల్లో క్యారెక్టర్స్ చేసేప్పుడు బాగా ఉపయోగపడింది.

- మానవి డెస్క్

ఆకుకూరలు అద్భుతం..

రోజు మనం తీసుకునే ఆహారంలో ఎన్నో పోషకాలు ఉంటాయి. వాటిలో అత్యంత ఎక్కువ పోషకాలు ఆకుకూరల్లో ఉంటాయి. శరీరానికి కావాల్సిన అనేక రకాల ఖనిజ లవణాలను ,విటమిన్లను ప్రోటీన్లనను అందించే ఆకు కూరల్లో కొవ్వు తక్కువగా

ఉంటుంది. అంతేకాదు ఆహారాన్ని రుచి కరంగా చేసే ప్రత్యేక లక్షణం వీటిలో ఉంది. ప్రతిరోజూ తీసుకొనే ఆహారంలో ఆకుకూరలను చేర్చితే రక్తలేమి సమస్య నుంచి బయటపడవచ్చు. రోగనిరోధకశక్తిని పెంచుకోవచ్చు. పాలకూర, తోటకూర, మెంతికూర, బచ్చలికూర, చుక్కకూర, పుంటికూర, మునగాకు, పొన్నగంటి కూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, క్యాబేజి, కాలిఫ్లవర్ వంటి ఆకుకూరలు నిత్యం మార్కెట్‌లో కనిపిస్తుంటాయి. మరి ఏ కూరలో ఏ విటమిన్స్ ఉన్నాయో తెలుసుకుందాం..



- ⇔ పాలకూరలో విటమిన్ ఎ, కాల్షియం ఎక్కువగా ఉండడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలకు గట్టిదనాన్ని ఇస్తుంది.
- ⇔ చుక్కకూరలో విటమిన్ ఎ, మెగ్నీషియం ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యంగా ఉంచుతాయి.
- ⇔ తోటకూరలో యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉండడం వలన రక్తహీనతను నివారిస్తుంది. రక్తకణాల ఆరోగ్యానికి ఉపయోగ పడుతుంది..
- ⇔ గోంగూరలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. దీని వలన కంటి వ్యాధుల నుంచి రక్షణ ఉంటుంది.
- ⇔ మెంతి కూరలో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. అధికబరువు నివారణకు, గుండె ఆరోగ్యానికి,, కాలేయ ఆరోగ్యానికి మంచిది ఇది ఎంతో మంచిది.
- ⇔ బచ్చలి కూరలో విటమిన్ ఎ, సి, ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటాయి. కొత్త రక్తకణాలు ఏర్పడడానికి ఉపయోగపడుతుంది. రక్తహీనతను నివారించి రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- ⇔ పొన్నగంటి కూరలో విటమిన్ ఎ, కాల్షియం ఎక్కువగా ఉంటాయి. ఈ ఆకుకూర శరీరంలో వేడిని తగ్గిస్తుంది.
- ⇔ మునగాకులో విటమిన్ ఎ, విటమిన్ సి, ఐరన్, కాపర్ ఎక్కువగా ఉండడం వలన రక్తహీనతను నివారించి ఎముకలకు బలాన్నిస్తుంది.
- ⇔ కొత్తిమీరలో యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది ఆరోగ్యవంతమైన కణాల కోసం ఉపయోగపడుతుంది. అంతే కాకుండా వృద్ధాప్య లక్షణాలను నివారిస్తుంది.
- ⇔ కరివేపాకులో బయోటిన్ ఎక్కువగా ఉండడం వల్ల జుట్టు సంరక్షణకు, జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది.
- ⇔ పుదీనాలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. దీనిని తీసుకోవడం వలన శరీరంలో వేడిని తగ్గుతుంది.
- ⇔ క్యాబేజి, కాలీ ఫ్లవర్‌ల్లో కాల్షియం ఎక్కువగా ఉండి ఎముకలకు, పంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. నరాల బలహీనతను కూడా తగ్గిస్తాయి. ✿

ఇవి పాటిస్తే...

నేటి తరం అమ్మాయిలు అందంగా కనిపించాలని ఆలోచిస్తుంటారు. ఎన్నో రకాల ఉత్పత్తులను ఉపయోగిస్తుంటారు. కాని మార్కెట్‌లో దొరికే ఖరీదైన క్రీమ్‌లు ఉపయోగించకుండా వ్యక్తిగతంగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అందం మీవెంటే!



జుట్టు ఒత్తుగా పెరగాలనుకుంటున్నారా? అయితే ఆవనూనె, ఆలివ్ నూనెను సమానంగా తీసుకొని తలకు రాసుకుని మర్దన చేయాలి. ఇలా వారంలో రెండుసార్లు చేస్తే సరిపోతుంది.


గుడ్డులోని పచ్చసొనను తీసుకొని అందులో రెండు టేబుల్ స్పూన్ల బాదం నూనె, టేబుల్ స్పూను నిమ్మరసం వేసి బాగా కలపాలి. దీన్ని ముఖానికి రాసుకుని నెమ్మదిగా మర్దన చేయాలి. కాసేపాగి కడిగేసుకుంటే చాలు. ఇలా క్రమం తప్పకుండా చేస్తే మెరిసే శరీర ఛాయ సొంతమవుతుంది.

పెదవులు పొడిబారి, నిర్జీవంగా కనిపిస్తుంటాయి కొందరికి. ఇలాంటప్పుడు అదేపనిగా లిప్‌బామ్ రాసుకోవాలను కుంటారు. అలాకాకుండా కొన్ని గులాబీ రేకుల్ని తీసుకుని, వాటిల్లో పాలు పోసి బాగా కలిపి ఫ్రిజ్‌లో పెట్టాలి. రాత్రిళ్లు ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసుకుని మర్నాడు కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే పెదాలు గులాబీ రంగులోని మారతాయి.

కనురెప్పలు నిండుగా కనిపించాలి అనుకుంటే, ఆలివ్ లేదా కొబ్బరినూనెలో దూదిని ముంచి కనురెప్పలపై అద్దుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే సరిపోతుంది.

మెనిక్యూర్, పెడిక్యూర్ అంటూ తరచూ పార్లర్‌లకు వెళ్లడం కన్నా ఇంట్లోనే చేసుకుంటే డబ్బు ఎంతో ఆదా, సురక్షితం కూడా. నిమ్మరసం, గులాబీ నీరు, గ్లిజరిన్... మూడింటినీ కలుపుకొని చేతులు, కాళ్లు, గోళ్లకు రాసుకోవాలి. దానివల్ల చర్మం మృదువుగా ఉంటుంది. ✿

ఎక్కడి వస్తువులు అక్కడే..



వంటచేయడం.. వంటిల్లు సర్దుకోవడం ప్రతిఇంట్లో తప్పనిసరి. భార్యభర్తలు ఉద్యోగాలు చేసే ఇంట్లో మరింత హడావుడిగా ఉంటుంది. అయితే వంటింట్లో అనవసరమైన వస్తువులను ఎప్పటికప్పుడు తీసివేస్తే.. వంటింట్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. వంటింట్లో వస్తువులను నీట్‌గా సర్దితే వంట చేసే సమయం కూడా తగ్గుతుంది.

- ⇔ వంటచేసే సమయంలో కావల్సిన వస్తువులు తర్వగా దొరికేలా అలమారల్లో డబ్బాలు సర్దుకోవాలి. వంట సామాను ఉంచే అలమారల్లో ఇతర వస్తువులు, ఖాళీ డబ్బాలు ఉంచవద్దు.
- ⇔ ఎక్కువగా వాడుకునే, ముఖ్యమైన వంట సామానునే అందుబాటులో ఉంచుకోండి. కొంత మంది రెండు, మూడు నెలలకు సరిపోయే సరుకులను ఒకేసారి తెచ్చుకుంటారు. ఎక్స్‌ట్రా ఉన్నవాటిని పై అరలో ఉంచండి. అవసరం వచ్చినప్పుడు తీసుకోవడం సులభమవుతుంది.
- ⇔ ఇక వంట పాత్రల విషయానికి వస్తే.. ఎప్పుడో ఒకసారి వాడేవి, అస్సలు వాడనివిగా వంట సామానును వేరు చేసి..పై అలమరల్లో సర్దండి. రోజూ వాడే వంట సామానును సులభంగా తీసుకునేలా కింద అలమరల్లో పెట్టండి.
- ⇔ గాజు వస్తువులను పూర్తిగా మరో అలమరలో ఉంచండి. చెంచాలు, చిన్నచిన్న బౌల్స్ వాటి సైజులను బట్టి సర్దుకోండి. మిక్సీ, టోస్టర్ లాంటి వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోండి.
- ⇔ గ్యాస్ స్టవ్ చుట్టూ గిన్నెలు, డబ్బాలు ఉంచకండి. వంట చేయడం పూర్తి కాగానే అన్నింటినీ నీట్‌గా సర్దండి.
- ⇔ ప్లాస్టిక్ కవర్లు, అల్యూమినియం ఫాయిల్స్, టవల్స్‌ను నీటుగా అలమరలో సర్దండి.
- ⇔ పోపుల డబ్బాను, మసాలా డబ్బాలను వేరువేరుగా సర్దు కోండి.

మీకుండే వీలును బట్టి, వారానికోసారి, పది రోజులకోసారి వంటింట్లోని అనవసర వస్తువులను తీసివేయండి. రోజూ హడావుడిగా వంట సామాను వెతుక్కునే బాధ తప్పుతుంది. ✿

ఈకలతో ప్రత్యేకంగా...










నేమలి ఈకలను పుస్తకాల్లో దాచుకున్న జ్ఞాపకం బాల్యంలో అందరిదీ. లేపనాలు అద్దడానికి, ముగ్గులు దిద్దడానికి ఈ ఈకలను ఉపయోగించేవారు గ్రామాల్లో. ఎన్నో రకాల పక్షుల ఈకలు. ఒక్కొక్క పక్షి ఈకది ఒక్కో అందం. అలాంటి ఈకలను తీసుకుని, రంగులద్ది అలంకరణ వస్తువులుగా తయారు చేస్తే ఎలా ఉంటుంది? ఇదిగో ఇలా ఉంటాయి. మీరు ప్రయత్నించి చూడండి.



గోరటి వెంకన్నకు జాతీయ విశిష్ట సాహిత్య పురస్కారం



గుంటూరు: మహాకవి మద్దూరి నగేష్‌బాబు జాతీయ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రజా వాగ్గేయకారులు గోరటి వెంకన్నకు మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రదానం చేశారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో అడుగు సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి బుద్ధిస్ట్ స్టడీస్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో చదివినప్పుడు నగేష్‌బాబు తన స్నేహితుడని చెప్పారు. గోరటి వెంకన్నకు తెలుగు రాష్ట్రాల్లో అసంఖ్యాకమైన అభిమానులున్నారన్నారు. దళిత సాహిత్యానికి, దళిత కవులకు గుర్తింపు ఇస్తామని చెప్పారు. ప్రజా సాహిత్యం, దళిత సాహిత్యం అని వేరు చేయడం బాధాకరమని, దళిత సాహిత్యంపైనా వివక్ష ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన ఆటపాటలతో గోరటి వెంకన్న సభికులను ఉత్సాహపరిచారు. ఆవును చంపిన పెద్దపులి అమ్మవారి వాహనమైతే చచ్చిన ఆవు చర్మం ఒలిస్తే చంపుతున్నారన్న వెంకన్న కులం పోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పతనంతో ప్రమాదం లేదు..!



ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో ఆర్థిక మంత్రి జైట్లీ,ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ తదితరులు

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా కుదేలవుతూ వస్తుండడం పట్ల భారతీయ రిజర్వు బ్యాంక్ అధినేత ఉర్జిత్ పటేల్‌తో పాటు పలు వురు ప్రముఖులు స్పందించారు. దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనం అంత ప్రమాదకరమైంది ఏమీ కాదని.. తేలికగా తీసుకోవాలని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ పరోక్ష ప్రకటన చేశారు. స్టాక్ మార్కెట్ బుడగ భారీ సమస్యలకేమీ దారి తీయబోదని అభిప్రాయపడ్డారు. అయితే మార్కెట్ల నష్టాలపై ఆర్‌బీఐ, మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ అప్రమత్తంగా తగు అవగాహనతో ఉండాలని ఆయన సూచించారు. ఆర్‌బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ తర్వాత తొలిసారి ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ శనివారం ఆర్‌బీఐ నిర్వహించిన బోర్డు సమాశానికి హాజరయ్యారు. అయితే ఇందులో ఎల్‌టీసీజీ పన్ను నిర్ణయం చర్చకు రాలేదని సమాచారం. మీటింగ్ అనంతరం ఉర్జిత్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచ, దేశీయ స్టాక్ మార్కెట్ల పోకడపై వివరణ ఇచ్చారు. గత కొద్ది రోజులుగా మార్కెట్లు వేగంగా పడిపోతున్నాయన్నారు. అత్యధిక ఈక్విటీ ధరల వద్ద మార్కెట్‌లో హెచ్చు, తగ్గులు (సైక్లింగ్) ఉంటుందని, ఇదీ మంచి పరిణామమేనని పేర్కొన్నారు. గత ఏడు సెషన్లలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 2,200 పాయింట్ల మేర పతనమయ్యింది. దీంతో మదుపర్లు దాదాపు రూ.10 లక్షల కోట్ల మేర సంపదను కోల్పోయిన విషయం తెలిసిందే. వాల్ స్ట్రీట్ ఆరు సెషన్లలో ఐదు రోజులు పతనాన్ని చవి చూసింది. ఈ ప్రభావం ప్రపంచ మార్కెట్లతో పాటు భారత సూచీలపై తీవ్రంగా ఉంది.

కనీస మద్దతు ధరపై ప్రధానంగా చర్చ : జైట్లీ

ఎల్‌టీజీజీ పన్నుపై సెబీ బోర్డులో ఉదయమే చర్చించడం జరిగిందని జైట్లీ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ పన్నును తిరిగి చేర్చాలని ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతిపాదించడం జరిగిందన్నారు. అయితే ఈ అంశం ఆర్‌బీఐ బోర్డు మీటింగ్‌లో భాగం కాదన్నారు. కాగా పంటలకు మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఆర్‌బీఐ మీటింగ్‌లో చర్చించడం జరిగిందన్నారు. దీన్ని ఎలా అమలు చేయాలి, ప్రభావం ఎలా ఉండబోతోంది, ఎగుమతులకు మద్దతు ఎలా ఉంటుందనే అంశాలపై మాట్లాడమని మంత్రి పేర్కొన్నారు. వడ్డీ రేట్ల తగ్గింపునపై ఉర్జిత్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితమే బ్యాంకులు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్‌- ఆధారిత రుణ రేట్లను తగ్గించాయన్నారు. రుణ గ్రహీతలకు బ్యాంకులు వడ్డీ రేట్లను కొంత బదిలీ చేశాయన్నారు.

ఏప్రిల్ నుంచి పోస్టల్ బ్యాంకులు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సేవలను వచ్చే ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తేనున్నట్టుగా సర్కారు శనివారం వెల్లడించింది. ఐపీపీబీ సేవలు అందుబాటులోకి వచ్చే విషయంలో మరింతగా జాప్యం జరిగా అవకాశాలు ఉన్నట్టుగా వస్తున్న వార్తలను సర్కారు తిరస్కరించింది. ఈ విషయమై మీడియాలో వస్తున్న వార్తలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ఐపీపీబీ అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాతాలతో సహా పట్టణ ప్రాంతాలలో దేశంలో అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత నెట్‌వర్క్ ఏర్పాటునకు ఆస్కారం ఏర్పడుతుందని సర్కారు పేర్కొంది. కిందిస్థాయి వరకు ఉన్న పోస్టల్ శాఖ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకొని పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్‌ను సాయంతో ఇంటివద్దే పేమెంట్ సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆస్కారం ఏర్పడుతుందని ఆయన ప్రభుత్వం ఆ ప్రకటనలో వెల్లడించింది. ఐపీపీబీ అందుబాటులోకి వస్తే ప్రస్తుతం పోస్టాఫీసుల్లో సేవింగ్స్ ఖాతాలన్న దాదాపు 17 కోట్ల మందికి ఎన్‌ఈఎఫ్‌టీ, ఆర్‌టీజీఎస్, యూపీఐల వంటి డిజిటల్ పేమెంట్స్ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయని సర్కారు తెలిపింది. ఐపీపీబీ అందుబాటలోకి వస్తే పోస్టాఫీసుల ద్వారా డిజిటల్ పేమెంట్‌లను స్వీకరించే అవకాశం ఏర్పడుతుంది. వచ్చే మే నుంచి దాదాపు రూ. 1,450 కోట్లతో ఐపీపీబీ శాఖల ఏర్పాటు మొదలవుతుందని పోస్టల్ శాఖ కార్యదర్శి అనంత నారాయణ్ నందా ఇటీవల మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. దేశంలోని మొత్తం 1.55 లక్షల పోస్టాఫీస్ శాఖలు బ్యాంకింగ్ యాక్సస్ పాయింట్లుగా పని చేస్తాయని అన్నారు.

మేం అధికారంలోకి వచ్చాక పెన్షన్ డబుల్ చేస్తాం : కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక రూ. 1000 పెన్షన్‌ను రూ. 2వేలు చేస్తామని మాజీమంత్రి, సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోదకాలు బాధితులకు గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ ఇచ్చిందన్నారు. ఇప్పుడు టీఆర్‌ఎస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తోందన్నారు. అలాగే పక్షవాతం వచ్చిన వారికి కూడా పెన్షన్‌ను వర్తింపజేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కవితకు ఇక్కడ అన్యాయం కనపడలేదా : విహెచ్ ప్రశ్న

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరిన ఎంపీ కవితకు తెలంగాణకు జరిగిన అన్యాయం కనబడలేదా? అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతారావు ప్రశ్నించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐఎం, హైకోర్టు విభజన గుర్తు రాకపోవడం శోచనీయమన్నారు.

కవితకు పవన్ ధన్యవాదాలు

హైదరాబాద్ : జనసేన పార్టీ అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ టీఆర్‌ఎస్ ఎంపీ కవితకు ధన్యవాదాలు తెలిపారు. విభజన హామీల అమలుపై ఆంధ్రప్రదేశ్‌కు మద్దతు ఇచ్చిన చెల్లెలు కవితకు హదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పవన్ ట్వీట్ చేశారు.

నేడు పంచాయతీరాజ్-ప్రజాస్వామ్యంపై రౌండ్‌టేబుల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) ఆధ్వర్యంలో తెలంగాణ మేధావుల ఫోరం 'పంచాయతీరాజ్- ప్రజాస్వామ్యం' అనే అంశంపై ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న ఎస్‌వికెలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నది. తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షులు ఐ తిరుమలి అధ్యక్షతన జరిగే ఈ రౌండ్‌టేబుల్‌లో ఉపన్యాసకులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, పంచాయతీరాజ్ శాఖ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సీహెచ్ ప్రభాకర్, బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ నేత ప్రొఫెసర్ మురళీమనోహర్ పాల్గొంటారని తెలంగాణ మేధావుల ఫోరం కన్వీనర్ పీఎల్ విశ్వేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బైక్‌లపై 17 వేల కిలోమీటర్ల యాత్ర

- ఏడు వారాలు ఏడు దేశాలు
- నలుగురు మహిళల యాత్ర నేడు షురూ : చందూలాల్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నలుగురు మహిళలు మోటార్‌సైకిల్స్ (బైక్)లపై యాత్ర చేపట్టారని పర్యాటక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడు వారాల్లో ఏడు దేశాలు తిరగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారని వివరించారు. నలుగురు మహిళలు 17 వేల కిలోమీటర్లు దక్షిణాసియా దేశాల్లో తిరిగేందుకు సంకల్పం తీసుకున్నారని అన్నారు. ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, కాంబోడియా, వియత్నాం, బంగ్లాదేశ్ దేశాల్లో యాత్ర చేస్తారని చెప్పారు. నలుగురు మహిళల మోటార్‌సైకిల్ యాత్ర ఆదివారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న పర్యాటక భవన్ వద్ద ప్రారంభమవుతుందని అన్నారు. ఇండియా-మయన్మార్-థాయ్‌లాండ్ హైవేపై ఈ యాత్ర సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ బి వెంకటేశం, అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, రవాణా జనరల్ మేనేజర్ యుగంధర్, పౌరసంబంధాల అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి పురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు సర్కారు న్యాయం

- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలనే ధృడసంకల్పంతో ఉందని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందనీ, కానీ కొన్ని న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. శనివారం తెలంగాణభవన్‌లో తెలంగాణ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ టీచర్స్ అసోసియేషన్ (టీఐఈఆర్‌టీఏ) రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఐఈఆర్‌పీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. కనీస వేతనం అందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బి మల్లేశ్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, విజయాచారి, దామోదర్, మంజుల పాల్గొన్నారు.

వామ్మో... మెట్రోమాల్స్ లీజు ధరలు

- చదరపు గజానికి రూ.3 వేల వరకు..
- ముందుకు రాని వ్యాపార సంస్థలు
- ప్రారంభానికి నోచుకుని వైనం
- మెట్రో స్టేషన్లలోనూ అధికంగా అద్దెలు



నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

నెక్స్ట్ హైదరాబాద్ పేరుతో రియాల్టీ రంగం తోపాటు వాణిజ్య రంగంలోనూ పెనుమార్పులు తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన మెట్రోమాల్స్‌లో అద్దెలు భగ్గుమంటున్నాయి. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీకి ప్రధాన ఆదాయ వనరును రియల్ ఎస్టేట్ పరంగానే నిర్ణయించుకుని లీజు ధరలు ఇష్టానుసారంగా పెంచేసింది. మెట్రో మాల్స్‌లోనూ, స్టేషన్లలోనూ దుకాణాల ధరలు సామాన్య వ్యాపారస్తులకు అందకుండా ఉన్నాయి. మెట్రో రైలు ప్రారంభంతోనే షాపులతోపాటు మాల్స్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎల్‌అండ్‌టీ కసరత్తు చేసింది. కానీ అద్దె ధరలు అధికంగా ఉండడంతో వ్యాపార సంస్థలు ముందుకు రావడం లేదని తెలిసింది.

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రజలు, ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఎల్‌అండ్‌టీ చేపడుతోంది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.20 వేల కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఇందులో 72 కిలో మీటర్ల మేర మెట్రో కారిడార్‌కు, రియల్ ఎస్టేట్ కోసం మాల్స్ నిర్మాణానికి ఖర్చు చేస్తోంది. టికెట్ల ద్వారా ఆదాయం 50 శాతం ఉండనుండగా, రియల్ ఎస్టేట్ ఆస్తుల ద్వారా 45 శాతం, ప్రకటనల ద్వారా మరో ఐదుశాతం ఆదాయం వచ్చేలా డిజైన్ చేశారు. కానీ రియల్ ఎస్టేట్ ఆస్తుల ద్వారానే 60 శాతం ఆదాయం సమకూర్చుకునేలా ఎల్‌అండ్‌టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. మెట్రో ప్రాజెక్టుతో నష్టపోయామని భావిస్తున్న ఎల్‌అండ్‌టీ షాపింగ్ మాల్స్‌లో లీజుల ద్వారానైనా ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా మాల్స్, మెట్రో స్టేషన్ల షాపులతో కలిపి సుమారు 60 లక్షల చదరపు అడుగులను వినియోగించనుంది. రాయదుర్గంలో నిర్మిస్తున్న హైటెక్‌సిటీ మాల్‌ను 15 ఎకరాల్లో 30 లక్షల చదరపు అడుగులను రియల్ ఎస్టేట్ పరంగా వినియోగించుకునేందుకు సిద్ధం చేస్తున్నది. పంజాగుట్ట, ఎర్రమంజిల్‌లో భారీ మెట్రో మాల్స్ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. హైటెక్‌సిటీ మాల్ పనులతోపాటు మూసారాంబాగ్‌లోనూ మాల్ నిర్మాణ పనులు సాగుతున్నాయి.

చదరపు గజానికి రూ.3 వేల వరకు...

మెట్రో మూడు కారిడార్లలోని 64 మెట్రో స్టేషన్లకుగానూ 55 స్టేషన్లను కమర్షియల్‌గా నిర్ణయించారు. ఈ కమర్షియల్ మెట్రోస్టేషన్లలో వాణిజ్య సముదాయాల కోసం 9 వేల చదరపు అడుగులను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో దుకాణాల కోసం 100నుంచి 350 చదరపు అడుగులు ఉండేలా ఉన్నాయి. అమీర్‌పేట, పరేడ్‌గ్రౌండ్, ఎంజీబీఎస్ ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లలోనూ 40 వేల చదరపు అడుగులను లీజుకిచ్చేందుకు ప్రతిపాదించారు. ఇందులో షాపులు సాధారణంగా 1500 చదరపు అడుగుల్లో ఉండనున్నాయి. కానీ మెట్రోస్టేషన్లలో దుకాణాల లీజు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చదరపు గజానికి రూ.500 నుంచి ఉన్నాయి. పంజాగుట్ట, ఎర్రమంజిల్, హైటెక్‌సిటీ, మూసారాంబాగ్‌లోని మెట్రోమాల్స్‌లో షాప్‌లు లీజు కోసం చదరపు గజానికి రూ.500 నుంచి రూ.3 వేల వరకు నిర్ణయించినట్టు తెలిసింది. షాపు ఉండే అంతస్తు ఆధారంగా ధరలున్నాయి.

ప్రారంభానికి నోచుకుని వైనం...

మియాపూర్ నుంచి నాగోల్ వరకు 30 కిలోమీటర్ల మార్గం గతేడాది నవంబర్ 28న అందుబాటులోకి వచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంలోనే ఇప్పటికే పూర్తయిన ఎర్రమంజిల్, పంజాగుట్ట మాల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మాల్స్‌లో చదరపు గజానికి అధికంగా ధరలు ఉండటంతో వాణిజ్య, వ్యాపార సంస్థలు ముందుకు రావడం లేదని తెలిసింది. దీంతో గతేడాది చివరి నాటికి ప్రారంభానికి నోచుకోలేదు. పంజాగుట్ట మెట్రోస్టేషన్‌కు అనుసంధానం చేస్తూ వ్యాపారపరంగా ప్రయోజనం చేకూరేలా మాల్ నిర్మించారు. ఈ మాల్‌లో 8 స్క్రీన్‌లున్నాయి. కానీ లీజు ధరలు వ్యాపారులను బెంబేలెత్తిస్తున్నాయి.

గంజాయికి 'పతంజలి' మద్దతు!

- ఆయుర్వేదంలో ప్రాధాన్యత.చట్టబద్ధం చేయాలని డిమాండ్



న్యూఢిల్లీ: ఆయుర్వేద ఉత్పత్తులతో బడా కార్పొరేట్ సంస్థలకు ముచ్చెమటలు పట్టిస్తున్న పతంజలి సంస్థ గంజాయిని చట్టబద్ధత కల్పించాల న్న డిమాండ్ చర్చనీయాం శంగా మారింది. భారత దేశంలో నిషేధంలో ఉన్న గంజాయికి ఆయుర్వేదంలో మంచి ప్రాధాన్యత ఉందనీ.. వెంటనే దాన్ని చట్టబద్ధం చేయాలని ఆ కంపెనీ సీఈవో ఆచార్య బాలకృష్ణ వాదిస్తున్నారు.కోట్లు వెనకేసుకుంటున్న బడా పారిశ్రామిక వేత్తలు వెనుకుండి ఒత్తిడి పెంచుతున్నప్పుడు.. రామ్‌దేవ్ బాబా నేతృత్వంలోని పతంజలి ఆయు ర్వేద సంస్థ కూడా మద్దతు నివ్వడం విశేషం."పురాతన కాలం నుంచి గంజాయి మొక్కలోని కొన్ని భాగాలకు ఆయుర్వేదంలో ఔషధ పరంగా మంచి ప్రాధాన్యత ఉంది. అందుకే మేము దీనిపై పరిశోధనలు జరుపుతున్నాం. గంజాయి మొక్కల వల్ల ప్రయోజనాలు, సక్రమ వినియోగంపై ద ష్టి పెట్టా లని ఆశిస్తున్నాం.." అని బాలకృష్ణ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. హరిద్వార్‌లోని పతంజలి పరిశోధన, అభివృ ద్ధి కేంద్రంలో వైద్యావసరాలపై పరిశోధనలు జరుపుతున్నారన్నారు. ప్రత్యేకించి గంజాయి గింజల వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయనీ... గంజాయి నూనెలోని విషపూరిత పదార్థాలుగా భావించే టీహెచ్‌సీ వంటి పదార్థాలను వేరుచేసి వినియోగంలోకి తేవచ్చునని అంటున్నారు.విదేశాల్లో ఆదాయం వస్తుందన్న సాకుతో..భారతదేశంలో చట్ట వ్యతిరేకంగా పరిగణిస్తున్న గంజాయిని కూడా వ్యాపారంలా మలుచు కోవాలని పతంజలి సంస్థ చూస్తున్నది.మరి బీజేపీ పాలకులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాల్సిందేనని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మేధావుల మౌనం ఆందోళనకరం

- ప్రొఫెషనల్స్ రాజకీయాల్లో రావాలి: టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మేధావుల మౌనం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణలోని మేధావులు కూడా మౌనంగా ఉండడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో శనివారం 'అల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్' రీజనల్ కో ఆర్డినేటర్ గీతారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వచ్చిన వివిధ రంగాలకు చెందిన నిపుణులు, మేధావులతో కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. దేశంలో ముఖ్యంగా తెలంగాణలో కేసీఆర్ కారణంగా ప్రజాహక్కులకు భంగం వాటిల్లిందని తెలిపారు. కాంగ్రెస్‌లో తెలంగాణకు చెందిన మేధావులు 400 మంది ఉన్నారని ఉత్తమ్ తెలిపారు. వీరితో త్వరలో ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సమావేశమవుతారని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. లౌకికవాది పార్టీ అయిన కాంగ్రెస్ ప్రజల హక్కులను కాపాడడం కోసం పాటుపడుతున్నదని చెప్పారు. సిఎల్పి నేత జానారెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్న తమ లక్ష్యం నెరవేరాలంటే.. ప్రొఫెషనల్స్ అవసరమన్నారు.

15లోగా సమస్యలు పరిష్కరించాలి; రవీంద్రనాయక్

ఈ నెల 15న తమ ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జన్మదినమని, ఆలోగా గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని మాజీ ఎంపి రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

కళాకారుల సమ్మేళనం విజయవంతం



హైదరాబాద్: కళాకారులు సంఘటితంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని కళాకారుల సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. ఉప్పల్ కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలో తెలంగాణ వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కళాకారులు పాల్గొన్నారు. వాల్ పెయింటింగ్ ఆర్టిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. వృత్తిపరంగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటున్నామని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు.

కళాకారులు తమను తాము పరిచయం చేసుకుని వృత్తిలో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సమ్మేళనం విజయవంతమైనట్టు ఓ కళాకారుడు తెలిపారు.

మెడికల్ సీట్ల అక్రమాలపై సర్కార్ ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

స్పోర్ట్స్ కోటాలో మెడికల్ సీట్ల కేటాయింపు అక్రమాలపై ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. దీనిపై సమగ్ర విచారణకు ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీలో క్రీడాశాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి రఫత్, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డీ నర్సయ్యను విచారణాధికారులకు నియమించింది. మెడికల్ సీట్ల కేటాయింపుపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేసి, సాధ్యమైనంత తొందరగా నివేదిక ఇవ్వాలని కమిటీ సభ్యులకు సర్కారు సూచించినట్టు తెలిసింది. అయితే గతంలో ఇదే ఘటనపై ఇద్దరు అధికారులతో కమిటీ వేసి, విచారణ చేశారు.

ఆ నివేదికను ప్రభుత్వానికి అందించారు. అయితే పైస్థాయి అధికారులపై ఇద్దరు కిందిస్థాయి అధికారులతో ఇటీవల విచారణ చేయించడంతో నివేదిక వన్‌సైడ్ వచ్చిందని 'అక్రమాలు నిజమే' శీర్షికతో నవతెలంగాణ కథనం ప్రచురించింది. దీనికితోడు విచారణ సమగ్రంగా లేదని దాంట్లో వివరించింది. దీంతో సర్కారు స్పందించి, సీనియర్ అధికారులతో విచారణ చేయిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ఇచ్చిన నివేదిక సమగ్రంగా లేదని కూడా ఆ మంత్రి పద్మారావు అధికారులపై మండిపడినట్టు సమాచారం.

నిరభ్యంతర సర్టిఫికెట్ ఇవ్వకపోవడంపై తప్పుపట్టిన హైకోర్టు

హైదరాబాద్: కొత్తగా విద్యా సంస్థల ఏర్పాటుకు అనుమతి ఇవ్వరాదనే నిర్ణయం తీసుకుంటే.. సైదాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి విద్యాపీఠం నిర్వహిస్తున్న బొజ్జం నర్సింహులు మహిళా ఫార్మసీ కాలేజీలో ఫార్మ డి కోర్సుల ప్రారంభానికి తెలంగాణ రాష్ట్రం నిరభ్యంతర సర్టిఫికెట్ ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. సీట్లు భర్తీ కావడం లేదని చెప్పి ఎన్‌ఓసీ ఇవ్వకపోడం సరికాదని హైకోర్టు న్యాయమూర్తులు రామసుబ్రహ్మణియన్, అమర్‌నాథ్ గౌడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది

నల్లగుండ పెద్ద చెరువులో ప్రయివేటు నిర్మాణాలు వద్దు

శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల గ్రామంలోని పెద్దచెరువు పరిధిలో అపర్ణ కనస్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రయివేటు లిమిటెడ్ నిర్మాణాలు చేయరాదని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. కసిరెడ్డి భాస్కరరెడ్డి వేసిన కేసులో బెంచ్ మధ్యంతర ఆదేశాలిచ్చి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

రాష్ట్రస్థాయి రైతు రుణ విమోచన కమిషన్ ఏమైంది?

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేస్తామన్న హామీని అమలు చేయకపోడంపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో స్పష్టం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. బీజేపీ నాయకుడు ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజ న్ బెంచ్ విచారణ జరిపింది. ప్రభుత్వ హామీ గడువు గత ఏడాది నవంబర్ 21తో ముగిసిందని, రైతులు ఆత్మహత్యల నివారణకు కమిషన్ ఏర్పాటు చేయలేదని తిరిగి ఆయన హైకోర్టు ద ష్టికి తెచ్చారు. సీఎస్‌కు నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

చత్తీస్‌గఢ్‌లో ఉపాధి కూలీ నోట మన్ను : బీజేపీ ఎమ్మెల్యే


రాయ్‌పూర్ : గ్రామీణ పేద ప్రజలకు ఉపాధి హామీ ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా అమలు జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు విషయంలో చత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ సర్కారు ఈ పథకం గురించి ఎఇత గొప్పగా ప్రచారం చేసుకుంటున్నా కూడా రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలకు గత కొద్ది సంవత్సరాలుగా వేతనాలు అందడం లేదని పాలక పక్షం నాయకులే ఆరోపిస్తున్నారు. తాజాగా రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. పెద్ద ఎత్తున వాదోపవాదాలు చెలరేగాయి. ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ సభ్యుడు డాక్టర్ సనమ్ జంగ్డే (బెల్తారా నియోజకవర్గం) ఉపాధి కూలీల [illegible] 2015 నుంచి కూలీ డబ్బులు అందడంలేదని ఆరోపించారు. తన నియోజకవర్గంలోని కనీసం 20 గ్రామ పంచాయితీల్లో ఇదే పరిస్థితి ఉందని ఆయన ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. ఆయన వెనకాలే ఇతర ప్రతిపక్ష సభ్యులు కూడా ఈ అంశంపై పెద్ద ఎత్తున దాడికి దిగారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ అయిదేండ్లుగా తన నియోజకవర్గం పరిధిలో కూడా వారికి కూలీ డబ్బులు అందడం లేదని, వారికి సకాలంలో కూలీ డబ్బు చెల్లించాల్సిన బాధ్యత [illegible] అన్నారు.

చైనాలో వ్యూహాత్మకంగా పేదరిక నిర్మూలన

10.2 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గిన పేదరికం

- జాతీయ గణాంకాల బ్యూరో నివేదిక

బీజింగ్ : పేదరిక నిర్మూలనలో చైనా అనూహ్యమైన ఫలితాల్ని సాధించింది. అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం అమలుజేసిన వివిధ సంక్షేమ పథకాల వల్ల దేశంలో దాదాపు 6.8 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని 'జాతీయ గణాంకాల బ్యూరో' తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. 'పేదరిక నిర్మూలన, అభివృద్ధి' ప్రభుత్వ శాఖ ఈ నివేదికను రూపొందించింది. ప్రతీ ఏటా కనీసం కోటీ 30లక్షల మందిని పేదరికం నుంచి బయటపడేశామని ఇందులో పేర్కొన్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి... 2020నాటికల్లా దేశంలో పేదరికమన్నదే లేకుండా చేయాలన్నది అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలోని అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పరుచుకున్న లక్ష్యం. ఈ నేపథ్యంలో గత 5ఏండ్లుగా అమలుజేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. దేశంలో 2012లో పేదరికం 10.2 శాతం ఉంటే, 2017నాటికి 3.1శాతానికి దిగివచ్చింది. జాతీయ గణాంకాల బ్యూరో లెక్కల ప్రకారం 2017 డిసెంబరు నాటికి దేశంలో 3.48 కోట్లమంది ప్రజలు మాత్రమే పేదరికంతో జీవిస్తున్నారు. గత మూడు దశాబ్దాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 60 కోట్లమందికిపైగా ప్రజల జీవన స్థితిగతుల్ని మెరుగుపర్చామని నివేదిక స్పష్టం చేసింది. రెండోమారు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన జిన్‌పింగ్ దేశంలో పేదరిక నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలియజేశారు.



సిరియాలో కూలిన ఇజ్రాయిల్ ఫైటర్ జెట్

ఇడ్లిబ్ : సిరియా దళాలు జరిపిన దాడుల్లో ఇజ్రాయిల్ ఫైటర్ జెట్ నేలకూలింది. ఆ జెట్‌లో ఉన్న ఇద్దరు పైలెట్లు పారాచ్యూట్ ద్వారా సురక్షితంగా బయటపడ్డారు. వాళ్లను సిరియా భద్రతా బలగాలు హాస్పటల్‌కు తరలించారు.ఇజ్రాయిల్‌లో ఇటీవల ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. దాన్ని తిప్పికొట్టేందుకు ఇజ్రాయిల్‌కు చెందిన ఎఫ్-16 జెట్ ప్రతిదాడులు చేసింది. అయితే ఇజ్రాయిల్ దూకుడును అడ్డుకునేందుకు సిరియా ఆర్మీ ప్రయత్నించింది. ఆ సమయంలో జరిగిన ఫైరింగ్‌లో ఇజ్రాయిల్ జెట్ ధ్వంసమైంది.

మాల్దీవుల్లో ఇద్దరు జర్నలిస్టుల అరెస్టు ఒకతను ఇండియన్



మాలే: అత్యవసర పరిస్థితి అమలవుతున్న నేపథ్యంలో దేశ భద్రత పేరు చెప్పి మాల్దీవుల్లో ఇద్దరు జర్నలిస్టులను అరెస్టు చేశారు. వారిలో ఒకతను భారతీయుడు కాగా, మరొక తను భారత సంతతికి చెందిన బ్రిటిష్ జాతీయుడు. పంజాబ్‌కు చెందిన మణిశర్మ, లండన్‌కు చెందిన అతీష్ రావ్జీ పటేల్ 'ఏఎఫ్‌పి' న్యూస్ ఏజెన్సీకి రిపోర్టర్లుగా పని చేస్తున్నారు. జర్నలిస్టుల అరెస్టుపై జాయింట్ అపోజిషన్ అధికార ప్రతి నిధి అహ్మద్ మహ్లూఫ్ స్పందించారు.మాల్దీవుల్లో ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలిసిపోతుందని ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. ఇక్కడ ఎంత మాత్రమూ పత్రికా స్వేచ్ఛ లేదని, గత రాత్రి ప్రముఖ టీవీ స్టేషన్లను మూసేశారని అధాలత్ పార్టీ డిప్యూటీ లీడర్ అలీ జహీర్ అ న్నారు. మాల్దీవుల్లో ఇద్దరు విదేశీ జర్నలిస్టులను అరెస్టు చేశారని, వారి లో ఒకతను భారతీయుడు కాగా, మరొకతను బ్రిటిష్ అని, వారు ఎఎఫ్‌పి ఉద్యోగులని విదేశీ వ్యవహారాల మాజీ మంత్రి అబ్దుల్లా షాహిద్ అన్నారు.

మా దేశంలో పర్యటించండి..

ద. కొరియా అధ్యక్షుడికి కిమ్ ఆహ్వానం

- స్వహస్తంతో రాసిన లేఖ...సోదరి యో-జోంగ్ ద్వారా అందజేత
- ఆహ్వానాన్ని స్వాగతించిన మూన్



కిమ్ యో జోంగ్‌తో కరచాలనం చేస్తున్న మూన్ జే ఇన్

సియోల్: ఉభయ కొరియాల మధ్య శాంతిసామరస్యం ఏర్పడాలని ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్నేహహస్తం చాచారు. వింటర్ ఒలింపిక్స్ జరుగుతున్నవేళ...కిమ్ జోంగ్ ఉన్ నుంచి అనూహ్య ప్రతిపాదన వచ్చింది. తమ దేశంలో పర్యటించాల్సిందిగా ద.కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌కు స్వహస్తంతో రాసిన లేఖను పంపాడు. కిమ్ పంపిన అధికార ప్రతినిధి బృందానికి ఆయన సోదరి కిమ్ యో జోంగ్ నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. శనివారంనాడు యో-జోంగ్, ద.కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ మధ్య దాదాపు మూడు గంటలపాటు ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిమ్ పంపిన అధికార లేఖను కూడా యో-జోంగ్ ద.కొరియా అధ్యక్షుడు మూన్‌కు అందజేశారు. కొన్ని దశాబ్దాల తర్వాత ఉభయ కొరియా దేశాల మధ్య ఉన్నతస్థాయి సమావేశం జరగటం ఇదే మొదటిసారి. కిమ్ యో జోంగ్ ద్వారా లేఖను పంపిన విషయాన్ని ద.కొరియా అధ్యక్షుడి అధికార ప్రతినిధి శనివారం మీడియాకు వెల్లడించారు. "ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడాలని ఛైర్మెన్ కిమ్ జోంగ్ ఉన్ కోరుకుంటున్నారు. ఆయన అధికార ప్రతినిధిగా సోదరి కిమ్ యో-జోంగ్ ఆ లేఖను మా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌కు అందజేశారు. సాధ్యమైనంత తొందర్లో ఉ.కొరియాలో మూన్ జే ఇన్ పర్యటిం చాలని, ఆయన్ని కలుసుకోవాలనుందని కిమ్ ఆశిస్తు న్నట్టు ఆ లేఖలో తెలియజేశారు" అని ద.కొరియా అధ్యక్షుడి అధికార ప్రతినిధి మీడియాకు తెలిపారు. అయితే ఇది నిజమవ్వాలంటే, ఇరు దేశాల ప్రతిని ధులు అందుకోసం సరైన కృషి చేయాల్సి ఉంటుందని మూన్ జే ఇన్ భావిస్తున్నారని ద.కొరియా స్పందించింది. శీతాకాల ఒలింపిక్స్ సందర్భంగా కిమ్ సోదరి యో-జోంగ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. సియోల్ నగరంలోని అధ్యక్ష భవనంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్వహించిన కీలక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కిమ్ ఆహ్వానాన్ని మూన్ స్వాగతించారు. తమ సమావేశం తప్పకుండా జరగాలని ఆయన ఆకాంక్షిం చారు. అలాగే అమెరికాతో సంప్రదింపులు జరిపేందుకు ఉత్తర కొరియా ముందుకు రావాలని కూడా సూచించారు.

కిమ్ సోదరి, అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ పక్కపక్కనే



శీతాకాల ఒలింపిక్స్ సందర్భంగా దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న కిమ్ యో జోంగ్‌కు (ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి) ఆ దేశం విందు ఇచ్చింది. తమ దేశానికి వచ్చిన ఉ.కొరియా ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందానికి మూన్ జే ఇన్ శనివారం విందు ఇచ్చారు. సియోల్‌లోని అధ్యక్ష నివాసంలో మూన్ వారితో లంచ్ సమయంలో సమావేశ మయ్యారు. ఇరు దేశాల మధ్య జరిగిన ఈ విందు సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ద.కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో శుక్రవారం ప్రారంభమైన శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు కిమ్ యో జోంగ్‌తో ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంది.

కిమ్ యో జోంగ్‌తో పాటు ఉ.కొరియా ప్రతినిధుల బృందానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కిమ్ యాంగ్ నామ్ క్రీడల ప్రారంభ వేడుకల్లో వీఐపీ బాక్స్‌లో కూర్చున్నారు. వారికి కొంత దూరంలో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ కూర్చున్నారు.

ముగిసిన అమెరికా షట్‌డౌన్



వాషింగ్టన్ : అమెరికా షట్‌డౌన్ ముగిసింది. ప్రభుత్వ కార్యకలాపాలు తిరిగి తెరుచుకున్నాయి. బడ్జెట్ బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడంతో కార్యకలాపాలు యథావిధిగా మళ్లీ ప్రారంభమయ్యాయి. కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం ఆలస్యం కావడంతో.. 5 గంటపాటు అమెరికా ప్రభుత్వం కార్యకలాపాలు స్తంభించిపోయిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మూతపడకుండా ఉండేందుకు గురువారం అర్ధరాత్రిలోగా బిల్లును కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉండగా.. సెనేట్‌లో ఆలస్యం జరిగింది. సెనేట్ 71-28 ఓట్ల తేడాతో, ప్రతినిధుల సభ 240-186 ఓట్ల తేడాతో దీన్ని ఆమోదించింది.

'బిల్లుపై సంతకం చేశా. మా మిలటరీ ముందు కంటే చాలా బలమైనదిగా ఉంది. మేము మిలటరీని ప్రేమిస్తాం. ప్రతి ఒక్కటీ అందిస్తాం. చాలా కాలంలో తొలిసారి ఇది జరిగింది. జాబ్స్..జాబ్స్..జాబ్స్!" అని డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఓ ట్వీట్ చేశారు. శుక్రవారం ఉదయం ఈ బిల్లుపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అంతకముందు జనవరిలో కూడా ఓసారి ఇలానే అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. హౌజ్‌లో బిల్లుకు మద్దతు ఇచ్చిన 73 మంది డెమొక్రాట్లకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు.

త్రివర్ణ పతాక వెలుగుల్లో బుర్జ్ ఖలీఫా



దుబాయ్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించనున్న సందర్భంగా దుబాయ్‌లోని ప్రఖ్యాత ప్రాంతాలన్నీ భారతీయ జెండా రంగులతో దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవంతి బుర్జ్ ఖలీఫా, అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ(ఏడీఎన్ఓసీ), ప్రపంచంలోనే అత్యంత పొడవైన పిక్చర్ ఫ్రేమ్ 'దుబాయ్ ఫ్రేమ్'లు భారతీయ జెండా రంగులతో వెలిగిపోతూ కనువిందు చేశాయి. దీనికి సంబంధించిన ఫొటోలను యూఏఈలో భారత రాయబారి ట్విటర్ ద్వారా పోస్టు చేశారు. శనివారం సాయంత్రం ప్రధాని మోడీ అబుదాబి చేరుకున్నారు. ఆయనకు ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో అబుదాబి యువరాజు షేక్ మహమ్మద్ బిన్ జయీద్ అల్ నెహ్యాన్ ఘనంగా స్వాగతం పలికారు. పర్యటన సందర్భంగా ఇరు దేశాల నేతలు పలు ద్వైపాక్షిక అంశాల గురించి చర్చలు జరపనున్నారు. ఆదివారం దుబాయ్‌లో జరగనున్న వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌కు యూఏఈ నేతలతో కలిసి మోడీ హాజరై ప్రసంగించనున్నారు.

ఎక్కడ ఉగ్రదాడి జరిగినా

సీన్లోకి ఆక్టోపస్

- చౌరస్తాలు మొదలు బస్తీల వరకు దూసుకు పోయేలా ఇండివిజువల్ ఆపరేషన్
- ముంబయి దాడులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ట్రైనింగ్
- ప్రతి పోలీసు స్టేషన్ నుంచీ ఒక టీమ్‌కు అక్టోపస్ ట్రైనింగ్

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



ఆధునిక సాంకేతికి పరిజ్ఞానాన్ని వినియోగించడమే గాక రాష్ట్రంలో ఏ మూల ఉగ్రదాడి జరిగినా మెరుపు వేగంతో తిప్పికొట్టేలా యాంటీ టెర్ర రిస్ట్ ఆపరేషన్ స్క్వాడ్ అక్టోపస్ కార్యాచరణకు రూపు రేఖలు దిద్దారు.

ఇబ్రహింపట్నంలో అక్టోపస్ అకాడమీని ఏర్పాటు చేశాక ప్రస్తుతం కొనసాగుతున్న శిక్షణకు మరిన్ని మెరుగులు దిద్దుతు అంతర్జాతీయ ప్రమాణాలతో కమెండోలను తీర్చి దిద్దుతున్నారు ఇప్పటి వరకు అక్టోపస్ దళాలు ఒక సమాహంగా వెళ్లి టెర్రరిస్ట్‌లపై మెరుపు దాడి జరిపేలా శిక్షణను ఇచ్చారు. అయితే ముంబయిలో సముద్రమార్గం ద్వారా చొరబడ్డ పాకిస్తాన్ ఉగ్రవాదులు ఒకే ప్రంతాన్ని గాక గ్రూపులుగా విడిపోయి రైల్వే స్టేషన్, తాజ్‌హోటల్, ఇతర ప్రాంతాలలో దాడులకు పాల్పడటం, ఆయుధాలతో విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతు మారణకాండకు పాల్పడటం వంటి ఘటనలు ఒక వేళ రాష్ట్రంలో పునరావృత్త మైతే దానిని ఎలా ఎదుర్కోవాలనే దిశగా అక్టోపస్ వ్యూహ కర్తలు దృష్టి సారించారు. ఈ విషయమై డీజీపీ మహేందర్‌రెడ్డి నేతృత్వలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అక్టోపస్ కమెండోలకు మరిన్ని ఎత్తుగడలు, పోరాట పటిమలను పెంపేలా శిక్షణ తీరు తెన్నులలో మార్పులు రావాలని నిర్ణయించారు. ముఖ్యంగా హైదరా బాద్ మెట్రోపాలిటన్ సిటీ గా ప్రపంచ ఖ్యాతిని ఆర్జిస్తున్న నేపథ్యంలో దీనిపై ఎప్పడు ఉగ్రవాద సంస్థల కన్ను ఉంటుందని అనుమానిస్తున్నారు.

ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఏ మూలన దాడులు జరిగినా ఎదుర్కో వడానికి అక్టోపస్ దళాలను సిద్ధంగా ఉంచాలని డీజీపీ ఆదేశించారు. ముఖ్యంగా నగరంలోని బస్తీలు, కాలనీలు, మొహల్లాలు, ఇరుకు దారులలో సైతం అవసరమైతే ఉగ్రవాదులతో ఒక గ్రూపుగా గాక ఒకరిద్దర్తితో కూడిన కమెండోటీమ్‌లు తెగబడేలా శిక్షణను ఇస్తున్నారు. ఇందుకు అవసరమైన మ్యాప్‌లను రూపొందించిన అధికారులు ప్రతి బస్తీ, కాలనీ, చౌరస్తా మొహల్లాల గురించి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. అక్టోపస్ లోని అధికారులు మొదలుకుని ప్రతి కమెండో కు అవగహనను పెంచడం, ఆ ప్రాంతాలలో వారు తిరిగి అక్కడి వతావరణాన్ని ఆకళింపు చేసుకునేలా శిక్షణను ఇస్తున్నారు. దీని వలన అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసులపై మార్గదర్శకత్వం కోసం ఆధారపడకుండా అక్టోపస్ దళాలే దూసుకు పోయేందుకు ఆస్కారం ఉంటుందని ఉన్నతాధికారులు అంచ నా వేస్తున్నారు. దీంతో తొలుత ఖైరతాబాద్ చౌర్తాలో ఇలాంటి ఆప రేషన్‌ను మొదలు పెట్టిన అధికారులు దీనిని ఇక ప్రతి చౌరస్తా, బస్తీ, కాలనీల్లో నిర్వహించేలా డెమో ప్లాన్‌లను రూపొందించారని తెలిసింది. ఇటీలన రిక్రూట్ అయిన కొత్త కానిస్టేబుళ్లలో 150 మందిని అక్టోపస్ కోసం ఎంపిక చేసిన అధికారులు మరో యాభై మంది వరకు సిటీ పోలీస్‌కు చెందిన కానిస్టేబుళ్లకు కూడా ఈ ట్రైనింగ్ ను ఇస్తున్నారు. గతంలో అక్టోపస్ ఇన్‌చార్జిగా ఉన్న ప్రస్తుత నగర సీపీ వీవీ శ్రీనివాస్‌రావు, ప్రస్తుత అక్టోపస్ ఐజీ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడి నగర కానిస్టేబుళ్లకు అక్టోపస్ కమెండో శిక్షణ నిప్పిస్తున్నారని తెలిసింది. ఈ విధంగా రాష్ట్రంలోని ప్రతి పోలీసు స్టేషన్ నుంచి కొందరు కానిస్టేబుళ్లకు యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్‌లో శిక్షణ నివ్వడం వలన ఎప్పుడు ఉగ్రవాదుల దాడి జరిగినా వెంటనే దానిని తిప్పికొట్టడానికి రాష్ట్ర వ్యాప్తంగా కమెండో దళాలు ఏర్పడు తాయని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. వీరికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం లోను అవగాహన కల్పించేలా ప్రత్యేకంగా తరగతులను నిర్వహించ నున్నారు. అలాగే అంతర్జాతీ యంగా ఎక్కడ ఉగ్రవాద దాడులు జరిగినా, కార్య కలాపాలు సాగుతున్నా వాటిపై అక్టోపస్ దళాలకు పునశ్చరణ తరగతులను నిర్వహించి వారిలో అవగాహనను పెంచాలని కూడా అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది.

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా డిపోల వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో




తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు వేతన సవరణను తక్షణం ప్రకటించి, అమలు చేయాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద ధర్నాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని టీఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్‌భవన్ వద్ద జరిగిన ధర్నాలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ప్రచార కార్యదర్శి పి రవీందర్‌గౌడ్, కోశాధికారి ఏవీ రావు, కార్యదర్శులు గంగాధర్, బిక్షపతిగౌడ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఎస్ రావు మాట్లాడుతూ కొత్త వేతన సవరణ 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రావల్సి ఉందని, ఇప్పటి వరకు యాజమాన్యం, ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోనట్టే వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ.23వేలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 75 శాతం ఫిట్‌మెంట్‌తో మాస్టర్ స్కేల్స్ అమలు చేయాలని కోరారు. 2017-18 బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారని, కానీ ఇప్పటికీ రూ.685 కోట్లు బకాయి ఉన్నదని చెప్పారు. 2018-19 బడ్జెట్‌లో టీఎస్‌ఆర్టీసీకి రూ.1,500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు తాము వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. రాజ్యాంగ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్న 1963 ఆర్టీసీ రెగ్యులైజేషన్స్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. పి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాలు, గ్రామీణ ప్రాంత సర్వీసుల నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, వివి గిరి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ సిఫార్సుల్ని అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు గృహనిర్మాణం కోసం రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణం ఇవ్వాలని, సకల జనుల సమ్మె కాలాన్ని ఆన్‌డ్యూటీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని, అర్హులకు పదోన్నతులు ఇవ్వాలని, మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ చార్టులు వేయాలని, తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బర్కత్‌పురా డిపోవద్ద జరిగిన ధర్నానుద్దేశించి ఎస్‌డబ్ల్యుఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ప్రకాశ్, రీజియన్ కార్యదర్శి బాలు ప్రసంగించారు.



మహేష్

నవచిత్రం

దూకుడు పెంచాడు..!



రామ్

ఇటీవల 'ఉన్నది ఒకటే జిందగీ' చిత్రంతో ప్రేక్షకులను నిరాశ పరిచిన రామ్ సినిమాల ఎంపిక విషయంలో దూకుడు పెంచాడు. ఇప్పటికే త్రినాథ్‌రావు నక్కిన దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్న రామ్ తాజాగా మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. గతేడాది 'గరుడవేగ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారట. తొలుత ఈ ప్రాజెక్ట్‌ను నితిన్‌తో చేయాలని భావించినప్పటికీ కొన్ని కారణాల వల్ల రామ్‌తో చేయబోతున్నారని తెలుస్తోంది. ప్రవీణ్ సత్తార్ నెరేట్ చేసిన కథ కూడా రామ్‌ను చాలా బాగా ఇంప్రెస్ చేసిందట. దీంతో ఆయన ఈ చిత్రంలో నటించేందుకు ఆల్‌మోస్ట్ రెడీగా ఉన్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. త్రినాథ్‌రావు నక్కిన దర్శకత్వంలో దిల్ రాజ్ నిర్మించే చిత్ర రెగ్యులర్ షూటింగ్ మార్చిలో ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే, ఓ నూతన దర్శకుడి చిత్రంలోనూ నటించేందుకు రామ్ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే నిజమైతే ముచ్చటగా మూడు ప్రాజెక్ట్‌లతో రామ్ ఈ ఏడాదంతా బిజీ బిజీ అని వేరే చెప్పక్కర్లేదేమో..

కైకాల సత్యనారాయణకు అరుదైన సత్కారం..



పరుచూరి వెంకటేశ్వరరావు, టి.సుబ్బరామిరెడ్డి, పద్మిని కొల్హాపురే, మురళీమోహన్, కైకాల సత్యనారాయణ

'మహాశివరాత్రిని పురస్కరించుకుని వైజాగ్ తీరంలో నిర్వహించే కోటిలింగాల ప్రతిష్ట సందర్భంగా ప్రముఖ సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణను 'విశ్వ నట సమ్రాట్' బిరుదుతో వైభవంగా సత్కరించనున్నాం' అని టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, 'ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీఆర్‌లకు కైకాల సత్యనారాయణ సమకాలీకులు. వెయ్యికిపైగా సినిమాల్లో ఎన్నో గొప్ప పాత్రలు పోషించి మన మనసుల్లో నిలిచిపోయారు. ఆయన్ని ఈ నెల 13న వైజాగ్‌లో స్వర్ణకంకణ ఘనసన్మానంతోపాటు 'విశ్వనట సమ్రాట్'తో సత్కరించుకోబోతున్నందుకు హ్యాపీగా ఉంది. నేను కళలను ప్రేమిస్తాను, ఆరాధిస్తాను. కళాకారులను గౌరవిస్తాను. కళలపై ఇష్టంతోనే కళాకారులను సత్కరిస్తున్నాను. రాజకీయాలకు అతీతంగా చేస్తున్న కార్యక్రమమిది. భారీ ఎత్తున జరిగే ఈ ఫంక్షన్‌కు ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా, బాలకృష్ణ, మోహన్‌బాబు, మురళీమోహన్ వంటి తదితర హేమాహేమీలు హాజరవుతారు. బాలీవుడ్ దర్శక, నిర్మాత యశ్‌చోప్రాతో కలిసి నేను 'చాందినీ', 'లామ్ హే' వంటి చిత్రాలను రూపొందించాను. భారతదేశం గర్వించదగ్గ ఫిల్మ్ మేకర్. ఆయన గుర్తుగా 'యశ్ చోప్రా స్మారక జాతీయ అవార్డు'ను 2014లో నెలకొల్పాను. మొదటిసారి ప్రముఖ నేపథ్యగాయని లతా మంగేష్కర్‌కు, 2015లో అమితాబ్ బచ్చన్‌కు, 2016లో రేఖ, 2017లో షారూఖ్ ఖాన్‌కు ఈ అవార్డును ప్రదానం చేశాం. ఈసారి మరో ప్రముఖ గాయని ఆశాభోంస్లేకు అందించనున్నాం. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. దీంతోపాటు 'కాకతీయ కళా వైభవం' పేరుతో త్వరలో మహబూబ్ నగర్‌లో భారీ వేడుకను నిర్వహిస్తాం. మా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'కైకాల సత్యనారాయణ ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నాకు పలు మంచి సూక్తులు చెప్పారు. వాటిని ఆచరిస్తూ ఈ స్థాయికి వచ్చాను. ఆయన్ని సత్కరించడమంటే అది ఇండస్ట్రీకే సత్కారం' అని మురళీ మోహన్ తెలిపారు. కైకాల సత్యనారాయణ చెబుతూ, 'వైజాగ్‌లో చేసే యజ్ఞం సందర్భంగా సుబ్బరామిరెడ్డి ఓ గొప్ప బిరుదుతో నన్ను సత్కరించబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఆయన కళా సేవ చేస్తూ నిజమైన కళాకారుడనిపించుకున్నారు. ఆయనకు రుణ పడి ఉంటాను' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరుచూరి వెంకటేశ్వరరావు, పద్మిని కొల్హాపురే, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్పెషల్..

'బ్రహ్మోత్సవం', 'స్పైడర్' వంటి బ్యాక్ టు బ్యాక్ భారీ డిజాస్టర్స్ తర్వాత మహేష్ నటిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. 'శ్రీమంతుడు' వంటి బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాన్ని అందించిన కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. కైరా అద్వాని కథానాయికగా నటిస్తోంది. ఇటీవల విడుదలైన చిత్ర ఫస్ట్‌లుక్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది. ఇందులో మహేష్ ముఖ్యమంత్రిగా నటిస్తున్నారు. అయితే రెగ్యులర్ సీఎంలా కాకుండా ఓ విభిన్న తరహా గెటప్‌లో మహేష్ కనిపిస్తారట. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఫైట్స్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నారట. మార్చి 8 వరకు జరిపే షెడ్యూల్‌తో ఒక్క పాట మినహా సినిమా పూర్తవుతుందట. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఏప్రిల్ 27న సమ్మర్ స్పెషల్‌గా సినిమాను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. డి.వి.వి దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా తర్వాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేష్ నటించనున్నారు. అమెరికా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో మహేష్ సరసన పూజా హెగ్డే నటించనుంది.

అద్భుతమైన క్రీడా నేపథ్య కథ..



రణ్‌వీర్ సింగ్

'ఇండియాలోనే అత్యంత అద్భుతమైన అండర్‌డాగ్ స్టోరీతో తెరకెక్కిస్తున్న చిత్రం '83'. ఇందులో నేను భాగమైనందుకు చాలా గర్వంగా ఉంది' అని అంటున్నారు రణ్ వీర్ సింగ్. ప్రపంచ క్రికెట్ చరిత్రలో 1983 వరల్డ్ కప్ మన దేశానికి చాలా ప్రత్యేకం. మొదటిసారి వరల్డ్ కప్ గెలుపొందిన సంవత్సరమది. కపిల్ దేవ్ నాయకత్వంలో ఆ గెలుపు సాధ్యమైంది. ఈ నేపథ్యంలో కపిల్ దేవ్ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని 1983 వరల్డ్ కప్ ప్రధానంగా '83' పేరుతో బాలీవుడ్‌లో ఓ చిత్రాన్ని కబీర్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో కపిల్ దేవ్ పాత్రలో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్నారు. ఈ చిత్రం గురించి రణ్‌వీర్ సింగ్ మాట్లాడుతూ, '1983 క్రికెట్ వరల్డ్ కప్ అనేది భారతీయ చరిత్రలోనే అద్భుతమైన స్పోర్ట్స్ స్టోరీ. మన విజయానికి సంబంధించినది. వెండితెరపై ఇలాంటి కథను చూపించబోతున్నందుకు గర్వంగా ఫీలవుతున్నాం. అలాగే కబీర్ ఖాన్ దర్శకత్వంలో పనిచేసేందుకు ఎగ్జైటింగ్‌గా వెయిట్ చేస్తున్నా. ఆయన రూపొందించిన 'బజరంగీ భాయిజాన్' నాకిష్టమైన, ఆల్ టైమ్ ఫేవరేట్ సినిమా. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న '83' చిత్రంలో నేను భాగం కావడం హ్యాపీగా ఉంది' అని చెప్పారు.

కోపంతో రగిలిపోయా..

'దీపికా పదుకొనెను చంపుతామని కర్ణిసేనలు బెదిరించినప్పుడు నాకు విపరీతమైన కోపం వచ్చింది. ఏదో ఒకటి చేయాలనుకున్నా, చిత్ర బృందం వారించడంతో మౌనంగా ఉండిపోయాను' అని రణ్‌వీర్ సింగ్ అన్నారు. 'పద్మావత్' చిత్ర విడుదల సందర్భంగా రాజ్‌పుత్ కర్ణిసేనతోపాటు పలు హిందూత్వ సంస్థలు దర్శకుడు భన్సాలీ, నటి దీపికను బెదిరించారు. దీపిక ముక్కు, తల తీసుకొస్తే కోటి రూపాయలు ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో తనలో కలిగిన భావాలను రణ్‌వీర్ సింగ్ ఇటీవల మీడియాతో పంచుకున్నారు. 'ఈ వివాదంలో నా పేరును ప్రస్తావించలేదు. స్పందించాల్సిన బాధ్యత దర్శక,నిర్మాతలది. అలాంటి సమయంలో నేనేం చేసినా వారి పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది. నాకది ఇష్టం లేదు. సినిమా విడుదలకు నా వంతు ప్రయత్నం చేయాలని మౌనంగా ఉండిపోయా' అని తెలిపారు.

సుందరమైన ఆలోచనకు కృతజ్ఞతలు..



సమంత

హీరోయిన్లపై టీజర్ రిలీజ్ చేయడం చాలా అరుదు. తాజాగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'రంగస్థలం' చిత్రానికి సంబంధించి సమంత ఫస్ట్‌లుక్ టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. గతంలో చరణ్ పరిచయ టీజర్‌ను రిలీజ్ చేయగా, తాజాగా రిలీజైన సమంత టీజర్ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. ఈ టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోన్న నేపథ్యంలో తనపై టీజర్‌ను విడుదల చేయడం పట్ల సమంత తెగ సంబరపడిపోతోంది.

ఆ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, 'హీరోయిన్ల కోసం ప్రత్యేకంగా టీజర్ విడుదల చేయడమనేది సాధారణంగా జరిగే విషయం కాదు. ఈ విషయంలో సుకుమార్‌ను చరణ్ పుష్ చేసినట్టు తెలుస్తుంది. ఇలా చేయడం ఒక సుందరమైన ఆలోచన. అందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని సమంత ట్వీట్ చేసింది. 1985లో గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ లవ్ స్టోరీలో చరణ్ చిట్టిబాబు పాత్రలో చెవిటి వాడుగా నటిస్తుండగా, పల్లెటూరి అమ్మాయి రామలక్ష్మి పాత్రలో సమంత నటిస్తోంది. ప్రేమికుల రోజును పురస్కరించుకుని ఈ చిత్రంలో తొలి పాటను విడుదల చేయనున్నారు.

మార్చి 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే, పెళ్ళి తర్వాత నాగచైతన్యతో కలిసి సమంత మరో సినిమాలో నటించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. గతంలో ఈ ఇద్దరు 'ఏమాయ చేసావె', 'ఆటోనగర్ సూర్య', 'మనం' చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్ని మెప్పించారు. వివాహానంతరం తొలిసారి కలిసి నటించబోతున్నారు. ఈ చిత్రానికి 'నిన్నుకోరి' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వం వహించనున్నాడట. ప్రస్తుతం సమంత 'మహానటి', 'ఇరుంబు థిరై', 'సూపర్ డీలక్స్' చిత్రాల్లో నటిస్తుంది. విజయ్ సేతుపతి, ఫాహద్ ఫాజిల్ హీరోలుగా నటిస్తున్న 'సూపర్ డీలక్స్' చిత్రాన్ని కేన్స్‌లో ప్రదర్శించేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేయటం విశేషం.

ట్రెమండస్ రెస్పాన్స్



ఆకాష్‌పూరీ

పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మెహబూబా'. ఆకాష్ పూరీ హీరోగా లావణ్య సమర్పణలో పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై పూరీ నిర్మిస్తున్న చిత్రమిది. నేహాశెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సందీప్ చౌతా సంగీతం అందిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తెలియజేస్తూ, '1971 ఇండియా-పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో సాగే ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, యు.ఎస్.లలో 500 థియేటర్లలో విడుదల చేశాం. చాలా డిఫరెంట్‌గా ఉన్న ఈ టీజర్‌కి ప్రేక్షకుల నుంచి, సోషల్ మీడియాలో ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. పూరీ జగన్నాథ్ కెరీర్‌లోనే డిఫరెంట్ చిత్రంగా 'మెహబూబా' తెరకెక్కుతోంది. సమ్మర్‌లో చాలా గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపింది.

నవాబ్ చాలా ప్రతిష్టాత్మకం..



అదితిరావు హైదరీ

'చెలియా' తర్వాత అదితి రావు హైదరీ మరోసారి మణిరత్నం దర్శకత్వంలో నటిస్తున్న విషయం విదితమే. శింబు, అరవింద్ స్వామి, విజయ్ సేతుపతి, అరుణ్ విజయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రమిది. జ్యోతిక, ఐశ్వర్య రాజేష్, డయానా, అదితి రావు హైదరీ హీరోయిన్లుగా, జయసుధ, ప్రకాష్‌రాజ్, త్యాగరాజన్, మన్‌సూర్ అలీ ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'నవాబ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శుక్రవారం టైటిల్ పోస్టర్‌ని చిత్ర బృందం విడుదల చేసింది. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఏఆర్ రెహ్మాన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళంలో ఒకేసారి తెరకెక్కిస్తున్నారు. 'మరోసారి మణిరత్నం దర్శకత్వంలో పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. నాకిది చాలా ప్రతిష్టాత్మకమైన చిత్రం. సరికొత్తగా ఉంటుంది' అని అదితి తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఇటీవల 'పద్మావత్' చిత్రంలో ఆకట్టుకున్న అదితి ప్రస్తుతం ఈ చిత్రంతోపాటు 'దాస్ దేవ్', 'చెక్కా చివంత వానమ్' చిత్రాల్లోనూ నటిస్తోంది.

దత్ కాదు సంజు..



రణ్‌బీర్ కపూర్

బాలీవుడ్ మున్నాభాయ్, ఖల్ నాయక్ సంజయ్ దత్ జీవితంపై బయోపిక్ రూపొందుతుంది. రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సంజయ్‌దత్ పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో 'దత్', 'సంజు బాబా' వంటి పేర్లు పరిశీలించినప్పటికీ ఫైనల్‌గా 'సంజు' అనే టైటిల్‌ను నిర్ణయించారట. ఇందులో రణ్‌బీర్ కపూర్‌తోపాటు సోనమ్ కపూర్, దియా మీర్జా, అనుష్క శర్మ, మనీషా కోయిరాలా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

ఓ ఫకీర్ అద్భుత ప్రయాణం..



ధనుష్

'నా తొలి ఇంగ్లీష్ సినిమా 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ఫకీర్'. ఇదొక అద్భుతమైన ప్రయాణం' అని అంటున్నారు ధనుష్. ఆయన నటిస్తున్న తొలి ఇంగ్లీష్ చిత్రం 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ఫకీర్'. కెన్ స్కాట్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ధనుష్‌తోపాటు బర్ఖద్ అబ్ది, ఎరిన్ మోరియార్టీ, అబెల్ జాఫ్రీ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్ర టీజర్ శనివారం విడుదలైంది. 'నా పేరు అజాతశత్రు లావిష్ పటేల్.. ' అనే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమైంది. 'ఈ కథ నాకు బాగా నచ్చింది. ఇది ముంబయిలోని ఓ చిన్న ప్రాంతం నుంచి వచ్చిన కుర్రాడి కథ. అతడికి ఏం తెలియదు. కానీ .. ' అంటూ ఓ వ్యక్తి మరోవ్యక్తికి ఈ కథను చెబుతున్నట్టుగా టీజర్ ఉంది. ధనుష్ ట్విట్టర్ ద్వారా టీజర్‌ను అభిమానులతో షేర్ చేసుకుంటూ, 'ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. ఇందులో ధనుష్ ప్యారిస్, ఫ్రాన్స్, ఇటలీ ఇలా అనేక ప్రాంతాలు తిరుగుతూ కనిపిస్తున్నారు. ధనుష్ ప్రయాణం, ఆయన ఎదుర్కొన్న సంఘటనల సమాహారంగా సినిమా రూపొందుతోంది. ఈ సందర్భంగా ధనుష్ ఇంకా చెబుతూ, 'ఈ ప్రపంచం చాలా చిన్నదైపోయింది. ఏ నగరానికైనా, దేశానికైనా, ఖండానికైనా వెళ్లొచ్చు. విదేశీయులు కూడా బాలీవుడ్ సినిమాలు చూడటం ఆనందంగా ఉంది' అని అన్నారు. ఈ చిత్రాన్ని మే 30న విడుదల చేయనున్నారు. ధనుష్ దీంతోపాటు ప్రస్తుతం 'ఎన్నై నోకి పాయుమ్ తోట', 'వాడచెన్నై', 'మారి 2' చిత్రాల్లో నటిస్తున్నారు.

ఇది సంపూర్ణ విజయం కాదు..



దీపికా పదుకొనె

'మేం సక్సెస్‌ను సెలబ్రేట్ చేస్తున్నంత మాత్రాన 'పద్మావత్' విజయం పూర్తవలేదు. ఇది ఇంకా కొనసాగాలి. మరింత మంది సినిమాను చూసి సక్సెస్‌లో భాగం కావాలి' అని అంటోంది దీపికా పదుకొనె. దీపికా టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'పద్మావత్'. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం అనేక వివాదాలను ఎదుర్కొని గత నెల 25న విడుదలైంది. ఈ సినిమా ఇప్పటి వరకు దాదాపు 250 కోట్లు వసూలు చేసి అత్యధిక కలెక్షన్లు రాబట్టిన మహిళా ప్రధాన చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం చిత్ర బృందం ఈ సినిమా విజయానందంలో ఉంది. ఈ సందర్భంగా ఓ అవార్డు వేడుకలో పాల్గొన్న దీపికా స్పందిస్తూ, 'ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్, షాహిద్‌లతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. సినిమా విజయంలో వాళ్ళిద్దరి భాగస్వామ్యం సమానంగా ఉంది. ఈ విజయాన్ని వాళ్ళు కూడా ఆస్వాదిస్తున్నారు. అయితే ఈ సక్సెస్ కేవలం ఓ వారంతానికి పరిమితం కాకూడదు. ఎక్కువ మంది ప్రేక్షకులు సినిమాను వీక్షించాలి. అప్పుడే సంపూర్ణ విజయం సాధించినట్టవుతుంది' అని తెలిపింది. దీపికా ప్రస్తుతం 'జీరో' చిత్రంలో అతిథి పాత్రలో మెరవనుంది.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు పరిష్కరించాలి

ఎఫ్ఎంఆర్ఏఐ సమావేశంలో సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత



మాట్లాడుతున్న హేమలత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, వర్కింగ్ రూల్స్‌ను రూపొందించి చట్టభద్రత కల్పించాలన్నారు. హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజేంటేటివ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఏఐ) ఆధ్వర్యంలో జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వమే అన్ని రకాల మందుల ధరలను నిర్ణయించి, అధీనంలో కొనసాగించాలన్నారు. యాజమాన్య విధానాన్ని రద్దు చేసి ఉత్పత్తులపై మందుల ధరలను నిర్ణయించాలన్నారు. మందులపై ఉన్న వివిధ సుంకాలను (జీఎస్‌టీ)ను రద్దు చేయాలన్నారు. మందుల రంగంలో జరుగుతున్న అనైతిక చర్యలకు అడ్డుకట్ట వేయడానికి స్టాచుటరీ కోడ్‌ను రూపొందించాలని, అతిక్రమించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వరంగ ఫార్మా కంపెనీలైన ఐడీపీఎల్, హెచ్ఏఎల్, ఆర్ఎస్‌డీపీఎల్ వంటి కంపెనీలను పునరద్ధరించి నాణ్యమైన మందులను తయారు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. అనంతరం ప్రముఖ విద్యావేత్త, రెసెప్షన్ కమిటీ చైర్మెన్ చుక్కా రామయ్య మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్ కోసం సేల్స్ ప్రమోషన్స్ కండీషన్స్ ఆఫ్ సర్వీస్ యాక్ట్ - 1976 చట్టాన్ని కంపెనీలు అమలు చేయడంలేదని విమర్శించారు.కనీసం అపాయింట్‌మెంట్ లెటర్ కూడా ఇవ్వని దుస్థితి నెలకొందన్నారు. దీనికి ప్రత్యేకంగా లేబర్ ఇన్స్‌పెక్టర్లను నియమించినప్పటికీ చట్టాలను అమలు చేయాలని యాజమాన్యాలను శిక్షించకపోవడం వల్ల కంపెనీలు ఎంఆర్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నిర్దిష్ట పని పద్ధతులు లేకపోవడం వల్ల వారిని కంపెనీలు దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. ఇష్టారాజ్యంగా మందుల ధరలను పెంచి అమాయక ప్రజలను దోచుకుంటున్నాయని అన్నారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం మూడు కోట్ల మంది అనారోగ్యం పాలవుతున్నారని, మందులను అధిక ధరక కొనుగోలు చేసి దారిద్ర్యరేఖ దిగువకు నెట్టబడుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా అధిక ధరల వల్ల లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలు డాక్టర్లను ప్రలోభపెడుతూ అనైతిక చర్యలు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. సమావేశంలో ఎఫ్ఎంఆర్ఏఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు ఆర్.విశ్వనాథన్, శంతన్ ఛటర్జీ, టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర నాయకులు మురళి, రాజుభట్, ముకుంద్, నాగేశ్వర్‌రావు ప్రసంగించారు. శనివారం కూడా సమావేశాలు కొనసాగాయి.

కేయూలో లొల్లి..

నవతెలంగాణ-కేయూక్యాంపస్

వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అవకతవకలపై పదిహేను రోజులుగా విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆందోళన శనివారం ఉద్రుతమైంది. విద్యార్థులంతా సామూహికంగా బిల్డింగ్‌పైకి ఎక్కి దూకేస్తామంటూ బెదిరించారు. దీంతో పోలీసులు వారికి కిందకు ఈడ్చుకొచ్చారు. అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలు విభాగాల పీహెచ్‌డీ సీట్ల కేటాయింపు ఫలితాలను కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు శనివారం ప్రకటించారు. అవకతవకలు జరిగాయని ఆందోళనలు చేస్తున్న క్రమంలో ఫలితాలు విడుదల చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు వీసీ బిల్డింగ్ ఎదుట ధర్నాకు దిగారు.

రిజిస్ట్రార్ ఆచార్య పురుషోత్తం, వీసీ ఆర్ సాయన్న అందుబాటులో లేకపోవడంతో వీసీ ప్రాంగణంలోకి చొచ్చుకెళ్లారు. పూలకుండీలను కింద పడేశారు. పోలీసులు వారిని వారించి బయటకు పంపారు. అక్కడ నుంచి వెళ్లిన విద్యార్థులు వీసీ బిల్డింగ్ ఎక్కి దూకేందుకు యత్నించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పోలీసులు విద్యార్థులను కిందికి ఈడ్చుకొచ్చారు. అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు వీరభద్రం మాట్లాడుతూ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాల్సిన అధికారులు యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. పీహెచ్‌డీ సీట్లన్నీ జేఎల్, డీఎల్‌లకు అమ్ముకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అర్హులైన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, పీడీఎస్‌యూ నాయకులు దుర్గం సారయ్య, బీఎస్ఎఫ్ నాయకులు బొట్ల మనోహర్, టీఆర్ఎస్‌వీ నాయకులు సూర్యకిరణ్, రాజగోపాల్, ఎంవీవీ నాయకులు కేతపాక ప్రసాద్, మట్టెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

డిప్యూటీ సీఎం కడియం

- బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరుగురికి గోల్డ్‌మెడల్స్ ప్రదానం

నవతెలంగాణ-బాసర

విద్యార్థులు విద్యావకాశాలను ఉపయోగించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాల మూడో స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యార్థులకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని, కళాశాలలో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాల నుంచి ప్రతియేటా ఎంతోమంది విద్యార్థులు నాసాకు ఎంపిక కావడం గొప్ప విషయమని, దేశానికే ఇది గర్వకారణమని అన్నారు. ఈయేడు స్నాతకోత్సవానికి 499 మంది విద్యార్థులు దరఖాస్తులివ్వగా అందులో 150 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. కళాశాల వైస్ ఛాన్సలర్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాలలో చదవడం, స్నాతకోత్సవానికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. అనంతరం 150 మందికి ప్రశంసా పత్రాలతోపాటు అత్యంత ప్రతిభకనబర్చిన కె.ప్రవీణ్‌కుమార్, ఎండి.హైదర్‌బాబా, ఎం.రజని, ఉంగరాల ప్రేమ్‌కుమార్, అవీన్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేసి సన్మానించారు. కళాశాల టాపర్‌గా షేక్ రశు ఎంపికయ్యాడు. ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, ఏఓ వెంకటస్వామి, సీఐ రఘుపతి, బాసర ఎస్ఐ టి.మహేశ్ పాల్గొన్నారు.

ఉన్నట్టా.. లేనట్టా!

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండాలన్న విషయాలను కూడా మంత్రి ఆ శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులకే వదిలేసినట్టు సమాచారం. దీంతో అసలు సంక్షేమానికి మంత్రి ఉన్నట్టా.. లేనట్టా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయ సంఘాల సమావేశం రసాభాస

- టీచర్ల హాజరుపై కథనాల ప్రతులు పంచడంపై మండిపాటు
- అర్థంతరంగా ముగిసిన సమావేశం, 15కు వాయిదా వేసిన కమిషనర్



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖలోని సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశం రసాభసాగా మారింది. ప్రారంభంలోనే విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తీరును తప్పుబడుతూ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆందోళనకు దిగారు. దీంతో సమావేశం పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే..వాయిదా పడింది. సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) రాష్ట్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాలతో పలు సమస్యలపై అభిప్రాయాల సేకరణ కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. అందరూ సీట్లలో కూర్చుంటున్న సమయంలో టీచర్ల బడికి రెగ్యులర్‌గా రావడం లేదని ఒక కథనం, టీచర్ల కృషితో ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల ఉందంటూ మరో కథనంతో కూడిన కొన్ని జిరాక్స్ ప్రతులు అక్కడ సర్క్యులేట్ అయ్యాయి. దీన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా తప్పుబట్టాయి. సమావేశానికి పిలిచి టీచర్లను అవమానించడం సరికాదని సంఘాల ప్రతినిధులు నిరసన తెలిపారు. అయితే మంచి, చెడు రెండు కథనాలు ఉన్నాయనీ, రెండింటినీ పరిశీలించాలని యూనియన్ల ప్రతినిధులను కమిషనర్ కోరినా వారు వినలేదు. అనేక సమస్యలు సృష్టిస్తూ, వాటికి పరిష్కారం చూపడం లేదని, ఎజెండాలో లేని అంశాన్ని ముందుకు తీసుకురావడం సరికాదని కమిషనర్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉపాధ్యాయులపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ..ఉపాధ్యాయులు హక్కులతో పాటు బాధ్యతలూ నిర్వహించాలనీ, అందరం కలిసి ఈ వ్యవస్థ బాగుకోసం కృషి చేద్దామని అన్నారు. ప్రత్యేకంగా తనకంటూ ఎజెండా ఏమీ లేదనీ, సమస్యల పరిష్కారం కోసమే ప్రతి రోజూ రాత్రి 12గంటల వరకూ పనిచేస్తున్నట్టు చెప్పారు. అయినా యూనియన్ ప్రతినిధులు శాంతించలేదు. ఈ క్రమంలోనే రాజ్‌భవన్ స్కూల్‌లో గవర్నర్ పర్యటన ఉందనీ, ప్రొటోకాల్ ప్రకారం తాను హాజరుకావాల్సి ఉందనీ, మిగిలిన అధికారులతో సమావేశం కొనసాగించాలని, తాను వెళ్లి వస్తానని చెప్పారు. దీనికి టీచర్స్ యూనియన్స్ ఒప్పుకోలేదు. దీంతో మరోసారి సమావేశం అవుదామని కోరడంతో యూనియన్ ప్రతినిధులు అంగీకరించారు. సమావేశాన్ని ఈనెల 15న మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేస్తున్నట్టు కమిషనర్ జి కిషన్ ప్రకటించారు. అయితే కమిషనర్ తీరును యూఎస్‌పీసీ, టీచర్స్ జేఏసీ, జాక్టో సంఘాల ప్రతినిధులు, టీచర్స్ యూనియన్ల వ్యవహారశైలిపై డీఈఓలూ, ఇతర అధికారులు తప్పుబట్టారు. ఈ సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ కృష్ణారావు, ఎస్ఎస్ఏ ఏఎస్‌పీడీ శ్రీహరి, ఉపాధ్యాయ సంఘాల నేతలు సీహెచ్ రాములు, చావ రవి, కొండల్‌రెడ్డి, మైస శ్రీనివాస్, సరోత్తంరెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, భుజంగరావు, రఘునందన్, చెన్నయ్య, వీరాచారి, రఘుశంకర్‌రెడ్డి, టి లింగారెడ్డి, మాణిక్‌రెడ్డి, రాజన్న, పద్మారెడ్డి, మధుసుధన్‌రెడ్డి, అహ్మద్ ఉన్నారు.

వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌గా శివప్రసాద్

- ఐఐహెచ్‌అండ్ఎఫ్‌డబ్ల్యూ డైరెక్టర్‌గా సోనిబాలాదేవికి అదనపు బాధ్యతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యవిధాన పరిషత్ కమిషనర్ (టీవీవీపీ)గా డాక్టర్ శివప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుతం కింగ్‌కోఠి జిల్లా ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంగా పనిచేస్తున్నారు. అదేవిధంగా మెడికల్ ప్లాంట్ బోర్డు సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్నా సోనీబాలాదేవికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఐఐహెచ్‌అండ్ఎఫ్‌డబ్ల్యూ) డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఈ రెండు పోస్టుల్లోను ఇంతకుముందు కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ ఇన్‌ఛార్జీగా వ్యవహరించేవారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఏ.శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిమ్స్‌కు అగర్వాల్ సమాజ్ ఐసీయూ బహుమానం

- నేడు ప్రారంభించనున్న మంత్రి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ ఆస్పత్రికి అగర్వాల్ సమాజ్ సహాయత సేవా ట్రస్ట్ పూర్తిస్థాయి ఐసీయూను బహుకరించింది. ఆదివారం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఐసీయూను ప్రారంభించనున్నారు. గతంలో ఈ సంస్థ గాంధీ దవాఖానాకు డయాలసిస్ కేంద్రాన్ని బహుకరించిన సంగతి తెలిసిందే. రూ.60 లక్షల విలువ చేసే ఐసీయూలో 5 వెంటిలేటర్లు ఉంటాయి. 7 మానిటర్లు, 6 వీల్ చైర్లు, 2 ట్రాలీలు, వెయిటింగ్ రూమ్ వద్ద స్టీల్ సోఫా సెట్లతోపాటు 2 ఎల్ఈడీ టీవీలను కూడా అందిస్తున్నదని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

తెరపైకి మహాకూటమి

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్‌తో ఈ ఫ్రంట్ పనిచేస్తుందని కాంగ్రెస్‌పార్టీ వర్గాలు తెలిపాయి.కాగా ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి విభజన అనంతరం ఆ పార్టీ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందాన మారింది. తెలంగాణ ఇచ్చామని ఆ పార్టీ పెద్దలు చెబుతున్నా ఇక్కడి జనం నమ్మటంలేదు.దీంతో టీఆర్ఎస్ ను వ్యతిరేకించే వర్గాలను,సమూహాలను తమవైపు తిప్పుకుంటే..2019లో ఎన్నికల నావ గట్టెక్కించవచ్చన్న భావన గాంధీభవన్ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. అందులో భాగంగా..

వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులతో ఆ పార్టీ నేతలు ఇప్పటికే సంప్రదింపులు జరిపింది. ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటికీ ఆ పార్టీని అనేక బలహీనతలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు తగాదాలు, ముఖ్యమంత్రి పదవి కోసం నేతల మధ్య తీవ్రమైన పోటీ, చిన్న చిన్న విషయాలకే ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదు చేసుకోవడం వంటి కారణాల వల్ల ఆ పార్టీ ప్రజల్లో విశ్వాసం పొందలేకపోతున్నదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీన్నుంచి బయట పడి టీఆర్ఎస్‌ను ఎదుర్కొనే పరిస్థితి లేకపోవడంతో కాంగ్రెస్‌పార్టీ ఫ్రంట్ ఏర్పాటును తెరపైకి తేవడం అందులో భాగంగా తెలుస్తోంది. టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ ఆధ్వర్యంలో ఏర్పడబోయే పార్టీ కూడా తమకు మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నేతలు తెలిపారు. ఇప్పటికే కోదండరామ్‌తో ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ కొప్పుల రాజు, కుంతియా, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ప్రాథమికంగా చర్చలు జరిపారు. కోదండరామ్‌కు మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంగానీ, లేదా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఎంపీగా పోటీ చేయించాలనే ఆఫర్ ఇచ్చినట్టు తెలిసింది. కోదండరామ్ 15 సీట్లు అడుగుతుంటే...కాంగ్రెస్ మాత్రం ఐదారు సీట్లకే పరిమితమవుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. టీఆర్ఎస్ ఆవిర్భావంలో కీలక భూమిక పోషించిన గాదె ఇన్నయ్యకు వరంగల్ తూర్పు నియోజకవర్గం టికెట్ ఇస్తారనే వార్తలు వస్తున్నాయి. ఎస్సీ వర్గీకరణ ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ కూడా టీఆర్ఎస్‌ను ఓడించడానికి కాంగ్రెస్‌తో జతకట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇటీవల ఆయన కుంతియాతో సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. గత ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్యను ఈ సారి తమవైపు నుండి పోటీ చేయించాలన్న ఆలోచనలో కాంగ్రెస్‌పార్టీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కృష్ణయ్య నిర్ణయం చెప్పలేదని తెలిసింది. బీసీ సంక్షేమ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాలమహానాడు అధ్యక్షులు అద్దంకి దయాకర్, ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ కాంగ్రెస్‌తోనే ఉన్నారు. వారితో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా తమవైపు తిప్పుకునేం దుకు కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయన్ను ఒప్పించేవిధంగా కోదండరామ్‌కు బాధ్యతలు అప్పగించారని ప్రచారం జరుగుతున్నది.

జేఏసీ పార్టీకి మార్చి 10న ముహూర్తం.?

జేఏసీ చైర్మెన్ కోదండరామ్ నేతృత్వంలో పార్టీ ఏర్పాటుకు ముహూర్తం కూడా ఖరారైంది. వచ్చే నెల 10న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి పార్టీ పేరును ప్రకటించాలని జేఏసీ నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయాన్ని జేఏసీలోని కొంతమంది సభ్యులు తెలిపారు. త్వరలో పార్టీ పేరు, గుర్తుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు చెప్పారు. తెలంగాణ జన సమితి, తెలంగాణ సకల జనుల పార్టీ, తెలంగాణ ప్రజా సమితి పేర్లపై చర్చిస్తున్నారు. ఈ మూడు పేర్లలో తెలంగాణ ప్రజా సమితి గతంలోనే రిజిస్టర్ కాగా, మిగిలిన రెండు పేర్లలో తెలంగాణ సకల జనుల పార్టీ పేరు పెద్దగా ఉందన్న అభిప్రాయాన్ని జేఏసీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన తెలంగాణ జన సమితి పేరువైపు జేఏసీ నేతలు మొగ్గు చూపుతున్నారని సమాచారం. పార్టీకి 'రైతు నాగలి చక్రం' గుర్తును ఎంపిక చేసే అంశంపై జెఏసిలో చర్చ జరుగుతున్నది. మిలియన్ మార్చ్‌ను 2010 మార్చి 10న నిర్వహించింది. అందుకే ఆ తేదీని ఎంపిక చేసినట్టుగా తెలుస్తోంది.

సమాన వేతనమివ్వాలి

- వెట్టిచాకిరి చేయిస్తున్న సర్కార్: ప్రొఫెసర్ కె నాగేశ్వర్
- వేసవిలోనూ వేతనం ఇవ్వాలి: టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సమస్యలను పరిష్కరించాలనీ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో(యూఆర్ఎస్) పనిచేస్తున్న టీచర్లు, ఉద్యోగులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారీగా మహిళా టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం 10గంటల నుంచే డైరెక్టరేట్‌కు చేరుకున్న టీచర్లు, ప్రధాన గేటు ఎదుట భైటాయించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె నాగేశ్వర్ మాట్లాడుతూ...సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా, కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో మాత్రం ఆ ఆదేశాలు అమలు చేయకపోవడం సరికాదని అన్నారు. ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం దారుణమన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కాంట్రాక్టు విధానమే ఉండదని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్రం ఏర్పడి నాలుగేండ్లు కావొస్తున్నా అదే విధానాన్ని కొనసాగించడం ఆయన ద్వంద నీతికి నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు మాదిరిగానే కాకుండా కేజీబీవీ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిపై టీచర్లను నియమించి తక్కువ వేతనాలు చెల్లించడం వెట్టిచాకిరి చేయించడమేనని అన్నారు. ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అమలు చేయాల్సిన భాధ్యత ప్రభుత్వాలదేనని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేజీబీవీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తుతం పట్టించుకోవడం లేదని చెప్పారు. నిరంతరం సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నిజాయితీ సంఘం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ...రాష్ట్రంలో 475 కేజీబీవీలు, 29 యూఆర్ఎస్ పాఠశాలలు ఎస్ఎస్ఏ పరిధిలో కొనసాగుతున్నాయని, వీటిలోని ఉద్యోగ, ఉపాధ్యాయులంతా కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగుతున్నారని చెప్పారు. వేసవి సెలవులలో వేతనం చెల్లించడం లేదని, సెలవులు మంజూరీ విషయంలోనూ వివక్ష కొనసాగుతున్నదని రాష్ట్రస్థాయి అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన ఫలితం లేదని అన్నారు. దీంతో మూడుదశల్లో ఆందోళన కార్యక్రమాలు చేసినట్టు చెప్పారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎ నర్సిరెడ్డి మాట్లాడుతూ...కేజీబీవీ, యూఆర్ఎస్‌ల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.200కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మహిళా టీచర్లు, ఉద్యోగులకు ఆరునెలల పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ దుర్గాభవాని మాట్లాడుతూ...కేజీబీవీల్లో పనిచేస్తున్న వారంతా మహిళలేనని, వారికి ఇస్తున్న వేతనాలతో వారిపై ఎంత వివక్ష కొనసాగుతుందో అర్థమవుతుందని అన్నారు. ధర్నా అనంతరం కేజీబీవీల రాష్ట్ర ఇన్‌చార్జి రత్నకుమారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సోమశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు టి.లక్ష్మారెడ్డి, ఎం.దేవదాసు, ఎం.ఆంజనేయులు, డి సత్యానంద్, ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఎ.వెంకట్, ఆర్.శారద, వి.శాంతికుమారితో పాటు వివిధ జిల్లాల నుంచి వందలాది మంది టీచర్లు పాల్గొన్నారు.

మీ ఆకాంక్షల్ని గౌరవిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న ప్రేమను గుర్తు చేస్తున్నదని, భారత నాయకత్వం ఎల్లప్పుడూ పాలస్తీనా శాంతి కోసం కృషి చేసిందని ఆ దేశ అధ్యక్షుడు అబ్బాస్ అన్నారు. విదేశీ నేతలకిచ్చే ఆ దేశ అత్యున్నత గౌరవం గ్రాండ్ కాలర్‌తో ప్రధాని మోడీని పాలస్తీనా సత్కరించింది. అందుకు అధ్యక్షుడు అబ్బాస్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఇది భారత ప్రజలకు దక్కిన గౌరవమని, తమకు పాలస్తీనాతో ఉన్న స్నేహానికి ఇది గుర్తుగా నిలుస్తుందని ప్రధాని అన్నారు.

ప్రధాని నరేంద్రమోడీ శనివారం పాలస్తీనా చేరుకున్నారు. మూడు పశ్చిమాసియా దేశాల పర్యటనలో భాగంగా శుక్రవారం జోర్డాన్‌లో పర్యటన ముగించుకొని రమల్లా(పాలస్తీనా)కు వెళ్లారు. ఈ ప్రయాణంలో ప్రధాని మోడీకి జోర్డాన్‌కు చెందిన రాయల్ చాపర్స్‌తోపాటు ఇజ్రాయిల్‌కు చెందిన వాయుసేన చాపర్స్‌ను ఎస్కార్ట్‌గా ఉపయోగించారు. రమల్లాలో పాలస్తీనా ప్రధాని రమీ హమ్‌దల్లాతో కలిసి ప్రధాని మోడీ ఆ దేశ మాజీ అధ్యక్షుడు, పాలస్తీనా విమోచన సంస్థ(పీఎల్‌వో) నేత యాసర్ అరాఫత్ సమాధిని సందర్శించి పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు. పాలస్తీనాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. కొన్ని వారాల క్రితమే భారత్ వచ్చిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఆ దేశంతో సంబంధాల బలోపేతంపై హామీ ఇచ్చిన ప్రధాని మోడీ ఇప్పుడు పాలస్తీనాలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకున్నది. గతేడాది ఇజ్రాయిల్‌లో పర్యటించిన ప్రధాని మోడీ ఆ సందర్భంగా పక్కనే ఉన్న పాలస్తీనాకు వెళ్లకపోవడాన్ని కాంగ్రెస్, వామపక్షాలు తప్పు పట్టిన విషయం తెలిసిందే.

కంది రైతులను ఆదుకోవాలి : మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంది రైతులను ఆదుకోవాలని మార్కెటింగ్ శాఖ మంత్రి టి. హరీశ్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్‌కు లేఖ రాశారు. కందుల కనుగోళ్ల పరిమితిని పెంచాలని కోరారు. ఈ సీజన్‌లో కందులు 2 లక్షల 84 వేల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి రానుందని తెలిపారు. అయితే 75 వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే కేంద్రం అంగీకరించడం పట్ల తీవ్ర అసంతృప్తిని ప్రకటించారు. రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. మద్దతు ధర క్వింటాలుకు 5,450 రూపాయలుండగా మార్కెట్‌లో రూ.3800 నుంచి రూ.4200 వరకు రైతులు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. కేంద్రం స్పందించకపోతే భవిష్యత్తులో పప్పుధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో సామాన్య వినియోగదారులపై భారం పడనున్నదని తెలిపారు.

పెరిగిన వరి సాగు

(మొదటిపేజీ తరువాయి)

రూ.3500 మించి ధర పలకలేదు. మిర్చి పరిస్థితి కూడా అంతే. మిర్చి కొనుగోలు చేసే వారు లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఖమ్మంలో క్యూలో నిలబడే పరిస్థితి వచ్చింది. ఈ అనుభవంతో రైతులు ఆ పంటలు సాగుకు వెనక్కి తగ్గిండొచ్చని అధికారులు తెలిపారు. వేరుశనగ, ఉలవలు, ఆవాల పంటలు గత సంవత్సరంతో పోలిస్తే ఏ మాత్రం పెరగలేదు.

పంటలు	2017	2018 (లక్షల హెక్టార్లలో)
గోధుమ	0.2	0.2
జొన్న	0.21	0.23
మొక్కజొన్న	1.49	1.32
కంది	0.2	0.1
శనగలు	1.39	1.02
పెసర	18	0.7
మినుములు	18	0.8
పొద్దుతిరుగుడు	0.8	0.3

లోక్ అదాలత్‌లో ఒక్కరోజే 28 వేలకేసులు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

పరిహార చెల్లింపులు జరిగాయి. తెలంగాణలో పది వేల కేసులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 18 వేల కేసులు పరిష్కారమయ్యాయి. తెలంగాణలో రూ.26 కోట్లు, ఏపీలో 32 కోట్ల రూపాయలకుపైగా పరిహార చెల్లింపులకు కేసుల్లోని ఇరుపక్షాల వారు అంగీకరించారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 500 కేసుల ద్వారా 6.5 కోట్లు పరిహార చెల్లింపులకు ఆమోదం లభించింది.

ఈ మేరకు ఏపీ/తెలంగాణ రాష్ట్రాల లీగల్ సర్వీసెస్ అథారిటీల సభ్య కార్యదర్శులు రాంబాబు, మధుసూదన్‌రావు వేరువేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. హైకోర్టు వివరాల్ని లీగల్ సర్వీసెస్ కమిటీ ఇంచార్జి కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలియజేశారు. కేసులు పరిష్కారమైన [illegible] కింద నమోదైన రోడ్డు ప్రమాదాలకు సంబంధించినవి ఉన్నాయి.

రూ.250 కోట్ల అంచనాతో దేవదాయ శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బడ్జెట్లో దేవాదాయ శాఖకు రూ.250 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 2018-19 బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలపై దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు, ఖర్చులు, అంచనాలపై చర్చించారు. ఆలయ ఉద్యోగులు, అర్చకుల వేతనాలు, ధూప దీప నైవేద్యం, నూతన ఆలయాల నిర్మాణాలను దష్టిలో పెట్టుకోవాలని సూచించారు. కొత్తగా మూడు వేల ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపు ప్రక్రియపై పై జిల్లా స్థాయిలో త్వరితగతిన నివేదికలను సిద్ధం చేసి దేవాదాయ శాఖ కమిషనర్ కు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. మరోవైపు ఆలయాల్లో ప్రసాదాల మీద జిఎస్‌టి విధించడంపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, చర్చించి ఓ పరిష్కారం చూడాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ శివశంకర్, అడిషనల్ కమిషనర్ శ్రీనివాస రావు, [illegible] అధికారులు పాల్గొన్నారు.

మద్యం ధరలకు మొబైల్ ఆప్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్



లిక్కర్ ప్రైస్ మొబైల్ ఆప్‌ను ఎక్సయిజ్ శాఖ మంత్రి పద్మారావుగౌడ్ విడుదల చేశారు. శనివారం సచివాలయంలో తెలంగాణ మద్యపాన నిషేధ ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మద్యం ధరల పట్టికలు, తెలంగాణ వ్యాప్తంగా మద్యం దుకాణాలలో సిసిటీవీ కెమెరాలను ప్రారంభించబోతున్నట్టు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. తెలిపారు. ఒక్కో ప్రాంతంలో ఎక్కువగా అమ్ముడు పోయే 25 బ్రాండ్ల మద్యం ధరలు, 5 బీర్ బ్రాండ్ల ధరలు మద్యం ధరల పట్టిక మద్యం షాపుల వద్ద [illegible] సంబంధించి పట్టికను [illegible]. లిక్కర్ ప్రైస్ ఆప్‌లో 880 బ్రాండ్ల ధరలను చూడవచ్చన్నారు. వాట్సాప్ ద్వారా 7989111222 లేదా ఉచిత ఫోన్ కాల్ ద్వారా 18004252523కు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తామన్నారు. ఇతర ఫిర్యాదులను కూడా చేసుకునే వీలుందన్నారు.

సెన్సెక్స్ ▼407 34,005

నిఫ్టీ ▼121 10,454

తెలంగాణలో నిర్మాణ సామగ్రి పార్క్

● రూ.600 కోట్ల వ్యయంతో ఏర్పాటు ● సుమారు 250 ఎకరాలలో నిర్మాణం ● కేఈఎఫ్‌తో కలిసి ఏర్పాటుకు కృషి
● 10,000 మందికి ఉపాధి అవకాశం : పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: తెలంగాణలో నిర్మాణ సామగ్రి పార్క్‌ను (బిల్డింగ్ మెటీరియల్స్ పార్క్) ఏర్పాటు చేయనున్నట్లుగా ప్రభుత్వం శనివారం ప్రకటించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన కేఈఎఫ్ హోల్డింగ్స్ సంస్థతో కలిసి తాము పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్టుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారకరామారావు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సంయుక్త పత్రికా సమావేశంలో మంత్రి ఈ పార్క్ వివరాలను వెల్లడించారు. దేశంలోనే ఇలాంటి పార్క్ ఏర్పాటు చేయనుండడం ఇదే తొలిసారని తెలిపారు. కేఈఎఫ్ హోల్డింగ్స్ అండ్ కేఈఎఫ్ ఇన్‌ఫ్రా సంస్థలు కలిసి దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో ఈ పార్క్‌లో ప్రధాన తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టుగా ఆయన వివరించారు. దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నట్లుగా విశ్లేషించారు. పార్క్ ఏర్పాటునకు అవసరమైన స్థల సేకరణకు అన్వేషణ జరుపుతున్నట్టుగా కేటీఆర్ తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్ చట్టుపక్కల నాలుగు ప్రాంతాలను ఎంపిక చేసినట్లుగా ఆయన వివరించారు. పార్క్ ఏర్పాటునకు అవసరమైన భూమిని, మౌలిక సదుపాయాలను సర్కారు సమకూర్చుతుందని ఆయన అన్నారు. దీనికి తోడు స్థానిక యువత ఉపాధి కోసం అవసరమైన శిక్షణను కూడా ప్రభుత్వమే అందజేస్తుందని మంత్రి తెలిపారు. ఈ ప్రతిపాదిత పార్క్‌తో దాదాపు



10,000 మందికి ప్రత్యక్షంగానూ.. వేలాది మందికి పరోక్షంగాను ఉపాధి లభించనుందని కేటీఆర్ వివరించారు. ఈ సందర్భంగా కేఈఎఫ్ హోల్డింగ్స్ అండ్ కేఈఎఫ్ ఇన్‌ఫ్రా సంస్థల వ్యవస్థాపకులు, ఛైర్మన్ ఫైజల్ ఈ కొట్టికొల్లోన్ మాట్లాడుతూ తమ ప్లాంట్ ఏర్పాటుకు దేశంలోని వివిధ రాష్ట్రాలు ముందుకు వచ్చాయని అన్నారు. ఆయితే ఆయా రాష్ట్రాలు కల్పిస్తున్న అవకాశాలను విశ్లేషించుకున్న తరువాత తాము తెలంగాణలో ప్లాంటు పెట్టాలని నిర్ణయించుకున్నట్టుగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల విధానాన్ని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. తెలంగాణలో మెరుగైన రవాణా సౌకర్యాలతో పాటుగా.. ప్లాంటు నిర్మాణానికి పలు అనుకూలమైన అంశాలున్నందునే తాము దక్షిణాదిలకే రాష్ట్రంలో అత్యధిక పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌తో పాటు సంస్థకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

బొల్లారంలో కార్ల తయారీ ప్లాంట్: ఈ-ట్రియో

పర్యావరణహిత విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఈ-ట్రియో ఆటోమొబైల్ వ్యవస్థాపకులు సత్యా యలమంచిలి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము మూడు వేరియంట్లలో ఈవీ 100, ఈవీ 180, మరో హచ్‌బ్యాక్‌ను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. త్వరలోనే వీటిని విడుదల చేయనున్నామని చెప్పారు. 2018 మార్చి నుంచి మార్కెటింగ్‌ను ప్రారంభించనున్నామని చెప్పారు. వీటి టెక్నలాజీ కోసం అమెరికన్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టుగా వివరించారు. కాగా ఈ కార్లు 25 నిమిషాల్లోనే చార్జింగ్ అయ్యేలా చైనా కంపెనీతో టెక్నాలజీ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టుగా వెల్లడించారు. నెలకు 1500 కార్ల తయారీ సామర్థ్యంతో బొల్లారంలో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నట్టుగా తెలిపారు. మరో 15 నెలల్లో ఈ ప్లాంట్ అందుబాటులోకి రానుందని ఆయన వివరించారు.



- నవతెలంగాణ, వాణిజ్య విభాగం

రూ.991లకే విమానయానం: గోఎయిర్

న్యూఢిల్లీ : గోఎయిర్ విమానయాన సంస్థ తక్కువ చౌక విమానయాన పథకాన్ని ప్రకటించింది. తాము కేవలం రూ.991కే విమానయానం అందించనున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్ కింద ఔత్సాహిక ప్రయాణికులు ఫిబ్రవరి 20 వరకు తమ ప్రయాణ టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకునే వారికి అదనంగా 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్టు సంస్థ వెల్లడించింది. ఈ పథకంలో భాగంగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రూ.1,731కే విమానయానం అందిస్తున్నట్టుగా తెలిపింది. హైదరాబాద్ నుంచి చెన్నైకి రూ.1,399 టికెట్ ధరను నిర్ణయించింది. మరిన్ని నగరాలకు కూడా ఈ సదుపాయం అందుబాటులో ఉంచినట్లు సంస్థ తెలిపింది.

ఫోర్టిస్ 'సింగ్'ల వివాదంపై సెబీ నజర్!



న్యూఢిల్లీ : ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన ఫోర్టిస్ హాస్పిటల్స్ నుంచి కంపెనీ ప్రమోటర్లుగా ఉన్న సింగ్ సోదరులకు రూ.500కోట్ల రుణ నిధుల తరలింపు వివాదంపై సెబీ సీరియస్ అయింది. బోర్డు అనుమతి లేకుండా ఎలా రుణం తీసుకున్నారో సింగ్ సోదరుల నుంచి వివరణ కోరుతున్నామని సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి పేర్కొన్నారు. ఈ అంశంపై శుక్రవారం ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు సెబీ నోటీసులు కూడా పంపించింది. ఈ నోటీసులపై ఫోర్టిస్ స్పందిస్తూ.. స్వల్ప కాలిక పెట్టుబడుల కింద ఏడాది క్రితం ఈ రుణాన్ని ఇచ్చామని, పూర్తి హామీతో షరతులకు లోబడే ఇచ్చామని తెలిపింది. ఈ వివాదంతో ఇప్పటికే సింగ్ సోదరులు మల్వీందర్ మోహన్ సింగ్, శివీందర్ మోహన్ సింగ్‌లు కంపెనీ బోర్డుకు రాజీనామా చేశారు.

ఎర్రజెండాను ఖతం చేస్తామన్నవారే

కనుమరుగయ్యారు..



మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

ప్రజా పోరాటాలే మా పంథా- ఎర్ర జెండాకు పూర్వ వైభవం తెద్దాం

- ఉద్యమాలకు పెరుగుతున్న అవకాశాలు
- ఐక్యతను దెబ్బతీసేందుకు మత ఘర్షణలు
- దేశ సమగ్రతకు బీజేపీ ప్రమాదం
- ప్రభుత్వ వ్యవస్థల్లోనూ ఆర్ఎస్ఎస్ జోక్యం
- దేశంలో పెరుగుతున్న ఆకలి మరణాలు, ఆత్మహత్యలు : సీపీఐ(ఎం)ఏపీ 25 రాష్ట్ర మహాసభల ప్రారంభోపన్యాసంలో ఏచూరి



భీమవరంలో...

పర్ససత్యనారాయణనగర్(భీమవరం)నుంచి
నవతెలంగాణ హైదరాబాద్ బ్యూరో

ఎర్రజెండాను ఖతం చేస్తామన్న పెద్దలే కనుమరుగయ్యారని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. హిట్లర్,ఇందిరాగాంధీ లాంటి వారు ఎర్రజెండాను ఖతం చేస్తామన్నా..అది సాధ్యం కాలేదన్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రజాపోరాటాలే మా పంథా అని, ఈ ఉద్యమాలతోనే ఎర్రజెండాకు పూర్వ వైభవం వస్తుందని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగానూ, దేశంలోనూ నెలకొన్న పరిస్థితులు ఉద్యమాలకు అవకాశం కల్పిస్తున్నాయని అన్నారు. అనుకూల పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలు చేయడం ద్వారానే ఉద్యమాలు బలోపేతమై వామపక్ష ఉద్యమానికి పూర్వవైభవం వస్తుందని ఏచూరి అన్నారు. శనివారం భీమవరంలో పర్స సత్యనారాయణనగర్లోని సింహాద్రి శివారెడ్డి ప్రాంగణంలో జరుగుతున్న సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర 25వ మహాసభలను సీతారాం ఏచూరి ప్రారంబోపన్యాసం చేశారు. మహాసభ ప్రారంభంలో తొలుత వక్తలను సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు వేదిక మీదకు ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసంతోపాటు, సాయంత్రం అల్లూరి సీతారామరాజునగర్‌లోని లూథరన్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరుతో పాలకులు ప్రజలను దోచుకుంటున్నారని, దీనికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ పెద్దఎత్తున ఉద్యమాలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఈ ఉద్యమాలను దెబ్బతీసేందుకు ప్రజలు, వేదికల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు బీజేపీ మతోన్మాద హింసను పెంచుతోందని తెలిపారు. దీనివల్ల దేశ సమైక్యత ప్రమాదంలో పడుతోందని, నిరంకుశత్వం పెరుగుతోందని చెప్పారు. స్వాతంత్ర్య భారతదేశంలో తొలిసారి బీజేపీ ప్రయివేటు సైన్యాన్ని ఏర్పాటు చేసి, పోషిస్తోందని అన్నారు. గోరక్షణ పేరుతో ప్రజలపై దాడులకు దిగారని తెలిపారు. యాంటీ రోమియో స్క్వాడ్ పేరుతో యువతీ, యువకులపై దాడులు చేస్తున్నారన్నారు. యూనిర్సిటీల్లోనూ విద్యార్థులపై దాడులు చేస్తున్నారన్నారు. ఇవన్నీ కూడా ప్రజల్లో ఏర్పడుతున్న ఐక్యతను దెబ్బతీసే చర్యల్లో భాగమేనన్నారు. దీంతోపాటు చట్ట సంస్థల్లోనూ ఆర్ఎస్ఎస్ జోక్యం పెరిగిపోయిందని తెలిపారు. సెన్సార్‌బోర్డును, ఎన్నికల సంఘాలనూ నియంత్రిస్తోందని తెలిపారు. దేశాన్ని హిందూత్వ దేశంగా మార్చాలనే ఉద్దేశంతో ఇష్టం వచ్చినట్టు చేసుకుపోతోందని విమర్శించారు. న్యాయవ్యవస్థలోనూ తోచినట్టు మార్పులు చేస్తోందని, ఇటీవల న్యాయమూర్తులు బహిర్గతమవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. దీన్ని వ్యతిరేకించే వారిపై దాడులు చేస్తూ హత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గోవింద్ పన్సారే, కాల్బుర్గి, గౌరిలంకేశ్ హత్యలు అందులో భాగమేనన్నారు. మతోన్మాద హత్యలు, ఆర్థిక సమస్యలు, దళితులపై దాడులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాలు పుట్టుకొస్తున్నాయన్నారు. వీటన్నిటినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందని తెలిపారు. దళిత సంఘాలూ ఒక వేదికపైకొచ్చాయని, లాల్, నీల్ ప్రస్తావన కూడా ముందుకు వచ్చిందని తెలిపారు.

భారత్‌ను జూనియర్ భాగస్వామిగా మారుస్తున్న బీజేపీ

దేశంలో మోడీ ప్రభుత్వం సంస్కరణలను వేగంగా అమలు చేస్తోందన్నారు. సంస్కరణలు అమలు చేసిన దేశాలన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయని తెలిపారు. సంస్కరణలో భాగంగా ప్రజలపై పెరుగుతున్న భారాలు, ఆర్థిక ఇబ్బందులకు వ్యతిరేకంగా ప్రజల్లో పెద్దఎత్తున ఉద్యమాలు పుట్టుకొస్తున్నాయని తెలిపారు. మరోవైపు అమెరికన్ సామ్రాజ్యవాదానికి దాసోహమై స్వతంత్రను కోల్పోయే విధంగా చేస్తున్నారని విమర్శించారు. గతంలో మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన సమయంలో కార్పొరేట్‌శక్తుల లాభాలు పుంజుకున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల 2014 నాటికి మొత్తం జీడీపీలో 49 శాతం ఆస్తులు ఒకశాతం ఉన్న వ్యాపారవేత్తల చేతుల్లోకి వెళ్లిందన్నారు. మోడీ పాలనలో మూడేండ్లకాలంలో 2017 నాటికి వచ్చే సరికి ఆస్తులు 49 శాతం నుండి 73 శాతానికి పెరిగాయని తెలిపారు. ఆర్థిక అసమానతలు దేశంలో విపరీతంగా పెరిగిపోతున్నాయని వివరించారు. రైతులకు కల్పిస్తామన్న కనీస మద్దతు ధర కల్పించలేదని, నిరుద్యోగభృతి, ఉపాధి కల్పన వంటి సమస్యలు ఇంకా పరిష్కారం చేయలేకపోయారని పేర్కొన్నారు. ఒకవైపు రైతుల ఆత్మహత్యలు, ఆకలి మరణాలు పెరుగుతుంటే వారికి రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలకు రెండు లక్షల కోట్ల మినహాయింపులు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ రుణమాఫీ అమలు కాలేదని చెప్పారు.

త్రిపురలో గెలుపుకోసం అడ్డదారులు

దేశంలో బీజేపీ వామపక్షాలను టార్గెట్ చేసిందని, ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న త్రిపురలో ఓడించేందుకు సంఘ విద్రోహశక్తులతోనూ చేతులు కలుపుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అక్కడ సీపీఐ(ఎం)ను ఓడించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తోందని తెలిపారు. రాజకీయ హింసను రెచ్చగొడుతోందని అన్నారు. గతంలో అనేక రాష్ట్రాల్లో బీజేపీ అదే పద్ధతి అనుసరించి అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ పూర్తి మెజార్టీతో అధికారంలో ఉన్నామని చెబుతున్నా 112 మంది ఎంపీలు ఇతర పార్టీల నుండి వెళ్లినవారేనని లెక్కలు చెబుతున్నాయన్నారు.ఏపీ రాష్ట్రంలో టీడీపీ కూడా బీజేపీతో కలిసి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా తెస్తామని చెప్పి నాలుగేండ్లు గడిచినా ఏమీ చేయలేకపోయిందని అన్నారు. హామీల అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ అరాచకాలను, కార్పొరేట్ల దోపిడీని అడ్డుకునేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను వామపక్షాలకు అనుకూలంగా మార్చుకోవాలని ఏచూరి సూచించారు. స్వతంత్రశక్తిగా ఎదగాలన్నారు.

బీజేపీతో ఏపీకి ప్రత్యేక హోదా రాదు

ప్రత్యేక హోదా బీజేపీ వల్ల సాధ్యం కాదని స్పష్టం చేశారు. త్రిపురలో బీజేపీ వస్తుందని ప్రకటించి మోడీ విదేశాలకు వెళ్లిపోయారని, ఎర్రజెండాను దించడం ఎవరికీ సాధ్యంకాదని ఏచూరి స్పష్టం చేశారు. గతంలో హిట్లర్, మాజీ ప్రధాని ఇందిరిగాంధీ ఎర్రజెండాను కతం చేస్తామని ప్రగల్బాలు పలికారని, అయితే అది వారికి సాధ్యం కాలేదని అన్నారు. మోడీ మాటలన్నీ ప్రగల్బాలేనని ఎర్రజెండాను దించే దమ్ము దేశంలో ఎవరికీ లేదన్నారు. దేశానికి ప్రత్యామ్నాయ విధానాలు అవసరమని, వాటిని అనుసరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వేలాది ఇంజినీరింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇంజినీరింగ్ చదువుపట్ల యువత ఆసక్తి చూపడం లేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వాలని యువత అడిగితే 'పకోడి అమ్ముకోమని' మోడీ చెబుతారా అని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకూ దేశంలో 8 కోట్ల కొత్త ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బీజేపీతో తిరిగి ఎందుకు కలిశారని అడిగానన్నారు. దానికి చంద్రబాబు సమాధానం చెబుతూ కేంద్రంలో బీజేపీ, ఏపీ రాష్ట్రంలో టీడీపీ ఉండడం వల్ల ప్రజలకు మేలు చేస్తామని చెప్పారని అన్నారు. అయితే ప్రస్తుతం ప్రత్యేక హోదా, ఇతర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని తమను కోరుతున్నారని ఏచూరి చెప్పారు. సీఎం కోరినా, కోరకపోయినా తాము ఎప్పుడూ ఏపీ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో పోరాడుతున్నామని ఏచూరి స్పష్టం చేశారు.

పేదలపై దౌర్జన్యాలు సాగనివ్వం

- ఏపీ కార్యదర్శి పి.మధు



భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలపై పెద్దఎత్తున చేస్తున్న దౌర్జన్యాలను ఇకపై సాగనవ్వమని సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు అన్నారు. ' ఇదేం పాలన? పేదల భూములను గుంజుకుంటున్నారు. న్యాయం చేయమని అడిగితే దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఇకపై వీటిని సాగనివ్వం. ఎక్కడికక్కడ అడ్డుకుంటాం. ఈ విధానాలను తిప్పికొడతాం' అని ఆయన అన్నారు. శనివారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు నగర్ (లూథరన్ గ్రౌండ్)లో పార్టీ 25వ రాష్ట్రమహాసభల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మధు మాట్లాడుతూ 'పోలవరంలో గిరిజనం మునిగిపోతుంటే ఎన్‌టిఆర్ ఇళ్లంటూ గిరిజనుల మధ్య తగాదాలు పెడుతున్నారు. . సాగు భూములకోసం పోరాడే మహిళలపై ఒక్కొక్కరిపై 90 కేసులు పెట్టారు. వంశధారలో 24ఊళ్లను బుల్డోజర్‌తో కూల్చేశారు. గరగపర్రులో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టనివ్వరు. గండికోటలో నీరిస్తామని చెప్పి నిర్వాసితులను ముంచేసే యత్నం చేశారు. . గుంటూరు జిల్లా ఎండవిల్లిలో పేదల భూములు 450 ఎకరాలను టిడిపి వారే గుటకాయ స్వాహాచేశారు. ఈ విధానాలను ఇంకా సహించాలా?' అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పద్ధతేమాత్రం బాగోలేదన్నారు. ఈ మూడున్నరేండ్ల కాలంలో రాష్ట్రంలో ప్రజలకిచ్చే మాటలు నీటిమూటలుగా మిగిలాయన్నారు.

రాష్ట్రాలు వేరైనా సమస్యలు అవే : సీపీఐ(ఎం) తెలంగాణ కార్యదర్శి తమ్మినేని



భీమవరం.తెలుగు రాష్ట్రాలు వేరైనా, సీఎంలు వేరుపడినా ప్రజల ఒరిగిందేమీ లేదని, రెండు రాష్ట్రాల్లోనూ ప్రజల కష్టాలు తీరలేదని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భూమికోసం, భుక్తి కోసం,హక్కుల కోసం రెండు రాష్ట్రాల్లో పోరాటాలు సాగుతున్నాయని వివరించారు. దేశ అభివృద్ధి జీడీపీ 7.5 శాతం ఉందని ప్రధాని మోడీ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జీడీపీ 10 శాతం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పగా చెప్పుకుంటున్నారని, జీడీపీ ఎంత పెరిగితే ఏం లాభమని ఆయన ప్రశ్నించారు. ప్రజల అభివృద్ధి ముఖ్యమని, జీవితాలు అభివృద్ధి చెందకుండా కార్పొరేట్ రాజకీయ నాయకులు జేబులు నింపే అభివృద్ధి ఎవరికి కావాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశమంటే మట్టికాదని, దేశమంటే మనుషులని గురజాడ చెప్పిన మాటలు మాన పాలకుల చెవికి ఎక్కడం లేదని విమర్శించారు. అభివృద్ధంటే విద్య, వైద్యం, ఉద్యోగం, భూమి అందరికీ ఉన్నప్పుడే అది నిజమైన అభివృద్ధి అని పించుకుంటుందని తెలిపారు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రజల అభివృద్ధి కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని అన్నారు. తెలంగాణాలో ప్రధాన పాలకవర్గ పార్టీలను గద్దె దించేందుకు ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తెచ్చేందుకు 28 పార్టీలతో కూడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) ఏర్పాటు చేశామని అన్నారు. కమ్యూనిస్టులు కేవలం నయాఉదారవాద విధానాల ఆర్థిక విధానాలతోపాటు, కుల ఆధిపత్యంపై పోరాడుతుందన్నారు. ప్రత్యామ్నాయ నమూనాను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు.

టీడీపీ,బీజేపీ తోడుదొంగలు

- టీడీపీని, వైసీపీ, బీజేపీని పవన్ కళ్యాణ్ విమర్శించకపోవడం అనైతికం
- సామాజిక న్యాయం కోసం పోరాటమే శిరోధార్యం: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి. రాఘవులు



ఏలూరు : రాష్ట్ర ప్రజలను మోసగించడంలో టీడీపీ, బీజేపీ తోడుదొంగలని, రాజకీయ నాటకాల్లో ఇరుపార్టీల నాయకులకు నంది అవార్డులు ఇవ్వొచ్చని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. 25వ ఏపీరాష్ట్ర మహాసభల సందర్భంగా భీమవరం లూథరన్ హైస్కూల్ ప్రాంగణంలో ఆ పార్టీ జిల్లా డెల్టా కమిటీ కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన శనివారం జరిగిన బహిరంగ సభలో రాఘవులు మాట్లాడారు. 'పవన్ తన ప్రసంగాల్లో టీడీపీని విమర్శకుండా బీజేపీ గురించి మాట్లాడుతారు.. వైసీపీ నేత జగన్ బీజేపీ ప్రస్తావన లేకుండా టీడీపీని విమర్శిస్తారు. ఇలా చేయడం నైతికం కాదు. ప్రజలను తప్పు దోవ పట్టించడమే. పవన్ టీడీపీ చేసిన మోసం గురించి మాట్లాడాలి. జగన్ బీజేపీ చేసిన అన్యాయం గురించి విమర్శించాలి' అని అన్నారు. ' రాష్ట్ర ప్రజలను మోసగించడంలో రెండు పార్టీ నేతల వైఖరి ఒక్కటే. ఇద్దరి గురించి మాట్లాడినప్పుడే నిజాయతీ రాజకీయాలవుతాయి.. వీరి మోసపూరిత వైఖరి గురించి ప్రజల ముందు ఎండగట్టాలి' అని అన్నారు. ప్రత్యేకహోదాతో పాటు, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీల అమలు కోసం వామపక్షాలు రాష్ట్ర విభజన జరిగినప్పటినుండే పోరాడుతున్నాయని, ఎన్నో జేఏసీలు ఉన్నాయని అన్నారు. 'వీటితో [illegible] పవన్ కళ్యాణ్ కొత్తగా [illegible] అది ఎందుకో అర్థం కాదు. ఉన్న వాటితోనే ఆయన కలిసి పనిచేయవచ్చు.' అని అన్నారు. 'మిరప, పసుపు, వరి వంటి ఏ పంటకూ సరైన ధర లేకుండా పోయిందన్నారు. రైతాంగం సంక్షోభంలో ఉందని, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేయడంలో కేంద్రబడ్జెట్‌లో మోడీసర్కార్ విఫలమైందని విమర్శించారు. గిట్టుబాటు ధర కోసం ప్రత్యేక చట్టం తేస్తేనే రైతులకు అన్నివిధాలా న్యాయం జరుగుతుందని చెప్పారు. బడా పారిశ్రామికవేత్తలకు మోడీ సర్కార్ రూ.లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిందన్నారు. తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన రైతులు బ్యాంకుల వద్ద తీసుకున్న రెండుశాతం రుణాలను రద్దు చేయకపోవడం దారుణమన్నారు. రైతుల అప్పులను రద్దు చేయాలని సీపీఐ(ఎం) గట్టిగా కోరుతుందన్నారు. హక్కులు సాధించుకునేందుకు రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో అనేక వాగ్దానాలు చేశారని, అయితే నిధులు మాత్రం కేటాయించలేదన్నారు..

వాటాలకోసం 'పోలవరం' తొందర

సిమెంట్‌తో గోడలు కట్టేసి తొందరగా 'పోలవరం' పూర్తిచేసి వాటాలు పంచుకోవాలని చూస్తున్నారన్నారు. అంతే తప్ప రెండులక్షల మంది నిర్వాసితుల గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. అంతమందిని ముంచి తినే పాపపు కూడు మనకొద్దన్నారు. పోలవరం తొందరగా పూర్తిచేయాలని తాము కోరుతున్నామని, కానీ గిరిజనులకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందించాలని సీపీఐ(ఎం) కోరుతుందన్నారు. అందుకు తగిన నిధులు కేటాయించి నిర్వాసితులను కాపాడాలన్నారు. తెలంగాణ, ఏపీలో కష్టజీవుల సామాజికన్యాయంకోసం అందరినీ సమీకరించి పోరాడాలన్నారు. చంద్రబాబు కార్మిక చట్టాలపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు.

జోష్
నవతెలంగాణ

వాలంటైన్స్ డే... స్పెషల్

జ్ఞాపకాలు

జ్ఞాపకాలే మిగులుతాయనిపిస్తుంది
జీవితపు ప్రతి మలుపులోనూ
జ్ఞాపకాలే తగులుతాయనిపిస్తుంది
జ్ఞాపకాలు నా మస్తిష్కాన్ని తట్టినప్పుడల్లా
గుండెగాయం కలుక్కుమంటుంది
ఈ గోస భరించలేక
అప్పుడప్పుడూ నాకూ జ్ఞాపకాల్లో కలిసిపో
వాలనిపిస్తుంది
వెలిగే నా కలల దీపానికి
ఇంధనం జ్ఞాపకాలే కదా!

- క్రాంతి
9182777612



వహ్వా..వహ్వా

నువ్వా.. వెన్నెలా...



ఎవరైన వెన్నెలని చూపించి
అందంగా ఉందంటే
చూడ ముచ్చటగా ఉందంటే
నువ్వే గుర్తొస్తావ్...
ఇంతకీ అందంగా ఉంది
చూడ ముచ్చటగా ఉంది
నువ్వా.. వెన్నెలా...
లేక నువ్వే వెన్నెలవా..?

- అరుణాంక్ లత
8143916151

మజాక్

లవర్స్ జర భద్రం

ఒకప్పుడు...
అప్పుడు తను మాట్లాడుతుంటే
నా మైండ్ లో ఏదో ఇళయరాజా మెలోడి ప్లే
అవుతున్నట్టే ఉండేది.
ఆరు నెలల తర్వాత...
ఇప్పుడు తను మాట్లాడుతుంటే నా
మైండ్‌లో ఏదో అట్టర్ ఫ్లా ప్ సినిమా పాట
ప్లే అవుతున్నట్లే ఉంది.



స్వేచ్ఛ ఇవ్వాలి.. హద్దులు దాటకూడదు!

ఏ అంశంలోనైనా ఓ మంచి విలువ దాగి ఉందంటే... ఆ విలువను తీసుకొని మనం ఎదగడానికి ఉపయోగించుకోవాలి. కానీ దాంట్లో ఉన్న చిన్న అర్థాన్ని తీసుకొని దాన్ని ఇంకా ఇంకా తక్కువ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా అసలు అంశాన్ని మరుగున పడేలా చేయకూడదని చెబుతారు ప్రముఖ సైకాలజిస్టు వీరజా రావు. ప్రేమ, ఆకర్షణ, వ్యక్తీకరణ, విలువలు... ఇలా ఒక్కొక్కటి సమాజంలోని ప్రతి అంశానికి కనెక్టు అయి ఉంటాయి. ప్రేమికులకు స్వేచ్ఛ ఇవ్వాలి... ఆ పేరుతో హద్దులు దాటి ఆత్మహత్యలు చేసుకోవడానికి దారి చూపకూడదని సున్నితంగా హెచ్చరిస్తున్నారు... ఆమె చెప్పిన విలువైన అంశాల్లో కొన్ని మీ కోసం...

అసలు చరిత్ర...

నిజానికి వాలంటైన్ ఒక సెయింట్. ఆయన 13,14 శతాబ్దానికి చెందిన వ్యక్తి. సమాజం పట్ల విశాల దృక్పథం కలిగిన వ్యక్తి, ఉన్నతమైన ఆలోచనలు కలిగి ఉండటం వల్ల రోమన్ చక్రవర్తులు ఆయన్నీ చంపేశారు. వాలంటైన్ రోమన్ చక్రవర్తులు సైనికులను కుటుంబ నాగరికతకు దూరం చేసి వాళ్లను బానిసలుగా ఎట్లా ఉపయోగించుకుంటున్నారో గుర్తించాడు. అలా అణచివేతకు గురైన వారికి ప్రేమ, కుటుంబ నాగరికతను వాటి విలువ గురించి సైనికులకు చెప్పడం, నియంతలను ఎదిరించి చాటుగా, రహస్యంగా సైనికులకు పెండ్లిళు జరిపించడం చేసేవాడు. ఇది గ్రహించిన రోమన్ చక్రవర్తి వాలంటైన్‌ను చంపడానికి ప్రయత్నాలు చేశాడు. వాస్తవానికి చక్రవర్తి కూతురుకు కండ్లు తెప్పించింది వాలంటైన్ అంటారు. అయినా కనికరించకుండా వాలంటైన్‌ను చంపేశారు. వాలంటైన్ చనిపోయే ముందు ఆ అమ్మాయికి ఒక కార్డు మీద ప్రేమ గురించి రాసి చివరికి నీ వాలంటైన్ అని రాసి ఇస్తాడు. వాలంటైన్ చనిపోయిన తర్వాత అతని సమాధి దగ్గర ఆ కార్డును పెడుతుంది ఆ అమ్మాయి. ఇదంతా చరిత్ర చెబుతున్న ఒక కథ. నిజానికి వాలంటైన్స్ డేకు రెండు, మూడు పేర్లు ఉంటాయి. 'సెయింట్ వాలంటైన్స్ డే', 'ఫీస్ట్ ఆఫ్ వాలంటైన్స్ డే', 'వాలంటైన్స్ డే'. ఇది ఎక్కువగా ఆంగ్లో-ఇండియన్ కమ్యూనిటీ జరుపుకుంటుంది. వాలంటైన్స్ డేను ఉన్నత వర్గాలకు చెందిన వారు మాత్రమే జరుపుకునే వారు.

ఒక వ్యక్తీకరణ...

ప్రేమ, సంబంధాలు, వ్యక్తీకరణ, విలువలు... కాల క్రమంలో శృంగారాంశంగా మారిపోయాయి. అసలు విషయాలు మరుగునపడిపోయాయి. మిగతా అంశాలు బయటకు వచ్చాయి. వాలంటైన్స్ డే రోజు ఎవరైనా కావొచ్చు ప్రేమను మనసులోనే దాచుకోకుండా ఏదో ఒక రకంగా వ్యక్తపరచవచ్చు. ఇది ఆడ, మగ మధ్య ఏర్పడే స్నేహ పూర్వకమైన సంబంధం. కానీ ప్రపంచం మారుతున్నప్పుడు పరిస్థితులకు తగ్గట్టుగా మనం మారాల్సిన అవసరం ఉన్నది. నిజంగా ఎదగాలనుకున్న వారు ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా గతాన్ని అన్వయించుకొని ఎదగడమే ఒక మంచి సంబంధం కూడా. వాలంటైన్స్ డే అనేది ఒక రకమైన ప్రేమ వ్యక్తీకరణ. ప్రేమ అంటే యూత్ (ఆడ, మగ) కు మాత్రమే అన్వయించడం సరైనది కాదు. దాన్ని స్నేహితులకు, కుటుంబానికి, సమాజానికి అన్వయించడం చాలా మంచిది.. ఏ అంశంలోనైనా ఓ మంచి విలువ దాగి ఉందంటే. ఆ విలువను తీసుకొని మనం ఎదగడానికి ఉపయోగించుకోవాలి గాని దాంట్లో ఉన్న చిన్న అర్థాన్ని తీసుకొని దాన్ని ఇంకా ఇంకా తక్కువ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా అసలు అంశాన్ని మరుగున పడేటట్టు చేయకూడదు.



ఇన్ఫాట్యువేషన్...

ఒక్కొక్కరు ఒక్కో విధంగా దీన్ని అర్థం చేసుకుంటారు. కానీ వాస్తవానికి కౌమారదశలో జరిగే సహజ సిద్ధమైన బయలాజికల్ ఫీలింగ్ ఇన్ఫాట్యువేషన్. ఇది జంతువుల్లో, మనుషుల్లో జరిగే ప్రక్రియ. శారీరక ఎదుగుదల, మానసిక ఎదుగుదలతో పాటు భావోద్వేగాలను అదుపులో ఉంచుకొనే శక్తి కూడా పెరుగుతుంది. ఎవరైనా ఒకరికి ఆకర్షితులైతే ఎంత మట్టుకు కావొచ్చు, దాంట్లో మీ బాధ్యత ఎంత, సమాజం దాన్ని ఎంత వరకు అమోదిస్తుందో గుర్తుంచుకోవాలి. కోరికలకు ఎప్పుడు కొలతలు ఉండవు. అది వాళ్ల వ్యక్తిగతానికి, కుటుంబ విలువలకు, సామాజిక విలువలతో ముడిపడి ఉంటుంది. అట్లాగే పిల్లల్లో కూడా మార్పులు వస్తాయి. పిల్లల్లో వచ్చే శారీరక మార్పులను మాత్రమే అంచనా వేయకూడదు. ఎదుగుదల అంటే పూర్తి పరిపక్వత. ఇలా అంచనా వేయకుంటే జంతువులకు, మనుషులకు తేడా ఉండదు. కాగ్నిటివ్ డెవలప్‌మెంట్, ఎమోషనల్ డెవలప్‌మెంట్, మెంటల్ డెవలప్‌మెంట్ ఇలా అన్ని కలిపితేనే ఒక పూర్తి పరివర్తన మార్పు కనిపిస్తుంది. కాబట్టి ఏదైనా కూడా కంట్రోల్ చేసుకునే శక్తి మనకుంటుంది. ఒక్క ఇన్ఫాట్యువేషన్ మాత్రమే కాదు పెరుగుతున్న క్రమంలో ఎలా వ్యవహరించాలో మనకు తెలుస్తుంది. ఇది ఎవరికన్న తెలీదంటే కచ్చితంగా వారిలో ఏదో సమస్య ఉందని అర్థం. సమాజానికి వ్యతిరేకంగా నడుచుకుంటున్నారంటే వారిలో ఏదో సమస్య ఉన్నట్టే. అది ఆ వ్యక్తి గుర్తించాలి లేదంటే మనమైనా గుర్తించాలి. ఆ మనంలో తల్లిదండ్రులు, సమాజం, టీచర్స్ ఇలా ఎవరన్నా కావొచ్చు.

ప్రేమ విలువలు...

ఎవరికి ఇష్టమైనట్టు వాళ్లు ప్రేమ అనే రెండు అక్షరాలను వాడుకుంటుంటారు. ఎవరికి వాళ్లు అర్థమైన రీతిలో ప్రేమను అన్వయించుకుంటుంటారు. ముఖ్యంగా అవగాహన లేని వాళ్లు అతిగా ప్రేమిస్తారు. అది తల్లిదండ్రులైనా.. ఉపాధ్యాయులైనా.. సరిగ్గా అర్థం చేసుకోకపోతే విపరీతమైన అర్థాలకు దారితీస్తోంది. ప్రేమన్నది మనపట్ల మనకు కావొచ్చు, స్నేహితుల పట్ల కావొచ్చు, పిల్లలకు, తల్లిదండ్రులకు కావొచ్చు, భార్య, భర్త పట్ల కావొచ్చు, తల్లిదండ్రులకు మధ్యన కావొచ్చు. కానీ ప్రేమ అనే అర్థం మాత్రం ఎక్కడ తగ్గిపోదు. దాంట్లో ఎలాంటి మార్పు ఉండదు. కానీ ఒక తల్లి బిడ్డ పట్ల చూపించాల్సిన వ్యక్తీకరణ ఒకలావుంటుంది, భార్య, భర్త దగ్గర వ్యక్తపరిచేది ఒకలా ఉంటుంది, మనం మన సమాజానికి చూపించాల్సింది ప్రేమనే ఉంటుంది. ప్రేమ ఎక్కడ ఉంటుందో... బాధ్యత కూడా అక్కడే ఉంటుంది. ప్రేమ ఉన్న దగ్గర బాధ్యత లేకపోతే అది ప్రేమ కాదు. ఒకరిపట్ల మరొకరికి బాధ్యత ఉండాలి. అప్పుడే ప్రేమ ఉంటుంది. ఇక బాధ్యత ఉంటేనే ఆ వ్యక్తి మీద హక్కు వస్తుంది. ప్రస్తుతం సమాజంలో అమ్మాయిలు, అబ్బాయిలు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. అది ప్రేమ కాదు. నీ పట్ల నీకు బాధ్యత లేకుండా మరో వ్యక్తి ని ప్రేమిస్తున్నానని చెప్పడానికి అర్హత లేదు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఇష్టం వేరు, బాధ్యత వేరు. ఇష్టం ఉంటే మనసులో దాచుకో... మరొకరి స్వేచ్ఛను హరించవద్దు. మరొకటి ప్రేమ ఉన్న దగ్గర నమ్మకం ఉండాలి.

వ్యక్తపరచడం అవసరం...

చాలామంది ప్రేమను వ్యక్తపరచలేకపోతున్నారు. కానీ ప్రేమను తగిన వ్యవహార శైలి ద్వారా వ్యక్తపరుచుకోవచ్చు కానీ అదే ప్రేమ అనుకుంటే తప్పు. ఎవరు పడితే వాళ్ల ప్రేమించడం అనేది చాలా సహజమైంది. "తనంటే చాలా ఇష్టం, నేను తనను ప్రేమిస్తున్నాను" అని ఏదో చెబుతుంటారు. అలాంటి వారు ముందుగా గుర్తుంచుకోవాల్సింది... "నాకు ప్రేమించే లక్షణాలు ఉన్నాయా.. నేను ఒక బాధ్యత తీసుకునేంత ఎదిగానా".. అని ప్రశ్నించుకుంటూ ఉండాలి. ఎదుటి వ్యక్తి పట్ల నమ్మకం కలిగించడం మామూలు విషయం కాదు. ఒకరి పట్ల ఒకరికి నమ్మకం ఉన్నప్పుడు, ఒకరి స్పేస్ మరొకరికి ఇచ్చుకుంటారు. ఎవరికి నచ్చినట్టు వాళ్లు మారడం వల్ల మార్పు వస్తుంది. బలవంతం చేసిన చోట ప్రేమ ఉండదు. చంపుకోవడం, బలవంతం చేయడం వల్ల ప్రేమ ఉండదు.

జీవితంలో ఒక భాగం...

మనమటుకు మనం స్వార్థంగా ఆలోచిస్తే తప్పు. ప్రతి విషయం ఒకదానితో మరొకటి కనెక్టు అయి ఉంది. మన పట్ల మనం బాధ్యత నిర్వర్తిస్తూ, సమాజం పట్ల, పక్కవారి పట్ల బాధ్యత వహిస్తే కచ్చితంగా కొంత మార్పును చూడవచ్చు. ప్రేమలోనే ఆనందం దాగి ఉంటుంది. కాబట్టి ఆ రెండు అక్షరాల విలువను గుర్తించాలి. ప్రేమ లేకనే చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు, డిప్రెషన్‌కు గురవుతున్నారు... కాబట్టి దాని విలువను గుర్తించి ఎంత కష్టమైనా భరించి జీవితాంతం పోరాడాలి తప్ప ప్రాణాలు తీసుకోవద్దు. ఇవ్వాళ యువతకు ఉన్న అవకాశాలు బహుశా ఎప్పుడూ లేకుండే. ఇప్పుడు అన్నీ అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రులు కూడా పిల్లలకు అవసరమైన స్వేచ్ఛనిస్తున్నారు. ఆ స్వేచ్ఛను సరైన మార్గంలో ఉపయోగించుకోవాలి. ప్రేమ అనేది జీవితంలో ఒక భాగం అని అర్థం చేసుకోవాలి.





- డా॥ విరజా రావు
సైకాలజిస్టు
ఉస్మానియా యూనివర్సిటీ

****

మొదటి ప్రేమలేఖ..!

ప్రియ నేస్తమా,

నీవు క్షేమమేనా? ఈ చిన్న వాక్యంలో నా గుండెల్లో నీ క్షేమానికై నా ఆలోచనల తీవ్రత, నా అభిమానం ఆర్ద్రత ఏమాత్రం కనిపించకపోవచ్చు. కానీ ఇంతకంటే గొప్పగా చెప్పటానికి నాకు తెలిసిన భాష చాలటం లేదు. మనసులోని భావాల్ని పూర్తిగా వ్యక్తపరచడానికి మనం తయారు చేసుకున్న భాష చాలదేమో! నా మనసులో చెలరేగుతున్న భావాల్ని వ్యక్తీకరించడానికి మాటలు దొరకక మౌనమనే ఉక్కుపాదం కింద నలిగి విలవిలలాడుతున్న నా హదయ వేదన నీకు కాస్తంత ఆసక్తిని కలిగిస్తే ఈ ఉత్తరాన్ని... సారీ, నా హదయాన్ని కాస్తంత అర్థం చేసుకుంటూ చదువు.

నా గుండె తెరలలో అనుక్షణం చెలరేగుతున్న అలజడి నీతో చెప్పబోయేసరికి అట్టడుగు పొరలను వీడి బయటకు రావటంలేదు. మనసులోని మాట కళ్ళలో కనిపిస్తుందని అంటారు. నా కళ్ళు చేసే గుస గుసలు, చెప్పే ఊసులు నీ వరకు చేరాయో లేదో నాకు తెలియదు. నేను నీతో గడిపే క్షణాలలో ఓ చిరునవ్వు, లేదంటే కాస్త మౌనం తప్ప ఏమీ సాధించలేకపోయాను. నీ స్పందన కోసం అనుక్షణం అన్వేషిస్తున్న నాకు నీ మౌనమనే చీకటి నిరంతరం అంతరాయం కలిగిస్తుంది. ఈ అన్వేషణలో చిత్తుగా ఓడిపోయాను. అందుకే ధైర్యం చేసి ముందడుగు వేసి చెబుతున్నా, లయ బద్ధమైన నా హదయస్పందన విను. "నేను...నిన్ను... పేమిస్తున్నా". నాకున్న అంతులేని ప్రేమని ఎంతగా చెప్పాలని ప్రయత్నిస్తున్నా ఈ మూడు మాటలు తప్ప ఏమీ స్ఫురించటం లేదు. అయినా ఇంకా ఏదో చెప్పాలనే తపన నన్నింకా రాయమని ముందుకు తోస్తున్నది. నీవులేని లోకంలో నేను కోరుకునేది ఏదీ లేదు, చావుని తప్ప. నా ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు అన్నీ నీకై వేచి ఉన్నాయి. నీతో ముడిపడి ఉన్నాయి. కళ్ళముందు అనుక్షణం నీ రూపమే కనిపిస్తుంది. ఎక్కడ ఉన్నా, ఏ పని చేస్తున్నా నీ ఆలోచనలే నన్ను వెంటాడుతున్నాయి. ఎవరు పిలిచినా నీవే అనిపిస్తుంది. ఒక మనసుని మరో మనసు ఇంతలా వెంటడుతుందా? ఊపిరితీయనీయకుండా వుక్కిరిబిక్కిరి చేస్తుందా? నా ప్రశ్నలకు ఎవరు సమాధానం చెప్పగలరు నీవు తప్ప. అందుకే నీ సానుకూల స్పందన కోరుకుంటూ మరొక్కసారి చెబుతున్నా."ఐ లవ్ యూ". ఈ మాటలన్నీ ఎన్నోసార్లు ఎంతో మంది చెప్పి మాములు మాటలయిపోయాయి. కానీ ప్రతి మనిషి జీవితం విలువయినదే, ప్రతి మనిషి ప్రేమ, అనుభూతులు అమూల్యమైనవే. ఇంకా ఏదో చెప్పాలని వున్నా తరువాత ఉత్తరానికై వాటిని నా హదయంలో భద్రంగా పొందుపరిచాను. కానీ ఈసారి సంబోధన నేస్తమా అనికాక, ప్రియతమా అని రాయగలిగే అవకాశం కోరుకుంటూ..

నీ పలకరింపుకే పులకరించి
నీ శ్వాసనిశ్వాసలను సప్త స్వరాలుగా మార్చడానికి
వేచి ఉన్న
నీ నాగ మురళీధర్ నామాల

జీవితమంటే అనుభవం. గొప్ప అనుభవాలవైపు ప్రయాణించటమే జీవిత లక్ష్యం. అనుభవాలని గొప్పగా, గాఢంగా తీసుకోగలగటం అనేది మన హృదయపు సున్నితత్వం మీద.. స్వేచ్ఛ మీద.. ఆధారపడి ఉంటుందని చెప్పిన మహా రచయిత చలం... విశాలమైన మైదానంలో అందమైన పొదరిల్లుని నిర్మించుకున్న చలం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే! కాబట్టి చలం మదిలో నుంచి జాలువారిన కొన్ని ప్రేమ సూక్తులు ఈ తరం ప్రేమికుల కోసం...



చలం ప్రేమ సూక్తులు...

- నీవుండబట్టే ఈ ప్రపంచం ఇంత సుందరమూ, హృదయాకర్షమూ నాకు. లేకపోతే ఈ లోకానికి నాకు సంబంధం ఏమిటి? లోహపు బిళ్లల్ని, నీతి ప్రతిష్టలని ఆరాధించే ఈ ప్రజలతో సాపత్యమేమిటి నాకు.
- రోజు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు అద్భుతంగా నెత్తిమీద జరుగుతుంటే... కండ్లు మూసుకొని సినిమాలో సూర్యోదయం చూపిస్తే... అర నిమిషం ఊపిరి బిగబట్టి ఆనందిస్తున్నావా...
- ప్రేమ ఉంటే అసహ్యత ఉండకపోవచ్చు కానీ అసహ్యతతో ప్రారంభిస్తే ప్రేమ పుడుతుందా!?
- ఒకరోజు ఒకరు నాకెంతో ఆప్యాయంగా ఇచ్చిన మల్లెమొగ్గని వదల్లేక జేబులో వేసుకొని మరిచిపోయాను. సాయంత్రం కాలువగట్టు దగ్గర మల్లెపూల వాసన వేసి చుట్టూ వెతికాను తోటలో, చివరికి నా జేబులో గుర్తుపట్టి చూస్తే పెద్దదిగా విచ్చుకొని నా వేళ్లని పలకరించింది. నా జేబులో మరచిన నా మల్లెమొగ్గ, కళ్లెంబడి నీళ్లు తిరిగాయి. తనపట్ల ఎంత నిర్దయగా వ్యవహరించినా... ఏమీ నొచ్చుకోక విచ్చుకొని పరిమళాలు వెదజల్లింది ఆ చిన్ని పువ్వు. దాని ముందు నేనేం గొప్ప?
- ఒకసారి పురుష హృదయంలో ప్రేమ మొలకెత్తిన తరువాత ఏమీ లేక ఎండనన్నా ఎండాలీ, కాలి కింద నలిగి చావనన్నా చావాలి గానీ నీరుపోసి [illegible]
- ప్రేమంటే ఆలోచించు పది జన్మల తరువాత ఏ కొంచమైనా అర్థం అవుతుందేమో.
- జీవించినందుకు రెండే ఫలితాలు. తీవ్రమైన ప్రేమతో జీవితం వెలగాలి. లేకపోతే విరహంతో కాలిపోవాలి.
- పురుషునికి ప్రేమ ఆట గాని, స్త్రీకి ప్రేమయే జీవనం.
- స్నేహం, మనసు, ప్రేమ వీటన్నింటికన్నా మనం మన శరీరంలో ఒక చిన్న భాగానికి చాలా ప్రాముఖ్యత ఇస్తున్నాం. దానితో జీవిత ఆనందాన్ని కోల్పోతున్నాం.
- ఈ ప్రపంచం ఉండడం, సూర్యుడు రావడం, ఈ పువ్వులు పుయ్యడం యెంత విచిత్రం తలుచుకుంటే. అట్లాగే నీ ప్రేమ కూడా!.
- ప్రేమ ధనాన్ని వృథా చేయకూడదు. వెదజల్లకూడదు. మనో పరీక్ష చేసుకుని ఎవరికి హృదయ పుష్పం సమర్పించాలో నిర్ణయించుకోవాలి. అటువంటి వారు దొరికిందాకా లోభివలె ప్రేమని దాచి వుంచాలి. ఆశయం పూర్తి కానిదే, తక్కువ ప్రత్యామ్నాయంతో సంతృప్తి పడకూడదు.
- స్త్రీ, పురుషులు నిజమైన స్నేహితులూ, దంపతులూ కావాలంటే ఇద్దరికీ సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలి. వారి మధ్య ప్రేమ బంధమే గాని అధికార బంధం ఉండకూడదు.



ఓటమెరుగని అంకిత

చైనీస్ తైపైయీపై 2-0తో భారత్ విజయం

- మెరిసిన కర్మాన్
- ఫెడ్ కప్

న్యూఢిల్లీ : కర్మాన్ కౌర్ తాండి, అంకిత రైనా మెరుపులతో ఫెడ్‌కప్ ఆసియా/ఓసియానా గ్రూప్ 1 లో భారత్ స్థానం నిలుపుకున్నది. శనివారం జరిగిన ప్లే ఆఫ్ పోరులో కర్మాన్, అంకిత రాణించటంతో భారత్ 2-0తో చైనీస్ తైపీయాపై గెలుపొందింది. కర్మాన్ 7(7)-6(4), 6-3తో లీ పెయ్‌చీపై గెలుపొంది భారత్‌కు 1-0 ఆధిక్యాన్నిచ్చింది. గత కొద్ది రోజులుగా అద్భుతమైన టెక్నిక్‌తో తనకన్నా మెరుగైన ప్రత్యర్థులను ఓడించిన అంకిత రైనా.. చెయ్ యుహుసుతో హోరాహోరీ పోరాడాల్సి వచ్చింది. ప్రపంచ 377వ ర్యాంకర్ చెయ్ గట్టిపోటీనివ్వటంతో అంకిత దాదాపు మూడు గంటలు కష్టపడింది. మూడు సెట్ల పోరును ఎట్టకేలకు 6-4, 5-7, 6-1తో గెల్చుకున్నది. దీంతో గ్రూప్ 1లో భారత్ స్థానం నిలుపుకున్నది. టోర్నీలో ఒక్క మ్యాచ్ సైతం ఓడని అంకిత తన కెరీర్‌లోనే ఉత్తమమైన టెన్నిస్ ఆడింది.

సమిష్టిగా రాణించి..

అమ్మాయిల మూడో వన్డేలో భారత్‌పై దక్షిణాఫ్రికా విజయం

పోచెఫ్‌స్ట్రూమ్ : ఆఖరు వన్డేలో మిథాలీ సేన తడబడింది. ఓపెనర్ స్మృతి మంధాన (0), కెప్టెన్ మిథాలీ రాజ్ (4) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమైన వేళ.. మరో ఓపెనర్ దీప్తి శర్మ (79, 112 బంతుల్లో 8 ఫోర్లు), వేద కృష్ణమూర్తి (56, 64 బంతుల్లో 8 ఫోర్లు) అర్ధ శతకాలు చేసినా.. వృథా అయ్యాయి. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం సెన్వెస్ పార్క్‌లో జరిగిన చివరి వన్డేలో సౌతాఫ్రికా అమ్మాయిలు సమిష్టిగా బ్యాటింగ్ చేసి, ఏడు వికెట్ల తేడాతో గెలుపొందారు. దీంతో సిరీస్ క్లీన్ స్వీప్ చేయాలనుకున్న మిథాలీ సేన 2-1 సిరీస్ విజయంతో సంతృప్తి పడింది. తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 240 పరుగులు చేశారు. వేద, దీప్తి గాక హర్మన్‌ప్రీత్ కౌర్ (25), శిఖాపాండే (31నాటౌట్) ఫర్వాలేదనిపిం చారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో శబ్‌నిమ్ ఇస్మాయిల్ ఒక్కతే నాల్గు వికెట్లు కూల్చింది. ఇక ఛేదనలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌వుమెన్ సమంగా రాణించారు. ఓపెనర్ లారా (59), మిగ్నన్ డుప్రీజ్ (90 నాటౌట్)లు అర్ధ శతకాలు చేశారు. ఆండీ స్టెయిన్ (30), డేన్ వాన్ నికెర్క్ (41 నాటౌట్)లు రాణించారు. దీంతో మరో నాల్గు బంతులు మిగిలుండగానే మూడు వికెట్ల నష్టానికి సఫారీలు లక్ష్యాన్ని ఛేదించేశారు. భారత బౌలర్లలో శిఖా పాండే, ఎక్తా బిస్త్, పూనమ్ యాదవ్‌లు ఒక్కో వికెట్ తీసుకున్నారు. భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఐదు టీ20ల సిరీస్ మంగళవారం ఇదే వేదికన జరిగే తొలి మ్యాచ్‌తో ప్రారంభం అవుతుంది.



కోహ్లి సేన ఓడింది. వరుణుడు ఆటంకపరచిన నాల్గో వన్డేలో దక్షిణాఫ్రికా (డక్‌వర్త్ లూయస్ పద్ధతిన) విజయం నమోదు చేసింది. విరాట్ కోహ్లి, శిఖర్ ధావన్ భారీ ఇన్నింగ్స్‌కు ఆఖర్లో మాజీ సారథి ధోని మెరుపులు తోడవటంతో భారత్ భారీ లక్ష్యాన్ని సఫారీల ముందుంచింది. కుదించిబడ్డ లక్ష్య ఛేదనలో ఆతిథ్య జట్టు సఫలమైంది. టీమ్ ఇండియా బౌలర్లను ఎదుర్కొన్న సఫారీలు ఈ విజయంతో సిరీస్‌లో 1-3తో నిలిచింది.



సఫారీలకు వరుణుడి అండ

నాల్గో వన్డేలో భారత్‌పై దక్షిణాఫ్రికా విజయం (డక్‌వర్త్ పద్ధతిన)

- మిల్లర్, క్లాగ్ మెరుపులు
- ధావన్, కోహ్లి శ్రమ వృథా

నవతెలంగాణ-జోహనెస్‌బర్గ్

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న నాల్గో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా అదర గొట్టింది. అయినా ఓటమి తప్ప లేదు. వరుణుడి ఓటమి అంచుల్లోంచి దక్షిణాఫ్రికాను తప్పించాడు. ఆరంభంలో భారత బ్యాట్స్‌మెన్ శిఖర్ ధావన్(109: 105 బంతుల్లో 11ఫోర్లు, 2సిక్సర్లు), విరాట్ కోహ్లి(75: 83 బంతుల్లో 7ఫోర్లు, సిక్సర్) చెలరేగగా.. ఆఖర్లో మహేంద్రసింగ్ ధోనీ(42 నాటౌట్: 43 బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి భారత్ 289 పరుగులు చేసింది. ధావన్, విరాట్ మరోసారి 150 పరుగులకు పైగా భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమిండియా భారీ స్కోరు చేయగలిగింది. మిడిలార్డర్‌లో రహానె(8), శ్రేయాస్ అయ్యర్(18) విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించగా డక్‌వర్త్ పద్ధతిన లక్ష్యాన్ని 28 ఓవర్లలో 202 పరుగులకు కుదించారు. ఉత్కంఠ మ్యాచ్‌లో సఫారీలు ఐదు వికెట్ల తేడాతో నెగ్గారు. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, దక్షిణాల మధ్య ఐదో వన్డే మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగుతుంది.

ధనాధన్ ధావన్ : టీమ్ ఇండియా ఓపెనర్ శిఖర్ ధావన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. రోహిత్ శర్మ మరోసారి విఫలమైన వేళ.. సారథి కోహ్లితో కలిసి చక్కటి భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆరంభం నుంచి ఆతిథ్య బౌలర్లపై ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూ భారీ ఇన్నింగ్స్ ఆడిన. ధావన్ 99 బంతుల్లో 10ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేశాడు. కెరీర్‌లో 100వ వన్డే ఆడుతున్న ధావన్ అద్భుతంగా రాణిస్తూ న్యూ వాండరర్స్ స్టేడియంలో పరుగుల వరద పారించాడు. 100వ వన్డేలో సెంచరీ చేసిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సైతం నెలకొల్పాడు. వన్డే కెరీర్లో అతనికిది 13వ శతకం కావడం విశేషం.



దక్షిణాఫ్రికాపై అతనికి మూడో సెంచరీ. కాగా 2015 ప్రపంచకప్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో ఇదే జట్టుపై చెలరేగి 137 పరుగులు సాధించాడు. ఇదే ఇప్పటి వరకు ఆ జట్టుపై గబ్బర్‌కు అత్యధిక స్కోరు. వెలుతురులేమి కారణంగా తాత్కాలికంగా ఆటను నిలిపివేసిన అనంతరం ప్రారంభమైన స్వల్ప వ్యవధిలోనే భీకర ఫామ్‌లో ఉన్న శతక వీరుడు శిఖర్ ధావన్(109, 105 బంతుల్లో 11ఫోర్లు, 2సిక్స్‌లు) వెనుదిరిగాడు. గంటకు 140కి.మీ పైగా వేగంతో వేస్తున్న బంతులను జాగ్రత్తగా ఆడుతూ పరుగులు రాబట్టిన ధావన్.. దక్షిణాఫ్రికా పేసర్ మోర్నీ మోర్కెల్ బౌలింగ్‌లో డివిలియర్స్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. లుంగిసాని ఎంగిడి వేసిన తర్వాతి ఓవర్‌లో మరో కీలక ఆటగాడు రహానె కూడా ఔటయ్యాడు. భారీ షాట్‌కు ప్రయత్నించిన రహానె బౌండరీ వద్ద రబాడకు చిక్కాడు. ఓ సమయంలో 178/1తో పటిష్ట స్థితిలో ఉన్న భారత్ తక్కువ సమయంలోనే 210/4 చేరి ఒత్తిడిని పెంచుకుంది. మాజీ సారథి ఎమ్ఎస్ ధోని (42 నాటౌట్) ఈ దశలో భారత్ స్కోరు వేగం తగ్గకుండా ఉండేందు కు ప్రయత్నించి సఫలమయ్యాడు. ఓ పక్క వికెట్లు కూలు తున్నా పట్టు వదల్లేదు. శ్రేయాస్ అయ్యర్ (18), హార్దిక్ పాండ్య (9), భువనేశ్వర్ కుమార్ (5) లు నిరాశపరిచారు. దీంతో నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది భారత్.



వరుణిడి ఆటంకం : భారత్ ఇన్నింగ్స్‌లో కొద్ది సేపు ఆటంకం కలిగించిన వరుణుడు.. సఫారీలు ఛేదనలకు బరిలోకి దిగాక మరోసారి పలకరించాడు. అయితే అంతకు ముందు టీమ్ ఇండియా యువ పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా ఓపెనర్ ఏడెన్ మార్క్‌రంను ఎల్‌బిడబ్ల్యు చేశాడు. హషీమ్ ఆమ్లా 19 పరుగులతో క్రీజులో కొనసాగుండగా.. వర్షంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆపై డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన లక్ష్యాన్ని 28 ఓవర్లలో 202 పరుగులకు కుదించారు. ఆమ్లా (33), జేపీ డుమిని (10), ఏబీ డివిలియర్స్ (26) స్వల్ప స్కోర్లకే ఔటయ్యారు. అయినా లోయర్ మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ డెవిడ్ మిల్లర్ (39), హెన్రిచ్ క్లాసెన్ (43 నాటౌట్)లు తడబడలేదు. మిల్లర్ ఔట్ అవగా ఆ స్థానాన్ని అండిలె (23 నాటౌట్) తీసుకున్నాడు. రన్ రేట్‌ను మెల్లగా పెంచుతూ..తమ జట్టును విజయతీరాలకు చేర్చారు.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి,బి) రబాడా 5, శిఖర్ ధావన్ (సి) డివిలియర్స్ (బి) మోర్నీ మోర్కెల్ 109, విరాట్ కోహ్లి (సి) డెవిడ్ మిల్లర్ (బి) క్రిస్ మోరిస్ 75, అజింక్య రహానె (సి) రబాడా (బి) ఎంగిడి 8, శ్రేయాస్ అయ్యర్ (సి) క్రిస్ మోరిస్ (బి) ఎంగిడి 18, ఎమ్ఎస్ ధోని నాటౌట్ 42 నాటౌట్, హార్దిక్ పాండ్య (సి) మార్క్‌రం (బి) రబాడా 9, భువనేశ్వర్ కుమార్ రనౌట్ (డుమిని/క్రిస్ మోరిస్) 5, కుల్దీప్ యాదవ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 18, **మొత్తం : (50 ఓవర్లలో, 7 వికెట్లకు) 289.**

వికెట్ల పతనం : 1-20, 2-178, 3-206, 4-210, 5-247, 6-262, 7-282

బౌలింగ్ : మోర్నీ మోర్కెల్ 10-0-55-1, కగిసో రబాడా 10-0-58-2, లుంగిసాని ఎంగిడి 10-0-52-2, క్రిస్ మోరిస్ 10-0-60-1, అండిలె ఫెహ్లుక్వాయో 6-0-38-0, జేపీ డుమిని 4-0-20-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : ఏడెన్ మార్క్‌రం ఎల్‌బిడబ్ల్యు 22, హషీమ్ ఆమ్లా బ్యాటింగ్ (సి) భువనేశ్వర్ (బి) కుల్దీప్ యాదవ్ 33, జేపీ డుమిని ఎల్‌బిడబ్ల్యు కుల్దీప్ యాదవ్ 10, ఏబీ డివిలియర్స్ (సి) రోహిత్ (బి) హార్దిక్ పాండ్య 26, డెవిడ్ మిల్లర్ ఎల్‌బి (బి) చాహల్ 39, హెన్రిచ్ క్లాసెన్ నాటౌట్ 43, అండిలె ఫెహ్లుక్వాయో నాటౌట్ 23, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (25.3 ఓవర్లలో 5 వికెట్‌కు) 207.**

వికెట్ల పతనం : 1-43, 2-67, 3-77, 4-102, 5-174.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-27-0, జశ్‌ప్రీత్ బుమ్రా 5-0-21-1, కుల్దీప్ యాదవ్ 6-0-51-2, హార్దిక్ పాండ్య 5-0-37-1, యుజ్వేంద్ర చాహల్ 5.3-0-68-1.

దారి తప్పుతున్న ప్రకటనలు

మానసికంగా.. శారీరకంగా బలౌతోన్న ప్రజలు

- చిరుతిండ్ల ప్రకటనలపై కేంద్రం తాజానిర్ణయంపై భిన్నాభిప్రాయాలు
- జంక్ ఫుడ్‌పై కేరళ వామపక్ష ప్రభుత్వ నిర్ణయన్ని సమర్థించిన డబ్ల్యూహెచ్ఓ
- కండోమ్ ప్రకటనలపై మోడీ సర్కారు మేలుకొన్నది అంతంతే..

వాణిజ్య ప్రకటనల దుష్ప్రభావంపై పలు దేశాల నిఘా చంటోడు మొదలు ముదిమి ముసలి వరకు అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితమైన టెలివిజన్లలో ప్రసారమవుతోన్న కొన్ని వాణిజ్య ప్రకటనలపై, అవి ప్రసారమయ్యే సమయాలపై కొంత కాలంగా పెద్ద చర్చ సాగుతుండటం తెలిసిందే! ఆరోగ్యపరంగా, మానసికంగా మనుషులను పెడదోవపెట్టించే విధంగా కొన్ని ప్రకటనలు టీవీల్లో ప్రసారమవుతుండటం పలు అభ్యంతరాలకు తావిస్తున్నది. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' స్పెషల్ ఫోకస్..

జై





మార్కెట్ లోకి కొత్తగా వచ్చే ఏ సంస్థ అయినా తమ ఉత్పత్తులను ప్రజల మధ్యకు తీసుకుపోవాలంటే, టెలివిజన్ యాడ్స్ పై ప్రధానంగా దృష్టిపెడుతోన్న విషయం తెలిసిందే! గతేడాది వివిధ చానెళ్లు యాడ్స్ పై జనరేట్ చేసిన ఆదాయ లెక్కలే దీనికి నిదర్శనం. నేటి కాలంలో ప్రతీ ఇంట్లో 'టీవీ' ఉండటం.. ఉత్పత్తుల ప్రచారం సులభంగా అన్ని వయస్సుల వారికి చేరే ప్రత్యామ్నాయ మార్గంగా టెలివిజన్లు మారాయి. దీంతో ఆయా కంపెనీలు తమ ఉత్పత్తి/సేవల ప్రచారానికి టీవీలను అడ్డాగా మార్చుకుంటున్నాయి.

జంక్ వదులుతుందా?:

కొవ్వులు, చక్కెర, ఉప్పు గల ఆహార పదార్థాలను పిల్లల చానెళ్లలో ప్రసారం చేయకుండా నిషేధించాలని ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) బృందం చేసిన సూచనను పరిగణనలోకి తీసుకుంటామని, ఐతే, మిగతా చానెళ్లలో ప్రసారమవుతోన్న జంక్ ఫుడ్‌కు సంబంధించిన వ్యాపార ప్రకటనలను ప్రస్తుతానికి నిషేధించే ఆలోచన మాత్రం ఇప్పుడు లేదని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఇదే పలు విమర్శలకు తావిస్తున్నది. పిల్లల ఆరోగ్యంపై జంక్ ఫుడ్ ప్రభావం చూపుతోందని, జంక్ ఫుడ్‌కు సంబంధించిన ఆయా ప్రకటనలు వారిని ఆయా ప్రొడక్టుల వైపు ఆకర్షించేలా చేస్తూ.. పిల్లల్లో ఊబకాయం, అల్సర్ వంటి వ్యాధులను కలిగేలా చేస్తున్నాయని ఇప్పటికే పలు నివేదికలు తూర్పారబట్టాయి. కాగా, పిల్లల ఆరోగ్యం మీద జంక్ ఫుడ్ చూపెడుతోన్న దుష్ప్రభావాన్ని గుర్తించిన కొన్ని దేశాలు స్కూళ్లలో వాటి అమ్మకాలను, టీవీలలో అడ్వర్టయిజ్‌మెంట్లను నిషేధించాయి. ఇక, మన దేశంలో కేరళలోని వామపక్ష ప్రభుత్వం జంక్ ఫుడ్స్ వాడకాన్ని తగ్గించే ఉద్దేశంతో.. జంక్ ఫుడ్ పై ఫ్యాట్ పన్ను విధించడం విశేషం. కాగా, కేరళ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని బలపరిచే విధంగా జంక్ ఫుడ్స్ వాడకం నియంత్రించేందుకు పండ్లు, కూరగాయల ధరలు తగ్గేలా, జంక్/ఫాస్ట్ ఫుడ్స్ ధరలు పెరిగేలా పన్నులుండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) సైతం సిఫారసు చేయడం గమనార్హం.

వాటికి హద్దులున్నాయి, ఐతే?:

టీవీల్లో కండోమ్ ప్రకటనలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు.. ఆయా వాణిజ్య ప్రకటనలను రాత్రివేళల్లోనే అనుమతించాలని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) సూచన నేపథ్యంలో.. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరుగంటల లోపు సమయంలోనే టీవీల్లో కండోమ్ వాణిజ్య ప్రకటనలు వేయాలని గతేడాది కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేయడం తెలిసిందే! ఐతే, వాణిజ్య ప్రకటనల్లో ముఖ్యంగా మహిళల చిత్రీకరణలో అసభ్యత, అశ్లీలత లేకుండా చూడాలని ఏఎస్‌సీఐ చేసిన సూచనలను ఇంకా యాడ్ ఏజెన్సీలు, ఉత్పత్తి సంస్థలు పట్టించుకోవటంలేదు. దీనిపై పాలకులు సైతం చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇక, ఇండియాలో మగ పిల్లలకు మాత్రమే అవసరమైన మేర పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని ఐక్యరాజ్యసమితి 2015లో విడుదల చేసిన నివేదిక పేర్కొనడం, ఐదేండ్లలోపు వయసున్న బాలబాలికల నిష్పత్తిలో ప్రపంచంలోనే అత్యంత దారుణ స్థితిలో భారత్ ఉన్నదని పలు స్వచ్ఛంద సంస్థల సర్వేలు కుండబద్ధలు కొట్టాయి. తదనుగుణంగా 2007 నుంచి భారత్ సుమారు కోటి మంది బాలికలను కోల్పోయిందని యూనిసెఫ్ నివేదికల నేపథ్యంలో.. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ప్రకటనలు గూగుల్, యాహూ వంటి సెర్చ్ ఇంజిన్లలో ఇవ్వడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు ఆయా మాధ్యమాల్లో తక్షణమే వాటిని తీసివేయాలని 2016లో ఆదేశించింది. సుప్రీంకోర్టు అక్షింతలతో మేలుకొన్న ప్రభుత్వం.. హడావుడిగా వాటిని తొలగించే ప్రయత్నాలు ముమ్మరం చేయడం విదితమే! ఇప్పుడు కూడా సర్వోన్నత న్యాయస్థానం చొరవ వహించే వరకూ మన పాలకుల మొద్దునిద్ర వదలదేమో చూడాలి. వాణిజ్య ప్రకటనలు ఆయాసంస్థల ఉత్పత్తుల ప్రచారానికి సాయపడుతూనే, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవ హరించడం ఎంతో అవసరం. అట్టి చర్యలను గాలికొదిలేసిన సం స్థలపై కొరడా ఝుళిపించడం ప్రభుత్వాల విధి. ఆయా పనులను మన పాలకులు సక్రమంగా అమలుచేయడం ఇప్పుడు ఎంతైనా అవసరం.

వాణిజ్య ప్రకటనలు - ఆసక్తికర అంశాలు

- ఫాస్ట్/జంక్ ఫుడ్స్, కూల్ డ్రింక్స్ ప్రకటనల వల్ల పిల్లలు ప్రభావితం కాకుండా ప్రభుత్వాలే చర్యలు తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ ఇదివరకే సూచించింది.
- ఏ యాడ్.. ఏ సమయంలో, ఏ వయస్సుల వారిపై ఎంత ప్రభావం చూపుతుందో తెలుసుకునే వ్యవస్థలను ఇప్పటికే కొన్ని దేశాలు రూపొందించడం విశేషం.
- చిప్స్, కుకీస్, క్యాండీలను స్కూల్స్ లో విక్రయించకూడదని కోస్టారికా ఆంక్షలు విధించగా, కొవ్వు ఎక్కువగా ఉన్న జంక్ ఫుడ్ ప్రకటనలపై మెక్సికో ఎప్పుడో నిబంధన విధించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangana Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor Plot No.21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-00020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.